
# మిసిమి

చింతనాత్మక సారస్వతం




మాసపత్రిక జనవరి 2011 ₹ 20




ఒప్పులకుప్ప వయ్యారి భామ (శీలా వీర్రాజు)

# మిసిమి

మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**

*- Dammapada.*

**సంపుటి 22** **జనవరి 2011** **సంచిక 1**

*ప్రధాన సంపాదకుడు*

చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*

అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (బుద్ధఘోషుడు)



*సమాలోచక మండలి*

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి

డాక్టర్ అబ్బూరి గోపాలకృష్ణ

డాక్టర్ జయధీర్ తిరుమల రావు

డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి

కుర్రా జితేంద్రబాబు



*సహాయ సంపాదకులు*

కాండ్రేగుల నాగేశ్వర రావు

ముంగర జాషువ

*రెసిడెంట్ ఎడిటర్*

వల్లభనేని అశ్వినీకుమార్

*సంస్థాపక సంపాదకులు*

రవీంద్రనాథ్ ఆలపాటి

<u>*Printed & Published by*</u>

Bapanna Alapati

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads,

Musheerabad, Hyderabad - 500 020.

Ph. 040-27645536

E-mail : misimi_monthly@yahoo.in

Visit us at : www.misimi-monthly.com

ప్రతి : ₹20 సంవత్సరానికి : ₹200

విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

*మీ చందా* **మిసిమి** *పేర పై చిరునామాకు పంపండి.*

మరిన్ని వివరాలకు 64వ పుట చూడండి.


# *ఈ నెల...*


కమ్మతెమ్మెరలు .................................................. 3

మరో తీరం – గావో జింగ్జియాన్ ............................. 5

– *డా. బి.వి. రామిరెడ్డి*

మూడు భాషల మూలం ....................................... 10

– *కాళోజి నారాయణ రావు*

చరిత్ర – సాహిత్యం ........................................... 17

– *విరియాల లక్ష్మీపతి*

బాపూ దారిచూపు .............................................. 20

– *విన్సెంట్ షీన్*

నాయకురాలు నాగాంబ ...................................... 22

– *డా. భట్టిప్రోలు ఆంజనేయశర్మ*

సరిగమకాలు .................................................... 28

– *ఆకెళ్ళ మల్లికార్జున శర్మ*

పాపికొండల వెన్నెల .......................................... 31

– *ఇంద్రగంటి శ్రీకాంతశర్మ*

సంక్రాంతి లక్ష్మి – శీలా వీర్రాజు ........................... 32

– *కాండ్రేగుల నాగేశ్వర రావు*

ఆధునిక కవిత్వ పరిణామం .................................. 35

– *డా. పోతుగుంట్ల విజయకుమార్*

బంజారాల జీవన విధానం.................................... 40

– *డా. కరిమిండ్ల లావణ్య*

బెంగుళూరు నాగరత్నమ్మ : త్యాగరాజ ఆరాధనోత్సవం ...... 44

– *ఎన్నార్కె*

తెలివి కొనడమా – తెలిసి కొనడమా ....................... 48

– *డా. సముద్రాల వెంకటకృష్ణ*

రుద్రగణిక ........................................................ 53

– *డా. నటరాజ రామకృష్ణ*

పింగళి లక్ష్మీకాంతం– కవనలక్ష్మీ కాంతులు................ 55

– *డా. బేతవోలు రామబ్రహ్మం, డా. అద్దంకి శ్రీనివాస్*

చదవండి (పుస్తక పరిచయం) ................................ 60

సభ్యులు కావలెను ............................................ 62

– *చిలకమర్తి లక్ష్మీనరసింహం*


*ముఖచిత్రం* : సంక్రాంతి లక్ష్మి
*రెండవ అట్ట* : ఒప్పులకుప్ప వయ్యారిభామ
*మూడవ అట్ట* : భోగిమంట
*చివరి అట్ట* : కనుమరుగవుతున్న దృశ్యం
} శీలా వీర్రాజు

ఈ శతాబ్దంలో మొదటి దశాబ్దం పూర్తయింది. ఈ పది సంవత్సరాలలో తెలుగులో కథ, నవల, కవిత, భాషా చరిత్ర, విమర్శ ప్రక్రియలే కాకుండా మాండలికాల అస్తిత్వ ధోరణుల్లో వచ్చిన ప్రయోగాత్మకమైన మార్పులు తులనాత్మకంగా పరిశీలించవలసిన అవసరం వుందని పలువురు రచయితలకు ఉత్తరాలు పంపాము. పత్రికా ముఖంగా కూడా ఇదే విషయం తెలియజేస్తూ ఈ దిశలో తమ రచనలు పంపవలసిందిగా ఆహ్వానిస్తున్నాము. పత్రిక పరిమితులకు లోబడి ఈ వ్యాస పరంపరను ప్రచురించాలని అభిలషిస్తున్నాము.

అహింసనే ఆయుధంగా చేసుకుని మహాసామ్రాజ్యానికి ఎదురు నిలబడి పోరాడిన మహాత్ముని జీవితం హింసతోనే అంతమయింది. ఆ క్షణాలలో అక్కడ వున్న ఇద్దరి వ్యక్తుల ప్రత్యక్ష కథనం 'బాపూ దారిచూపు.'

త్యాగరాజ ఆరాధనోత్సవాలు ఎంతో సంరంభంగా ప్రతి ఏటా జరుగుతాయి. అయితే ముళ్ళపొదల్లో మరుగున పడిన త్యాగరాజ సమాధిని ఉద్ధరించి, తన సంపదను, జీవిత శేషాన్ని ఆయన ఆరాధనోత్సవంలో తరింపజేసుకున్న 'నాగరత్నమ్మ' ప్రస్థానం తెలుగువారందరూ తెలుసుకోదగినది.

సామాన్యునికి సంగీతం అంటే సినిమా పాటలే – కాని సరిగమలు నేర్చుకోవాలనే ఆరాటం అందరిలోనూ ఉంటుంది. అదెలా సాధ్యమో మల్లిఖార్జున శర్మ 'సరిగమకాలు' అనే వ్యాసంలో వివరించారు.

'సంక్రాంతి లక్ష్మి'ని శీలా వీర్రాజు రంగులవల్లిగా చిత్రించారు. సంక్రాంతి అంటే 'పంటల పండగ'. ఇది అన్ని నాగరకతలలోనూ ఉన్నది. నాగలి పన్ని దుక్కిదున్ని, ఆరుగాలం కష్టపడి పంట పండించి – పండగ చేసుకునే రైతు – ప్రకృతి వైపరీత్యం పుణ్యమా అని నేడు దయనీయ స్థితిలో ఉన్నాడు...అయినా పండగ వస్తుంది, వెళ్ళిపోతుంది.


పోలవరంలో మునిగిపోతున్న పాపికొండల కోనల్లో వెన్నెల అందాలు ముందు ముందు కానరావేమోననే ఇంద్రగంటి వారి ఆందోళన మనందరిదీ కూడా.

డిసెంబరు సంచికకు పాఠకులనుంచి వచ్చిన ఎనలేని స్పందనకు కృతజ్ఞతలు.

***'మిసిమి' పాఠకులందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు.***

**– సంపాదకులు**

# కమ్మతెమ్మెరలు




*పత్రిక రూపురేఖల మార్పు జరిగినప్పటినుంచీ మాకు ఎన్నో ఉత్తరాలు వస్తున్నాయి. అభినందించినవారు, అభిశంసించిన వారూ పత్రికమీద అభిమానంతోనే అని మాకు తెలుసు. ఈ అభిప్రాయాలను పాఠకులందరితో పంచుకోవాలనే ఈ పలుకరింపు. చేవగలిగిన ఉత్తరానికి* ***'జాతక కథలు'*** *పుస్తకం బహుమతి.*

✶ "...మేధో వర్గానికి, ముందుతరాలకు మార్గదర్శకం 'మిసిమి'..." **– సాహిత్య కౌముది.**

✶ "...'మిసిమి' సంచికలు చూసి, మీరు పత్రికను మరింతగా పరివ్యాప్తంచేయాలని ప్రయత్నిస్తున్నందుకు–సఫలం కావాలని ఆశిస్తాను. మీరు ప్రచురించిన వ్యాసాలు, కవితలు గమనిస్తే మీ లక్ష్యాలు కూడా బాగా అర్థం అవుతున్నాయి..."
**– ప్రొ. పురికొండ సుబ్బాచారి.**

✶ "... 'మిసిమి' ప్రారంభ సంచిక నుండీ చదువుతున్నాను. కొత్తదనం కోసం ఎదురు చూస్తున్నాను. 'మిసిమి' కొత్త గెటప్ బాగానే వుంది. కాని వ్యాసాలు నిరాశపరిచాయి. ఎక్కువ జ్ఞాపకాల జడిలో కొట్టుకు పోవద్దు. 'భారతి'లో దిగంబర కవులను, వారి కవితలను మొట్టమొదటగా ప్రచురించారు. దీన్ని మీరు నమూనాగా తీసుకోవచ్చు.
**– గుడిపూడి సుబ్బారావు,** నల్గొండ.

✶ "... 'మిసిమి' చూసి ఒక్కసారి బిత్తరపోయాను. 20 సంవత్సరాలుగా నడుస్తున్న 'మిసిమి' ఎంత మార్పు. ఈ మార్పు జీర్ణించుకోవటం కష్టంగా వుంది. కొంత సమయం పట్టవచ్చు. మారటం సహజం. అలవాటు పడటానికి సమయం కావాలి. మీరు వేసిన కవితలు అద్భుతమైన భావప్రకటనకలవి–మళ్లీ చదివినట్లుంది. 'పుట్టుమచ్చ' లాంటి కవిత ఈ మధ్యలో రాలేదు. 'మిసిమి'ని మేధావుల పత్రికగానే వుంచమని కోరిక..." **– టి. లీల,** హైదరాబాద్.

✶ "... మీ పత్రిక కొత్త రూపం చూశాను. అన్నింటి లాగానే వుంది. టెక్నికల్ ఫర్‌పెక్షన్ లేదు. తెలుగులో రచయితలు లేరా? ఉన్నవారితో వ్రాయించటం కష్టమే అనుకోండి. అచ్చుతప్పులు రాకుండా చూడండి....సంపాదక మండలిలో అంతమంది అవసరమా...? కథలు ఎందుకు వెయ్యరు...?" **– అజయ్ ప్రసాద్** (ఈ–మెయిల్).

✶ "... నిన్ననే టపాలో నూత్న శోభతో వచ్చిన 'మిసిమి' చూసి ఆనందించాను. ఇదే రీతిలో 'మిసిమి'–మిసిమి కావాలని నా కోరిక. రవీంద్రనాథ్‌గారి చిరస్వప్నం, పరిమళభరితం కావాలని కోరుతున్నాను..."
**– ఆవంత్స సోమసుందర్,** పిఠాపురం.

✶ "... మీరు పంపిన కొత్త 'మిసిమి' కొత్త అంశాలతో అరుదుగా వుంది. ప్రకటనలతో పేపర్లు నింపే పత్రికలు చాలా వున్నాయి. అచ్చంగా కళా రంగానికి చెందిన విషయాలను, విషయ సమగ్రత, సమర్పణలో నిజాయితీ, నిబద్ధత నియమాలుగా పెట్టుకొని పదుగురికి ఆదర్శంగా వుంటున్న పత్రిక – 'మిసిమి'. తెలుగు భారతికి వెలుగు హారతి ఇవ్వాలని కోరుతూ..." **– డా. పి.ఆర్. హరినాథ్,** మైసూర్.

✶ "...వైవిధ్యమైన అనుభూతిని అందించిందనడంలో సందేహం లేదు. అయితే కొన్ని సూచనలు : పాత రచనలు ముద్రించవలసిన సందర్భం వస్తే (వీలయితే అవాయిడ్ చేయండి), నేటి అవసరం, పూర్వపరాల వివరాలిస్తే బాగుంటుంది. కళాస్రష్టలు, రచయితలు, మేధావుల జ్ఞాపకాలు, ఒక శీర్షిక, ధారావాహికంగా వేస్తే బాగుంటుంది. మంచి కవితలు

వస్తేనే ప్రచురించండి. నవలలు, కథలు కూడా ఆలోచించ తగినవే. కళాకారుల 'కళాదృక్పథాన్ని' తెలియజేస్తూ వ్యాసాలు రాయించండి. బొమ్మలు ఎక్కువగా వుంటే కంటికి రిలీఫ్. రచనలలోని పతాక స్థాయిని తెలియజేస్తూ లీడ్ రాయండి. కొన్ని పారిభాషిక పదాల అర్థాలను, పాద సూచికతో ఇస్తే బాగుంటుందేమో... పుస్తక పరిచయం పొగడ్త లేకుండా, తెగడ్త కావాలని పెట్టకుండా ఉండాలని సూచన. అక్షర దోషాలు చాలా తగ్గినాయి. కాని అవి కూడా వుండకపోతే 'మిసిమి' స్థాయికి బాగుంటుంది..." **– కాకుమాని శ్రీనివాసరావు,** బుద్ధవరం.

✶ "...భారతీయ సంస్కృతిని ఆత్మానుభూతి చేసే సాహిత్య సంగీత నృత్య శిల్పాది కళావిశేషాలు 'మిసిమి' సుసంపన్నం చేయగలవు..." **– డా. వి.వి.ఎల్. నరసింహారావు,** హైదరాబాద్

✶ "...నెల రోజులు తిరిగి తిరిగి ఇంటికి చేరిన నన్ను 'మిసిమి' పలకరించింది. ఈ దూరదేశం నుంచి మావూరు వెళ్ళినట్లుంది. మీరు ఫోటోలు లేకుండా డ్రాయింగులు వేయటం ఎంతో బాగుంది..." **– సురేంద్ర** (ఈ-మెయిల్).

✶ "...కవితలు ఓ.కే. 'మిసిమి' నామకరణం గురించి ఇచ్చిన వివరాలు... రవీంద్రనాథ్ గారే 'మిసిమి' పేరు ఎంపిక చేసుకున్నారు. పురాణం సుబ్రమణ్యశర్మ 'మేలిమి బంగారం' అని అర్థం చెప్పారు. బూదరాజు రాధాకృష్ణ 'మిసిమి' పద్యకావ్యాల్లో ఎవరు ప్రయోగించారో ప్రమాణం చూపారు. ఇదీ నాకు తెలిసింది. నవంబరు సంచిక వాషింగ్టన్‌కు 20 తారీకున వచ్చింది..." **– డా. ఇన్నయ్య** (ఈ-మెయిల్).

✶ "...ఈ నెల సంచిక ఆసాంతం చదివాను. 'అమృతాశ్రువులు', 'లాస్యనర్తనం', 'తెలుగులో అధిక్షేప కావ్యాలు...' బాగున్నాయి. 'హెర్టాముల్లర్' ప్రసంగ అనువాదం అసలైన తెలుగు వ్యాసంలా వుంది. 'చిత్రశిల్పి అజీజ్', 'కదిలే జ్ఞాపకం', 'కవి ఇస్మాయిల్', 'ఎదుగుదలకు చేయూత', 'సంగీత సాహిత్యాల సంగమం' ఈ వ్యాసాలలో ఎందరో ప్రముఖులను కళ్ళముందుకు తీసుకు వచ్చి చూపారు. మిగతావి బాగున్నప్పటికీ అవి ప్రత్యేక రంగాలకు చెందిన వ్యాసాలు గనుక నాకు నచ్చలేదు. 'మిసిమి' అట్టలు కళాఖండ దస్త్రాలు! 'అందాల జానపదం'లో అందమైన బొమ్మలువేసి వ్యాసానికి వాసనలు అద్దారు... 'నేనెక్కడ' అని ప్రశ్నించి 'ఈ ఫోటోలో వున్న వ్యక్తి ఆచూకి తెలపండి' అని అన్నట్లుంది. ఈ వ్యక్తిని ఎక్కడో చూసినట్లుంది! మీరు అద్దంలో – అదీ దానికి మరకలు కాకుండా చూడండి. మీకు కనపడతాడు..."
**– పెద్ది సాంబశివరావు,** గుంటూరు.

✶ "... మిసిమి సంచికలన్నీ తిరగవేసి – నవంబరు సంచిక సంపూర్ణంగా చదివాను. రవీంద్రనాథ్ గారు కొనసాగించిన ఉత్తమ ప్రమాణాలతో ముద్రించడమేగాక సంచిక పరిమాణాన్ని, పుటలను పెంచటం పత్రికకు పరిపూర్ణత నిచ్చింది. ఇన్ని మంచి వ్యాసాలను ఈ సంచికలో గుదిగుచ్చినందుకు అభినందిస్తున్నాను. మిగతా సంచికలు కూడా ఇదే ప్రమాణంలో వుంటాయని భావిస్తున్నాను. మీకు రచనా సహకారం అందించటానికి నేనెప్పుడూ సిద్ధంగా ఉంటాను..."
**– కళ్యాణమిత్ర ముక్కాల రాజగోపాలరావు,** గుంటూరు.


✶. "...వివిధ శీర్షికలతో రూపాంతరం చెందిన పత్రిక అలరించింది. మనోజ్‌దాస్ గారి వ్యాసం–జీవితానికి అర్థం....అవుతూనే వచ్చింది. 'మానాన్నగారు' పరిచయం, రచయితల బలహీనతలకు ఐతిహాసిక ప్రభావం ఉంటుంది. చిత్రకారుని అంతరంగం – వోలేటి పార్వతీశం, నటరాజ రామకృష్ణగారి నాట్యమే కాదు రచనకూడా కదం తొక్కుతోంది. సంస్కృతి...లో మానవులంతా ఒకే జాతి, ఒకే సంస్కృతి. ఇంద్రుడు శారీరక సుఖాలను కాంక్షించిన వాడు. కర్మకాలి మన అధిపతి, గతకాలమ్.... అందరూ విధిచేత చిక్కినవారమే.

నాగరకత...ఎన్ని యుగాలైన నాగరకత విషం కక్కుతూనే వుంది. ఆకలి అయినపుడు, పులికి, సింహానికి తేడా ఏముంటుంది? ఆత్మవంచన చేసుకునే పీఠాధిపతులు... ఇలా ఎన్నైనా, ఎన్నో భావాలతో అలజడిగా వుండే నా మనస్సు కాగితం మీద పెట్టలేని పిరికితనానికి అద్దం ఈ రచన. శూన్యగీతి...సంసారగీతి, రైలు పట్టాలే సంసారం. శ్రీపాద ఉత్తరం...తారీఖులుంటే బాగుండేది. కదిలించింది. 'చందమామ' గురించి – 'మిసిమి' గురించి వ్రాస్తుంటే ముగింపు వుంటుందా..." **– రత్తయ్య,** తెనాలి.

# మరో తీరం

- బి. వి. రామిరెడ్డి

**స్వీడిష్ నోబెల్ అకాడమీవారు 2000 సం॥పు నోబెల్ సాహితీ పురస్కారం అందజేస్తూ "చేదు నిజాలని వెలికితీసి, చైనా సాహిత్యాన్ని కొత్త పుంతలు త్రొక్కించిన గావో జింగ్జియాన్ భాషాచాతుర్యానికి, సార్వజనీనతకు ఈ పురస్కారాన్ని అందజేస్తున్నాము" అని అన్నారు.**



గావో జింగ్జియాన్

*తూర్పు చైనాలో 1940 జనవరి 4వ తేదీన జన్మించిన గావో జింగ్జియాన్ ప్రస్తుతం ఫ్రాన్స్ దేశపు పౌరుడు. వచన రచనలో, నాటకాలు వ్రాసి దర్శకత్వం వహించటంలో, సాహిత్య విమర్శలోనే గాక ఒక చిత్రకారునిగా కూడా పేరు గడించారు. జపాన్, చైనాను ఆక్రమించిన తర్వాతి కాలంలో గావో తండ్రి బ్యాంకర్‌గాను, తల్లి నటిగానూ ఉన్నపుడు గావో నాటకాల మీద ఆసక్తి పెంచుకున్నారు. అప్పుడే ఫ్రెంచ్ భాషలో డిగ్రీ కూడా చేశారు. చైనా సాంస్కృతిక విప్లవపు విపరీతపు కాలంలో ఆయన్ను 'రి ఎడ్యుకేషన్ కాంపు'కు పంపుతూ ఒక పెట్టె నిండా వున్న ఆయన వ్రాత పతులను తగలబెట్టారు. 'ది అదర్ షోర్' అనే నాటకాన్ని 1986లో నిషేధించారు. అప్పటి వరకు ఎన్నో నాటకాలు ప్రదర్శించిన బీజింగ్‌లోని 'థియేటర్ ఆఫ్ పాప్యులర్ ఆర్ట్' గావో నాటకాల ప్రదర్శనలు ఆపివేసింది. అప్పటినుంచి దాదాపు పదినెలల పాటు గావో, సిచువోన్ ప్రాంతపు కొండ కోనల్లో కాలినడకన తిరిగాడు - 1987లో తప్పని పరిస్థితుల్లో చైనా వదలి ఫ్రాన్స్ చేరాడు. చివరికి పారిస్‌లో స్థిరపడి రచనా వ్యాసంగం పునఃప్రారంభించాడు. ఈయన చైనాలో తియాన్‌మన్ స్క్వేర్‌లో జరిగిన దారుణ మారణ కాండ నేపథ్యంలో 'కాందిశీకుడు' వ్రాశారు. వీరి మరికొన్ని రచనలు వైల్డ్‌మాన్; సోల్ మౌంటేన్; ఒన్‌మాన్ బైబిల్; ఆర్ట్ ఆఫ్ మోడరన్ ఫిక్షన్. గావో సిరాతో చిత్రాలు వేస్తారు. ఆయన ముప్పయిపైగా అంతర్జాతీయ చిత్ర ప్రదర్శనలు ఇచ్చారు. ఆయన పుస్తకాలన్నిటికి ఆయనే ముఖచిత్రాలు వేసుకున్నారు.*


***వీరు పొందిన పురస్కారాలు:*** *1992లో షెవలీయర్ ఆర్డర్ ఫర్ ఆర్ట్స్ అండ్ లెటర్స్; 1994లో బెల్జిక్ ప్రీ; 1997లో నోవెల్ ఆన్ ప్రీ (సోల్ మౌంటేన్).*

ఎన్నో సదవకాశాలు, ముఖ్యంగా విధి, నన్ను ఈ సభా పీఠం మీదికి నడిపించిందని నాకనిపిస్తోంది. దేవుడున్నాడా? లేడా? అనే చర్చను ప్రక్కనపెట్టి, నేను నాస్తికుణ్ణైనప్పటికీ అతీతమైనదాన్ని నమ్ముతాను.

మనిషి దేవుడు కాలేడు, దేవుడిస్థానాన్ని ఆక్రమించలేడు. సూపర్‌మాన్‌గా ప్రపంచాన్ని పాలించలేడు. 'నీషే' తరువాతి శతాబ్దిలో మనిషి చేసిన సర్వనాశకాలు చరిత్రను భయంకరమైన నల్లసిరాతో లిఖించాయి. అన్ని విధాలైన సూపర్‌మెన్ దేశనాయకులుగా, జాతి నిర్ణాయకులుగా అనేక విధాలైన నేరాలకు పాల్పడ్డారు. చరిత్ర గురించీ, రాజకీయాల గురించీ సమయాన్ని వృథా చేసుకునే సందర్భం కాదిది. వ్యక్తిగా, రచయితగా నా అభిప్రాయాలను వ్యక్తీకరించుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకుంటున్నాను. రచయితా సామాన్యుడే. అయితే కొంచెం ఎక్కువగా

డా. బి.వి. రామిరెడ్డి, ఫోన్ : 9908856530

సున్నితమనస్కుడై వుంటాడు. అలాంటి సున్నిత మనస్కులు ఎక్కువ బలహీనులై వుంటారు. రచయిత సంపూర్ణమైన నిజాయితీ పరుడుగానో, లేక తన ప్రజల ప్రతినిధిగానో మాట్లాడడు. అతని స్వరం బలహీనంగా వుంటుంది కాని తన స్వరాన్ని బలంగా వినిపించడానికే ప్రయత్నిస్తాడు.



నేను చెప్పదలుచుకున్నదేమంటే, అన్ని కాలాల్లోను సాహిత్యం వ్యక్తియొక్క అభివ్యక్తి. సాహిత్యం జాతీయగీతంగానో, జాతీయ జెండాగానో, రాజకీయ వ్యాఖ్యానంగానో, ఒక జాతి గొంతుకగానో, మారితే అది ప్రచారస్థాయికి దిగజారుతుంది. అలాంటి రచన సాహిత్యాత్మను కోల్పోతుంది. చివరికి అధికారానికీ, లాభార్జనకీ ప్రతి రూపమౌతుంది.

జరిగిపోయిన శతాబ్ది ఇలాంటి దురదృష్టాన్నే ఎదుర్కొంది. ఇంతకు ముందు శతాబ్దాలకంటే రాజకీయంగా, అధికారపరంగా సాహిత్యమూ, సాహిత్యకారులూ అలాంటి అనుకోని వొత్తిడికి లోనయ్యారు.

సాహిత్యం తనని తాను కాపాడుకోవాలన్నా, తన ఉనికిని రక్షించుకోవాలన్నా అవి తప్పనిసరిగా వ్యక్తి గొంతును వినిపించాల్సి వుంటుంది. సహజంగా సాహిత్యం వ్యక్తిగత స్పందనల్లోంచి రూపుదిద్దుకుంటుంది. రచయిత యొక్క రాజకీయ సంబంధమైన కార్యకలాపాలు సాహిత్యాన్ని ఎలా హింసిస్తాయో గత శతాబ్ది నిరూపించింది. సాహిత్యేతర విషయాలు, అధికారంతో కలిగిన ఆదర్శాలు సాహిత్యాన్ని, వ్యక్తిని నాశనం చేస్తాయి.

ఇరవయ్యో శతాబ్దపు చైనా సాహిత్యం రాజకీయ నియంతృత్వంలో ఉక్కిరి బిక్కిరయ్యింది. సాహిత్యంలో విప్లవవాదం, విప్లవవాద సాహిత్యం రెండూ కలిసి సాహిత్యాన్ని ఉరితీశాయి. చైనా సంప్రదాయం మీద, సాహిత్యం పేరుతో దండయాత్ర చేశాయి. పుస్తకాలు తగలబెట్టబడ్డాయి. అసంఖ్యాక రచయితలు చంపబడ్డారు. జైళ్ళలోకి నెట్టబడ్డారు. విదేశాలకు వలసపోయారు. కఠోర శ్రమజీవులుగా హింసింపబడ్డారు. చైనా రాచరికపు పాలనలో కంటె ఇవి విపరీతంగా జరిగాయి. సాహితీ స్వేచ్ఛ ఎన్నో ఇబ్బందులకు గురైంది.

రచయిత మేధో స్వేచ్ఛను సాధించుకోవాలంటే పారిపోవడమో, మౌనం వహించడమో తప్పనిసరి అయింది. రచయిత చాలాకాలం భావవ్యక్తీకరణ చేసుకోకపోతే అది ఆత్మహత్య సదృశ మౌతుంది. భావవ్యక్తీకరణ కోసం అతడు వలసపోక తప్పదు. ప్రాచ్య, పాశ్చాత్య సాహితీ చరిత్రలను పరిశీలిస్తే, క్యుయులీను నుంచి డాంటే, జాయిన్, థామన్‌మాన్, సోల్జెనిత్సిన్ వరకు ఇలాంటి పరిస్థితుల నెదుర్కున్నవారే. చైనా మేధోజీవులు 1989 తియాన్మెన్ ఊచకోత సంఘటన తరువాత వలసపోయారు. కవి, రచయిత తన గొంతును కాపాడుకోవాలంటే అది తప్పనిసరి.

మావో జెడాంగ్ నియంతృత్వంలో అలాంటి అవకాశం కూడా లేకుండా పోయింది. పూర్వం రాజుల నియంతృత్వ పాలనలో పర్వతాల్లోని బౌద్ధారామాలు మేధావులకు ఆశ్రయమిచ్చేవి. రచయిత తన స్వేచ్ఛను కాపాడుకోవడానికి తనతో తాను సంభాషించుకోవాలి – అదీ రహస్యంగా! వ్యక్తి తన అంతరాత్మను కాపాడుకోవడానికి సాహిత్యం అవకాశమిస్తుంది.

తనతో తాను సంభాషించుకోవడం సాహిత్యానికి ఆరంభం. భావ వ్యక్తీకరణకోసం భాషను ఉపయోగించు కోవడం తరువాతి పరిణామం. వ్యక్తి తన భావాలను, ఆలోచనలను భాషలోకి వొంపుతాడు. అందుకోసం వ్రాసే పదాలే సాహిత్యంగా రూపుదిద్దుకుంటాయి. ఆ ప్రయత్నం జరుగుతున్నప్పుడు ఉపయోగాన్ని గురించిన ఆలోచనే వుండదు. రచన ఒక సౌఖ్యం. నా అంతరంగికమైన ఒంటరి తనాన్ని వ్యక్తీకరించుకునేందుకు నేను నా నవల "సోల్ మౌంటెన్" వ్రాశాను. ఆ నవలను నేను నా కోసమే వ్రాసుకున్నాను.

నా రచనానుభవంతో నేను చెప్పేదేమంటే–సాహిత్యం అంతరాత్మను బలపరుచు కునేందుకు చేసే ప్రయత్నమే. రచయిత తన ఆత్మ పూర్ణతకోసం చేసే ప్రయత్నమే సాహిత్యం.


సాహిత్య చరిత్రలో ఎన్నో గొప్ప రచనలు, ఆ రచయిత జీవించి ఉండిన కాలంలో ప్రచురితం కాలేదు. షేక్స్పియర్

లాగే చైనా సాహిత్యంలో గొప్ప రచనలు చేసిన నలుగురు సాహితీ కారుల్ని గురించిన వివరాలు పూర్తిగా తెలియవు. ఆధునిక కాల్పనిక రచయిత కాఫ్కా, 20వ శతాబ్ది కవి ఫెర్నాండో పెస్సోవాలను గురించిన సమగ్ర సమాచారం మనకు తెలుసా? వారు తమ రచనలు వ్యక్తియొక్క నిస్సహాయతను తెలియజేసేందుకే తప్ప ప్రపంచాన్నుద్ధ రిద్దామనే ఉద్దేశ్యంతో వాళ్లు రచన చేయలేదు.

భాష మానవ సంస్కృతిని పారదర్శీకరిస్తుంది. మాట వ్యక్తుల మధ్య భావ వ్యక్తీకరణకు తోడ్పడుతుంది. ఇప్పుడు మనం పంచుకునే సాహితీ వ్యక్తీకరణ శాశ్వతమైన ఆధ్యాత్మిక విలువలకు అనుసంధానమౌతుంది.

ప్రస్తుతం ఒక జాతీయ సంస్కృతిని సమర్థించడం సమస్యాత్మకం. నాలో నేను, జన్మించిన చైనా సంస్కృతి వుంది. సంస్కృతి, భాష ఎప్పుడూ ఒకదానితో వొకటి అవినాభావ సంబంధాన్ని కలిగివుంటాయి. వాటివల్ల ఆలోచనాధోరణి, అవగాహన, అభివ్యక్తి ఏర్పడతాయి.

సాహిత్యం జాతీయతా సరిహద్దుల్ని జయిస్తుంది. నేటి రచయిత తన జాతి సంస్కృతి వల్లనే గాక ప్రపంచజాతుల సంస్కృతీ ప్రభావానికి లోనౌతున్నాడు. సాహిత్యం ఆదర్శవాదాలను, జాతీయాత్మీయ సరిహద్దులను, ఇజాలను అధిగమిస్తుంది. మనిషి అస్తిత్వం వీటన్నిటికంటె ఉన్నతమైనది. ప్రపంచ మానవ సమాజాల అస్తిత్వ సందేశాలను అది పరిశీలిస్తుంది. బాహ్యమైన వొత్తిళ్ళు, అడ్డుగోడలు సాహిత్యంమీద జులుం చలాయిస్తూనే వున్నాయి. రాజకీయాలు, సంఘం, నీతులు, ఆనవాయితీలు తమ అవసరాలకోసం దర్జీవాడిలాగ సాహిత్యాన్ని కత్తిరించే ప్రయత్నం చేస్తుంటాయి.



సాహిత్యానికి తన విలువలు తనకున్నాయి. ఏ సాహితీ రూపమైనా మానవభావ తీవ్రతలతో అనుసంధించి వుంటుంది. వ్యక్తుల వ్యక్తిత్వాన్ని బట్టి భావతీవ్రతలుంటాయి. వారి స్థాయిని బట్టి వారి విమర్శలుంటాయి. ప్రపంచ మంతటికీ ఆమోద యోగ్యమైన విమర్శనా సూత్రాలు లేవు. విమర్శనాత్మక భావుకత పాఠకుడికి అందమైన కవితాత్మీయ భావన కలిగించి రచయిత తన రచనలో చొప్పించిన సాహితీ సౌరభాలను రంజింప చేస్తుంది. ఈ రంజనలో స్థాయీభేదా లుంటాయి. రచయితలోని రసన మార్కెట్ పోకడల ననుసరిస్తే అది సాహిత్యానికి ఆత్మహత్యా సదృశమౌతుంది.

మానవీయ భావావేశాల మీద ఆధారపడ్డ రసానుభూతికి కాలం చెల్లదు. పదేళ్ళ క్రితం నా నవల "సోల్ మౌంటెన్" పూర్తి చేశాక ఇలాంటి రచనల అవసరాన్ని తెలుపుతూ ఒక చిన్న వ్యాసం వ్రాశాను. దాని సారాంశం ఇదీ: *"సాహిత్యానికి రాజకీయాలతో సంబంధం లేదు. అది వ్యక్తిగతమైనది. అది భావావేశాల, అనుభవాల పరిశీలనాత్మక మేధో స్థిరీకరణ. రచయిత ప్రజల ఆజ్ఞలను అమలు చేసే హీరోకాదు, పూజ్యనీయమైన విగ్రహమూ కాదు. నేరస్తుడూ, ప్రజావిరోధీ కాదు. ఒక్కోసారి అధికారంలో వున్నవారు ప్రజల దృష్టిని మళ్ళించేందుకు రచయితలను బలి చేస్తుంటారు"*

రచయితకు పాఠకుడికీ మధ్య వుండేది ఆధ్యాత్మిక బంధం. సాహిత్యంలో రచయితా, పాఠకుడూ తమదైన నిర్ణాయక పాత్రలను పోషిస్తారు. అందుకే సాహిత్యానికి మందతో బాధ్యతలేదు. ఇలాంటి దాన్నే 'కోల్డ్ లిటరేచర్' అంటాం. (మానవ సమాజం ఒక విధమైన ఆధ్యాత్మిక క్రమాన్ని వెతుకుతుంది) ఇలాంటి సాహిత్యం ప్రస్తుతం రావడంలేదు. పూర్వం అవి రాజకీయ జులుంకి వ్యతిరేకంగా పోరాడవలసి వచ్చేది. ప్రస్తుతం అది వ్యాపార విలువలమయమైన వినిమయ సమాజంపై పోరాడవలసి వస్తోంది. దాని అస్తిత్వం వొంటరితనాన్ని భరించడంమీద ఆధారపడి వుంది.

అలాంటి రచనా విలువలకు జీవితాన్నిచ్చుకున్న రచయితకు జీవితం దుర్భరమౌతుంది. కాఫ్కా, కామో, క్యూకిన్ *లాంటివారు అలాంటి రచనా ప్రయత్నం చేశారు. వారు జీవించిన కాలంలో వారి రచనలు ప్రచురణకు నోచుకోలేదు. వారెలాంటి సాహిత్యోద్యమాలను సృజించలేదు. కీర్తి ప్రతిష్ఠలను మూటగట్టుకోలేదు, సామాజిక గుర్తింపు కోసం అర్రులు చాచలేదు. తమ రచనా*

*క్రియలోనే ఆనందాన్నిపొందారు. ఏజాతైనా వినిమయ వ్యతిరేక సాహిత్యాన్ని ఆదరించుకోకపోవడం ఆ జాతియొక్క విషాదం.*

నా జీవితకాలంలోనే స్వీడిష్ అకాడమీనుండి ఇంతగొప్ప గౌరవ పురస్కారాన్నందుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ప్రపంచంలోని ఎందరో మిత్రులు నాకు ఇందుకు సహాయపడ్డారు. వారు ఎలాంటి ప్రతిఫలాన్నీ ఆశించకుండా, ఎన్ని కష్టాలెదురైనా జంకకుండా నా సాహిత్యాన్ని అనువదించి, ప్రచురించి, వాటి విలువను బేరీజు వేశారు. పేరు పేరునా వారికి నేను కృతజ్ఞతలు చెప్పుకోవడం లేదు. ఎందుకంటే వారి సంఖ్య అసంఖ్యాకం.



నన్ను అంగీకరించి నందుకు ఫ్రాన్సు దేశానికి నేను కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఫ్రాన్సులో సాహిత్యం, కళలు గౌరవించబడతాయి. వ్రాసుకోవడానికి అవసరమైన స్వేచ్ఛ, పాఠకులు అక్కడ నాకు లభించారు. అదృష్టవశాత్తు నేను ఏకాకినికాదు. మరోవిషయం కూడా చెప్పాలి. జీవితం పండుగ కాదు. స్వీడన్‌లాగ మిగిలిన ప్రపంచం ప్రశాంతంగాలేదు. ఇక్కడ గత నూట ఎనభై సంవత్సరాలుగా యుద్ధం లేదు. మనుషులకు బుర్రలున్నాయి కాని ఆలోచించే శక్తి లేదు. గత చరిత్ర నించి గుణపాఠాలు నేర్చుకోరు.

మానవజాతి ప్రగతి నుండి, ప్రగతికి పయనించడం లేదు. చరిత్ర, సంస్కృతి సమానంగా ముందుకు కదలడం లేదు. మధ్య ప్రాచ్య స్తబ్దతనుండి సర్వనాశనం దాకా రెండు ప్రపంచ యుద్ధాలు, ఇరవయ్యో శతాబ్దపు యుద్ధాలు, ప్రజల్ని అంతమొందించే పద్ధతులు కనుపించని విచిత్ర రూపాలను సంతరించుకున్నాయి. శాస్త్ర సాంకేతిక ప్రగతి మానవ సమాజ సంస్కృతీ ప్రగతికి దోహదంగా లేదు. శాస్త్రీయ పద్ధతులు చరిత్రను విశ్లేషించి చెప్పలేకపోతున్నాయి. విప్లవమనే ఊహాత్మక తపన మట్టి పాలైంది. జీవించి వున్న వారి హృదయాలలో చేదు అనుభవాలే మిగిలాయి.

కాదనుకున్నదాన్ని కాదనడం అవుననడం కాదు. విప్లవాల ఊహలు పాత ప్రపంచపు శిథిలాలమీదే ఆధారపడి వున్నాయి. సామాజిక విప్లవ సిద్ధాంతాన్ని సాహిత్యానికి కూడా ఆపాదించి, సృజన క్రియను యుద్ధభూమిగా మార్చి, సంస్కృతీ సంప్రదాయాలను నాశనం చేశారు. ప్రతిదీ మరల శూన్యం నుంచి ప్రారంభించవలసిన స్థితి. ఆధునికీకరణ మంచిదే. సాహితీ చరిత్ర ఎడతెగని ప్రయాణం.

రచయిత సృష్టికర్త కాలేడు. అందుచేత తానే దేవుణ్ణని గర్వపడాల్సిన అవసరం లేదు. అతడలా ఆలోచిస్తే మానసికంగా వెర్రివాడై ప్రపంచాన్ని ఒక భ్రమగా మార్చుకునే ప్రమాదం వుంది. అప్పుడతడు సహజంగా జీవించలేడు. రచయిత ప్రవక్త కాదు. భ్రమల్ని తొలగించుకుని వర్తమానంలో జీవించడమే ముఖ్యం. ఆత్మపరీక్షతో వర్తమానాన్ని బేరీజు వేసుకోవాలి. మనిషిలోని వొత్తిడి, పిరికితనం, అత్యుత్సాహం అతణ్ణి బాధించడమేకాక సాటి మనుషులకు ఇబ్బందికరంగా మారతాయి. మనిషి యొక్క జ్ఞానాన్ని, ప్రవర్తనని అర్థం చేసుకోవడం, వివరించడం కష్టతరం. సాహిత్యం అంటే ప్రధానంగా మనిషి తన అంతరాత్మను పరిశీలించుకుని, ఎదగడానికి ప్రయత్నించడం. మానవ ప్రపంచం గురించి తెలియని వాటిని, తెలుసుకోవడానికి సాధ్యం కాని వాటిని తెలుసుకునేందుకు ప్రయత్నించడం సాహిత్యం యొక్క గమ్యం.

కొత్త శతాబ్దం వచ్చేసింది. సాహిత్యంలో విప్లవం, విప్లవ సాహిత్యం, ఆదర్శవాదం వంటివి అంత్య దశకు వచ్చాయి. ఒక శతాబ్దంపాటు కొనసాగిన సాంఘిక ఊహా ప్రపంచం అంతర్ధానమైంది. సాహిత్యం సిద్ధాంతాల సంకెళ్ళు తెంచుకొని మానవ సమాజపు సందేహాల దగ్గరికి తిరిగి వస్తుంది. మానవ సమాజపు సందేహాల్లో చాల తక్కువ మార్పే వచ్చింది. అది సాహిత్యానికి శాశ్వతమైన విషయం.

ఈ యుగానికి ప్రవచనాలు, వాగ్దానాలు లేవు. రచయిత ప్రవక్త పాత్ర, న్యాయనిర్ణేత పాత్ర పోవాలి. ఎన్నో పాతకాలపు ప్రవచనాలు అబద్ధాలని తేలిపోయాయి. రచయిత సాక్షిగా, సత్యవక్తగా వుండడం కుదరదు.

సాహిత్యం ఉత్త డాక్యుమెంటుకాదు. మానవ అస్తిత్వపు సిసలైన స్థితిని చిత్రించడమే సాహిత్యపు అంతశ్శక్తి . రచయితకు అంతర్దృష్టి సత్య శోధన ముఖ్యం. అతని భాషా ప్రయోగ చమత్కృతులు ముఖ్యం కావు. వ్యక్తిగతంగా 'సత్యం' అనే దానికి వారిచ్చుకునే నిర్వచనాలు వేరు వేరుగా వుంటాయి. నీతుల్ని బోధించడం రచయిత విధి కాదు. ప్రపంచ మానవాంత రంగాలను విశదీకరించే ప్రయత్నంలో రచయిత తననూ విశదీకరించుకుంటాడు, రచయితకు సాహిత్యంలోని సత్యమే సిసలైన నీతి. రచయిత రచనలోని మానవ జీవితపు సత్యమైన జీవి శక్తి గత శతాబ్దాలనుండి నేటి వరకూ జీవించే వుంది. అందువల్లనే గ్రీకు విషాదాంత నాటకం, షేక్స్పియర్ కాలాన్ని జయించి నిలిచాయి.

సాహిత్యం ఊహనూ ఆలంబన చేసుకుంటుంది. స్పందన లేని ఊహ అనుభవానికి దూరమైపోతుంది. అలాంటి సాహిత్యం పఠితలను ఆకట్టుకోలేదు. ప్రాచీన గ్రంథ పఠనం, వ్యక్తిగతానుభవాలు చూసినవీ, విన్నవీ సాహిత్య భాషకు అద్భుతమైన శక్తినిస్తాయి. భాష మనస్సునూ, శరీరాన్నీ ప్రభావితం చేస్తుంది. రచయిత ప్రతిభను బట్టి అతని భాష రూపుదిద్దుకుంటుంది.

"నేను మాట్లాడుతాను, కాబట్టి నేనున్నాను" – అన్న డెకార్టె మాట రచయితకూ వర్తిస్తుంది. రచయిత యొక్క ఈ 'నేను' అతనికీ, నీకూ, అందరికీ ప్రతీక.

నా రచనల్లో పాత్రలకు బదులుగా సర్వనామాల్ని ప్రయోగిస్తాను. అలా చేయడంవల్ల ఒకరకమైన దూరభావన సృజించబడుతుంది. కాల్పనిక రచన, నాటకం అంతంకావు. అలాగని ఏ సాహిత్య కళా ప్రక్రియకూ అంతంలేదు.

*మానవ సామాజిక సంస్కృతితో బాటు జన్మించిన భాషకున్న విశ్లేషణా శక్తులు అద్భుతమైనవి. ఇప్పుడున్న ప్రపంచం పాతబడి పోయినా, అర్థం కాకుండా పోయినా, అసంబద్ధంగా వున్నా రచయిత దాన్ని తుడిచి పెట్టలేడు. సాహిత్యం చిరంజీవి. పాఠకులు అతణ్ణి చదువుతున్నంత కాలమూ రచయిత జీవించే వుంటాడు.* మానవజాతి వున్నంత కాలమూ సాహితీ ప్రపంచంలో తను జీవించే వుండాలని ప్రతి రచయితా ఆశపడతాడు. సాహిత్యంలోని శాశ్వత వర్తమానం వ్యక్తిజీవితాన్ని స్థిరీకరిస్తుంది. అందుకే అది సాహిత్యం అవుతుంది.

రచన భుక్తి కోసం కాదు అవసరరాహిత్యంతో లీనమై చేసే రచనా స్వభావమే సాహిత్యం. రచన వృత్తిగా మారడం వికృతిపరిణామం. ఆధునిక మార్కెట్ ప్రపంచంలో పుస్తకాలూ వస్తువులే అయ్యాయి. అందుచేతనే సాహితీ సంస్థలు అదృశ్య మయ్యాయి. ఈ కాలపు పరిణామాలను, ఫ్యాషన్లను సంతృప్తి పరిచేందుకే మార్కెట్ వర్గాలు ప్రయత్నిస్తాయి. సాహిత్యం అంటే అత్యధిక కాపీలు అమ్ముడు పోవడం కాదు. రచనా స్వేచ్ఛ కొంటే వచ్చేదికాదు. అది రచయిత అంతరంగికావసరం. రచయిత తన అవసరానికి స్వేచ్ఛను మారకం చేస్తే, స్వేచ్ఛా విహంగం ఎగిరి పోతుంది.

రచయిత దేనికీ ప్రలోభపడక ఆత్మ తృప్తికోసమే రాస్తాడు. అతడు సంఘాన్ని ఛాలెంజ్ చేస్తాడు. సాహిత్యం కోపంతో అరిచే అరుపు కాదు. అరుపూ, కోపమూ, ఛాలెంజ్ సమాజాన్ని మార్చ లేవు. వ్యక్తి తపనతో సాంఘికమైన, మానవీయమైన లోపాలను అధిగమించేందుకు చేసే ప్రయత్నం గొప్పది. సాహిత్యం అందుకు దోహదపడాలి.

గౌరవనీయులైన అకాడెమీ సభ్యులారా, నాకు ఈ అత్యున్నతమైన నోబెల్ సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నందుకు మీకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ఇది సాహితీ స్వేచ్ఛకు మీరిస్తున్న గౌరవంగా భావిస్తున్నాను. ఈ సభాపీఠంమీద నించుని ప్రపంచంతో సంభాషించే అవకాశాన్ని నాకు కల్పించినందుకు మీకు ధన్యవాదాలు. ఒక బక్క మనిషియొక్క బలహీనమైన గొంతు ప్రపంచమంతటికీ వినిపించడానికి ఇంతకన్నా గొప్ప అవకాశం ఏముంటుంది? బహుశా నోబెల్ పురస్కారానికి అర్థమిదే! మి

**కనుల్లో చీకటి....**

పగళ్ళన్ని కలలేనా,
ఆశలన్ని ఆవిరులేనా...
పవలు రేలు కలలా –
కలవరింతలా,
చూస్తున్నది కలా? కలలో
చూస్తున్నానా?
ఈ అలలహోరు –
గుప్పిటలో ఇసక,
ఈ బంగారు కాలం ఎలా
జారి పోతున్నది?
అయ్యో, ఆపేదెలా,
మబ్బుల్ని
కౌగిలించేదెలా?
ఈ కాలం ఆగదు,
నీవు నా కలలో
కలవి...
కనిపించని
వెలుతురివి....

– కవిత

# మూడు భాషల మూలం

- కాళోజి నారాయణరావు


మూడు భాషల మధ్య పుట్టి పెరిగిన జీవితం నాది. తెలుగయినా, ఉర్దూ అయినా, ఇంగ్లీషయినా అన్నిటికన్నా ఎక్కువ చదువుకుంది ఉర్దూ - పదివాచకాలు. తెలుగు చదువుకున్నది నాలుగు వాచకాలు. అప్పటి రాజ్యం నైజాము నవాబుది. దీనికి సంబంధించిన భాష - సర్కారు భాష. విద్యా భాష అంతా ఉర్దూ. ఇంట్లో పరిస్థితి ఎటువంటిది? నాయనగారు కాళోజీ రంగారావుగారు ఉర్దూ, ఫారసీ, ఇంగ్లీషులో పండితులు. ఆయనకు అన్నిటికంటే తక్కువ వచ్చింది తెలుగే. ఆయన పెళ్ళి చేసుకున్నది మహారాష్ట్ర కర్నాటక వాళ్ళని. కాని ఎంతలాభం కలిగింది. మూడు భాషలు మాతృభాషలుగా మాకు వచ్చేశాయి. ఎప్పుడైనా మేనమామ వచ్చేవారు. ఆయన సంస్కృతంలో మహాపండితుడు. శాస్త్రి వేదతీర్థ్, గంగ ఒడ్డున ఒక గురుకులం పెట్టాడు. 14వ ఏటనో, 16 ఏటనో వెళ్ళిపోయినవాడు 87వ ఏట మరణించాడు. ఆయన సంస్కృతం నేర్చుకోండిరా అంటే మేము ఆయన మాట వినలేదు. ఇటు నాయనగారు ఫారసీ నేర్చుకోండిరా అంటే ఈయన మాటా వినలేదు. ఏదో ఉర్దూ ఇట్లా వచ్చేసింది. ఈ విధంగా మేము పెరిగిన వాళ్ళం.

సంఘసేవ చేసే మహానుభావులంతా మాయింటికి రావటం, చారిత్రకంగా ఏదన్నా పరిశోధన చేసేవారంతా రావటం, ఆర్య సమాజికులందరూ రావటం, పండితులు రావటం, రాజకీయవాదులందరు రావటం, ఉండడం. అందువల్ల మా ఇంట్లో అన్నిటితోను పరిచయం. ఈ మడికొండ ఎటువంటి గ్రామం? నేను పుట్టడానికి ఒక సంవత్సరం ముందు 1913లో శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రి మడికొండకు వచ్చాడు. ఆ ఊళ్లో తపుటింటి గోపాలరెడ్డి అని ఒక పెద్దాయన చదువుకున్న వాడుండేవాడు. ఆయనతో సన్మానం పొందాడు. బ్రాహ్మణులు, పండితులు వచ్చినట్లయితే ఉండడానికి ఆయన తన బంగళాలోనే ధర్మశాల నొకదాన్ని కట్టించాడు. ఒక పుస్తకం 1913లో గోపాలరెడ్డిగారి కంకితం ఇచ్చాడు. ఆ ఊళ్ళో పండితులు అనుముల కృష్ణమూర్తి తండ్రి అనుముల పండరి శాస్త్రి. ఆయన 14 సంవత్సరాలు బెనారస్‌లో ఉండి విద్వాంసుడై వచ్చినాడు. కృష్ణమూర్తి పెదనాయన పెద్దయ్య శాస్త్రి గారు వేదాంతి. వారి తండ్రిగారు 115 సంవత్సరాలు బ్రతికాడు. గురుస్థానంలో ఉండేవాడు. సంవత్సరానికోసారి 15 రోజులేవో ఉత్సవాలు జరిగేవి. కృష్ణమూర్తికి పెంపకం పోయిన విశ్వనాథ శాస్త్రిగారు వైయాకరణి. ఇది ఆ వూళ్లో సంగతి.

శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రిగారు ప్రతి సంవత్సరం వచ్చేవారు. గోపాల్‌రెడ్డి గారింట్లో ఈ పండితులంతా ఏవో చర్చలు చేసేవారు. ఇంకా వానమామలై వరదాచార్యులగారి పెద్దన్నగారు వెంకటాచార్యులుగారు - ఈ పేర్లన్నీ రావండి; ఎక్కడా సాహిత్య చరిత్రల్లో రావు. వానమామలై వరదాచార్యులుగారు, ఆయన తమ్ముడు లక్ష్మణాచార్యులుగారు. వరదాచార్యులుగారికి చాలా సంతానం. ఆ కుటుంబంలో రెండో పూటకు భోజనం ఉంటుందన్న గ్యారంటీ లేదు. ఇంకా రెండో వారు మా నాయనగారు. వారు కూడా అంతే మహానుభావులు. రెండో పూట ఉన్నది అనేది లేదు. 1916 నుండి 24 వరకు మడికొండలో ఉన్నాం. 1920లో గ్రంథాలయం స్థాపింపబడ్డ దక్కడ. మేం ఆరేళ్ల వాళ్లం. ఆ గ్రంథాలయం నైజాం రాష్ట్రంలోనే తెలుగువారి గ్రంథాలయాల్లో నాలుగవది. 1901లో కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం. 1904లో హనుమకొండలో రాజరాజనరేంద్ర భాషా నిలయం, 1913 మట్టెవాడలో శబ్దానుశాసన గ్రంథాలయం, 1920లో ప్రతాపరుద్రాంధ్ర భాషా నిలయం మడికొండలో వచ్చినది. ఆ భాషా నిలయాన్ని స్థాపించకముందే రామలక్ష్మణ విద్యాలయం అని ఒక విద్యాలయం ఉందక్కడ ప్రయివేటుది. దానికి గస్తి నిశాన్ తిర్పన్ (సెక్షన్ 53) అనేది వచ్చి ప్రైవేట్

స్కూళ్ళు రద్దు చేసేదాంట్లో అది కూడా రద్దయి పోయింది. విద్యాలయాలు ఉండవద్దని, లైబ్రరి పెట్టడం అంటే పెద్ద టెర్రరిస్టు మూమెంట్ చేసి ఏదో ఉద్యమం సాధించినట్లు, పత్రిక చదవడం అంటే సర్కారుకు ప్రమాదం చేసినట్లు, ఖాదీ తొడగడం అంటే ఇంకేమీ లేదు అంతే.

ఇటువంటి పరిస్థితుల్లో వెంకటాచార్యులుగారు, రంగారావుగారు వీరిద్దరు ఇంగ్లీషు ఉర్దూ, ఫారసీ – ఎవరన్నా 'లా' కు పోదలచుకున్నారంటే 'కానూన్' పాఠాలు చెప్పే వాళ్లు. వాళ్లు హిస్టరీ, జాగ్రఫీ, సంస్కృతం చెప్పేవాళ్లు. తెలుగు వెంకటాచార్యులుగారు చెప్పేవారు. రమాబాయమ్మగారని ఉండేవారు. ఆమె ఇంట్లోనే ఉండేవారు. అక్కడకు వచ్చి పాఠాలు చెప్పేవారు. రంగారావు ఉదయం నాలుగు గంటలకే లేచి ఈ 29, 30 మంది విద్యార్థులను తీసికొని ఊరు బయటకు వెళ్లి అక్కడ వ్యాయామం చేయించి, కుస్తీ నేర్పి, మళ్లీ ఊళ్లోకొచ్చేవారు. ప్రతి శుక్రవారం అప్పుడు సెలవు. ఆదివారం కాదు. ప్రతి శుక్రవారం వక్తృత్వ పోటీలు, పద్యాలు చదివించే పోటీలు. 1924 వరకు మా మడికొండలో ఈ విద్యాలయంలో చదువుకున్న వారు ఒక పదిమంది ఉర్దూ కవులు, ఒక ఇరవైమంది తెలుగు కవులుండేవారు. మోత్కూరు వారని వారి భవనంలో నాటకం ఆడుతూ ఉంటే ఒక వెయ్యిమంది కూర్చునే స్థలం ఉండేది. అక్కడ వానమామలై వరదాచారి, జగన్నాధాచారి, కాళోజీ రామేశ్వరరావు, సాంబ సిద్ధయ్య, వీరయ్య, సొన్నాయిల వెంకటి, వీళ్ళంతా డ్రామాలాడేది. గయోపాఖ్యానం మొదలైనవి. అటువంటి వాతావరణంలో పెరిగిన వాణ్ణి నేను.



కాళోజి నారాయణరావు

ఆర్యసమాజ్ సంస్థ, బ్రహ్మసమాజ్ భవనం, థియొసోఫికల్ సొసైటీ, కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం, ఇవన్నీ ఎక్కడున్నాయో చూడండి. ఇప్పటి ఉమెన్స్ కాలేజీ, నాడు రెసిడెంట్స్ కోర్ట్. అటు చాదర్‌ఘాట్ నుంచి ఇటు ట్రూప్ బజార్ దాకా రెసిడెన్సీ ఏరియా. చాదర్‌ఘాట్ దగ్గర భాగ్యరెడ్డి వర్మగారి ఆది హిందూ స్కూలు, కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం, ఆర్య సమాజ్, మాడపాటి హనుమంతరావు గారి నివాసము. ఇవన్నీ ఈ ఏరియాలోనే ఉండేవి. ఇక్కడ కొంత స్వేచ్ఛ ఉండేది. పబ్లిక్ యాక్టివిటీ ఉండేది. ఊపిరి తీసుకోవటానికి వీలుండేటటువంటిది రెసిడెన్సీ ఏరియా. బ్రిటీష్ ఇండియాలో మొదలయ్యేటటువంటివి ఏ ఉద్యమాలయినా, ఏ కొద్దిగానయినా. హనుమంతరావు పంతులు గారు ప్రభుత్వోద్యోగి. వరంగల్లులో ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్‌లో పనిచేశారు. తరువాత నిజాం ప్రభుత్వంలో తాలీమాత్ (విద్యాశాఖ)లో పనిచేశారు. పరీక్ష పాసైన తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆయన ఆంధ్రోద్యమానికి పితామహుడు. ప్రతాపరెడ్డి పండితుడు, దేనికయినా మొదటి అధ్యక్షుడాయన. ఆయుర్వేద కాన్ఫరెన్సు జరిగితే అధ్యక్షుడు ప్రతాపరెడ్డి. గ్రంథాలయోద్యమ ప్రారంభానికి సభ జరిగితే దానికి అధ్యక్షుడు ప్రతాపరెడ్డి. ఆంధ్ర మహాసభకు మొదటి అధ్యక్షుడు ప్రతాపరెడ్డి. పదమూడు మహాసభలు జరిగాయి. ప్రతాపరెడ్డి, రామకృష్ణుడు, రంగారాయుడు. ఆంధ్ర సారస్వత పరిషత్తు ఏర్పడిం తర్వాత మొదటి మహాసభ జరిగింది. వరంగల్లులో, అదొక చరిత్ర. రాజేశ్వరరావుగారి భవనం ఆవరణ లోపట ఒక పదిహేను, ఇరవయి వేలమంది కూర్చునేటు వంటి పందిరి వేయించారు. అక్కడ పుస్తక ప్రదర్శన. ఆ ప్రదర్శనలో ముద్రిత, అముద్రిత గ్రంథాలు తీసికొనివచ్చి పెట్టి, ఆదిరాజు వీరభద్రరావు గారితో ఆ ప్రదర్శన ప్రారంభించారు. దాని ఆహ్వాన సంఘానికి కార్యదర్శి కాళోజీ, అధ్యక్షుడు ఒద్దిరాజు రాజేశ్వరరావు. రెండున్నర రోజుల సభ జరిగింది. వారి యిల్లు వరంగల్లుకు హనుమకొండకు మధ్య ఉంది. తెలంగాణ జిల్లాల నుంచే 300 మంది వచ్చారు. వచ్చిన వాళ్ళంతా హనుమకొండ వరంగల్లు వాళ్లతో సహా అక్కడే భోంచేసారు. 3000 మందికి మూడు రోజులు భోజనం. ఆ పందిళ్లు వేయించిన, అంత ఖర్చు వారిదే. కవి సమ్మేళనం పెట్టాం. ఆ కవి సమ్మేళనం కోటలో ఎందుకు పెట్టుకోకూడదని ఆలోచన వచ్చింది కాళోజీకి. కలెక్టర్‌కు చెప్తే అది ఆర్కియాలజీ డిపార్టుమెంటుకు సంబంధించింది, అది ఎవరికి ఇవ్వరు, వీల్లేదు అన్నాడు. సరే అని కోట భవనాల శిథిలాల పక్కకు

ఒకరి పొలంలో పందిళ్లు వేయించాం. రేపు ఒంటిగంట నుంచో, రెండుగంటల నుంచో ప్రారంభం ఈ కవి సమ్మేళనం. ఇవాళ సాయంత్రం వచ్చి పందిళ్లు కాలబెట్టారు. ఉర్దూ లేకుంటే అది ఉర్దూకు వ్యతిరేకమన్నమాట. Non-Urdu is anti-Urdu, anti-Urdu is anti-State. ఉర్దూ కానిది ఉర్దూకు శత్రువు. ఉర్దూకు శత్రువైంది, సంస్థానానికి, రాజ్యానికి. శత్రువు తురకవాడు లేకపోతే తురకవాడికి విరోధి. తురకవాడికి విరోధి కాబట్టి రాజ్యానికి విరోధి. ఈ విధంగా పందిళ్లు కాలబెట్టారు. తెలుగు అభిమానులంతా కాపాడడానికి పోయారు. వాళ్ళతో దెబ్బలాడారు. దెబ్బలాట జరిగింది. కొట్లాడుకోవద్దు అని చెప్పాం, మేం కాంగ్రెస్ వాళ్లం కదా! వీళ్లని వాళ్లని ఆపాలని పోయి ఆడివాల సత్యనారాయణ అనే యువకుడు, ఎం.ఎస్. రాజయ్య అనేవాడు అప్పుడు బి.ఏ. చదువుతున్నవాడు వాళ్లు వీళ్ల లాఠీ దెబ్బలకు మూర్ఛపోయి ఆస్పత్రి పాలయ్యారు. కాళోజీ పంతమేమిటంటే అక్కణ్ణే ఆ శిథిలాలలోనే జరగాలి. హనుమంతరావు, ప్రతాపరెడ్డి, రామకృష్ణారావుగార్లున్నారు. ముసుపట్ల పట్టాభి రామారావు గారనే వారు కవి సమ్మేళనానికి అధ్యక్షులు. మూడు రోజుల మహాసభలకు ప్రతాపరెడ్డిగారు అధ్యక్షులు. ప్రాచీనమైన శిథిలాలే కాకుండా ప్రత్యేకించి ఆనాడు వేసుకున్న పందిళ్ళ శిథిలాలలో కూడా కవి సమ్మేళనం జరిగింది. దాశరథి మొదలయిన 60 మంది కవులు ఇత్తెహాదుల్ ముసల్మీన్ వారిని కూడా పిలిపించుకొని కూర్చుండ బెట్టుకొని చూడండి, ఏం జరుగుతుందోనని చూపించాం. దాశరథి, వరదాచార్యులు మొదలయిన వాళ్ళంతా ఏమి కోట అది! ఏమి శిల్పాలవి అని! కవిత్వం చదివారు. 'శిల్పి' అన్న కవిత దాశరథి రాసిందక్కడ. ఆనాడు గాయపడి దెబ్బతిన్న నంది, ఈనాడు కూడా గడ్డి కరవడం లేదన్నాడు తన పద్యాలలో. వానమామలై వరదాచార్యులు, తక్కినవాళ్లు కూడా చదివారు ఇదేవిధంగా. ఈ ధోరణి చూసి నేను ఈ పూర్వవైభవమూ అదీ అని అంతా రాస్తున్నారు కదా! సంపూర్ణంగా 'యాంటీ' కవిత నాది. కూలిపోయిన కోటగోడలను చూపి, శిథిలమయిన గుళ్ల శిల్పములు జూపి, తుప్పుబట్టిన కత్తి తురకలకు జూపి, పురుగు బట్టిన తాటి పొత్తాలను జూపి, ఏమేమో జూపి 'పూర్వ వైభవము తలచి పొంగేటి నీకు ప్రస్తుతావస్థ ఏ పగిది నున్నదో' అని, సంపూర్ణంగా యాంటీ కవిత నాది. చాలా వైభవంగా జరిగింది కవి సమ్మేళనం.


మాయింట్లో జరిగిన విషయం, విశ్వనాథ సత్యనారాయణగారు మొదటిసారి వచ్చినప్పుడు – విశ్వనాథ సత్యనారాయణగారేమిటి? ఎవరు వచ్చినా కాళోజీ రామేశ్వరరావుగారి ఇంటికి రావలసిందే. రాఘవరెడ్డి గారు పద్యాలు చదివారు. వేలపద్యాలు రాశారు. రామేశ్వరరావుగారి ఇంటికి పండితులు, మహానుభావులు, రాజకీయవేత్తలు అందరూ వచ్చేవారే. అదొక వాతావరణం. సాయంకాలం భాగవతమో, తులసీదాసు రామాయణమో, సంత్ జ్ఞానేశ్వర్ రచనలో చదివేవారు. అటువంటి సాహిత్యవాతావరణం అక్కడ.

ఆనాడు తెలంగాణాలో ప్రత్యేక పరిస్థితి. భయం, అనుమానం, ప్రతిదాన్నీ అనుమానించేవారు. అప్పుడు ఢిల్లీ నుంచి అయినా, మద్రాసు నుంచి అయినా ఇటు కృష్ణా, గుంటూరు, గోదావరుల నుంచైనా ఎవరు వచ్చినా కాళోజీ రామేశ్వరరావు గారి ఇంటికి రావలసిందే. మద్రాసు నుంచి ఢిల్లీ పోవాలంటే కాజీపేట మీదుగా పోవలసిందే. రైలు నైజాములో ప్రవేశించిందగ్గరి నుంచి కిటికీలు మూసుకొని పడుకొనేవారు. ఏమి జరుగుతుందోనని భయం. సభలు సమావేశాలు ఏమి జరిగినా రెసిడెన్సీ ఏరియాలో జరగవలసిందే. ఆర్య సమాజ మహాసభలు అక్కడే జరిగేవి. కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావుగార్లు కార్యదర్శులు, అధ్యక్షులుగా పనిచేశారు. రెసిడెన్సీ ఏరియాలోనే ఈ అవకాశం.

తెలంగాణా ప్రాంత పరిస్థితి వెనుకబడిన పరిస్థితి. కులాలు పట్టించుకోక పోవడం, బాల్య వివాహాలు వదిలి పెద్దయిన పిల్లలకు పెళ్ళిళ్లు చేయడం, కులాంతర వివాహాలు ఇవన్నీ మనకంటే ముందు మహారాష్ట్రలో మొదలయ్యాయి. సంఘ సంస్కరణ అక్కడే ముందు జరిగింది. మన దగ్గర పరిస్థితి ఏమిటంటే శారదా బిల్లు మరో మూడు నెలల్లో అమల్లోకి వస్తుంది. అంటే కృష్ణా జిల్లాకు మా నైజాం జిల్లాల సరిహద్దు ప్రాంతంలో సుమారు లక్ష వివాహాలు జరిగాయి. మాడపాటి హనుమంతరావు గారి జన్మస్థలం ఎర్రుపాలెంలో యాభై వేల పెళ్ళిళ్ళు జరిగాయి. నా పెళ్ళి కూడా చాలా చిన్నప్పుడే జరిగింది.

ఇక సాహిత్యాలలోకి వస్తే గరిమెళ్ల సత్యనారాయణ, తుమ్మల సీతారామమూర్తి చౌదరి, ఇలా రాజకీయ ఉద్యమాల

గురించి రాసినవాళ్లు అయిదుగురు, ఆరుగురు కంటే ఉండరు. అయ్యదేవర కాళేశ్వరరావుగారు చెప్పిన కథ. రాయప్రోలు సుబ్బారావు గారు 'ఎక్కడనో పలు శస్త్ర శాలలు నిలుపువాడు...' అని ఏదో పద్యంలో రాస్తే కృష్ణాజిల్లా నుంచి ఎవరో రెసిడెన్సీకి రాస్తే, రెసిడెన్సీవారు ఎంక్వయిరీ జరిపారు. అప్పుడు Arms Act ఉండేది. కాళేశ్వరరావు పంతులుగారికి రాయప్రోలు సుబ్బారావు గారంటే గౌరవం. ఆ సంగతంతా తెలుసుకొని వాళ్ల దగ్గరకుపోయి రామ రామ బ్రాహ్మడు శస్త్రశాలలు అని రాయలేదు సత్రశాలలు అని రాశాడు అని బొంకారు. నిర్భయంగా చెప్పిన చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు 'తెల్లవారను గడుసరి గొల్లవారు' అని చెప్పారు. ఈవిధంగా ప్రభుత్వ వ్యతిరేకంగా నేరుగా చెప్పినటువంటి సాహిత్యాన్ని చూడండి. ఆధునిక మహాకవుల్ని కూడా తీసుకోండి. నేరుగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాసినటువంటి కవులను చూపించండి. సిద్ధాంతంగా, సిద్ధాంతపరంగా లేకపోతే విశ్వాసపరంగా అన్యాయం చేయడం తప్పు అని చెప్పి రాయవచ్చు. దోపిడీ చేయడం తప్పు అని ఎవరైనా రాయవచ్చు. మన శ్రీశ్రీ అన్నాడు కదా 'దౌర్జన్యాలు, దోపిడీలు ఇంకానా ఇక సాగవు' అని. దీనిమీద నా ప్రశ్న 'ఏమైందని ఎందుకు సాగవు?' అని. సాగుతూనే ఉన్నాయి కదా. అయోధ్యరామయ్య అని ఒకాయన నూరు బుర్రకథలు రాశాడు. తెలుగు పత్రిక తీశాడు. మొదలు మాసపత్రిక, తరువాత పక్షపత్రిక, తర్వాత వార పత్రిక తర్వాత వారానికి రెండుసార్లు, తర్వాత భాగ్యనగర్ అని తెలుగు డైలీ పెట్టి మూడు సంవత్సరాలు నడిపాడు. సుబ్బరాజు, బుర్రకథ రాజు అని ఆయనకు పేరు. ప్రత్యక్షంగా పాడేవారు రజాకార్లకు, నైజాంకు వ్యతిరేకంగా, దాశరథి ఏమిటి. అతను పెద్ద ఉద్యమాలు నడిపించింది లేదు. పెద్ద ఉపన్యాసాలిచ్చింది లేదు. సభల్లోకి పోయి ఆ పద్యాలు చదివేవాడు. అదే పెద్ద ఉపన్యాసం. ఒక రెండు వేల ఉపన్యాసాల ప్రభావం కలిగించాడు ఆ పద్యాలతోటి.


రాయప్రోలు సుబ్బారావు

వందేమాతరం పాడడం ఇక్కడ నిషిద్ధం. 1938-39లో ఉస్మానియా విశ్వవిద్యాలయం కాలేజీల లోపట, హాస్టళ్లలోపట వందేమాతరం పాడతామని ముస్లిమేతర విద్యార్థులు, ప్రభుత్వం పాడవద్దని, హాస్టల్స్‌కు తాళాలు పడ్డాయి. విద్యార్థులు వెళ్లగొట్టబడ్డారు. అప్పుడు ఇంటర్మీడియేట్ చదువుకొనే టటువంటి కాలేజీలు నాలుగు. ఒకటి ఔరంగా బాదుల మహారాష్ట్ర, ఒకటి గుల్బర్గా కర్ణాటకలో, మెదక్ సుబాకు సంబంధించి ఇక్కడ ప్రారంభించిన సిటీ కాలేజీ, వరంగల్‌లో ఒకటి. ఇవన్నీ నైజాం పాలనలోని 17 జిల్లాలలోవి. తర్వాత యూనివర్సిటీ. అయితే 600 మంది స్టూడెంట్సు వందేమాతరం పాడడానికి ముందుకు వచ్చారు. వీళ్లను ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి బహిష్కరిస్తే ఆంధ్ర విశ్వవిద్యాలయం వాళ్లు రానివ్వలేదు. మద్రాసు విశ్వవిద్యాలయం అసలే అంగీకరించలేదు. నాగపూర్, విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ కేదార్. ఆయన అందరికీ నాగపూర్, వార్ధా మొదలైన ప్రదేశాల్లో అవకాశాలు కల్పించారు. వరంగల్‌లో ఇంటర్‌లో 49 మంది ముస్లిమేతర విద్యార్థుల ముండే వాళ్ళం. అందులో మొదటి సంవత్సర విద్యార్థి రాజగౌడు, రెండవ సంవత్సరం విద్యార్థి సుదర్శన్‌రావు అనే విద్యార్థులు తప్ప తక్కిన 47 మంది వందేమాతరం పాడడానికి వచ్చారు. నాగపూర్‌కు పంపించిన ఈ 47 మందిలో అందరికంటే చిన్నవాణ్ణయినా పెద్దవాణ్ణి నేను. హయగ్రీవాచారి కూడా ఉన్నాడు. వాళ్లలో పి.వి. నరసింహారావు. ఇక్కడ అచ్యుతరెడ్డి, పద్మనాభం వాళ్ళలో పెద్ద వాళ్లు. ఒక మేలు మాత్రం జరిగింది. అట్లా వెళ్ళిన 600 మందిలో 400 మంది దాకా ఇంజనీర్లు, డాక్టర్లు, లాయర్లు అయి పెద్ద పెద్ద చదువులు చదివి నాయకులయ్యారు. వందేమాతరం పాడవద్దంటే తెలుగు, ఫార్సీ, ఇంగ్లీషు పదాలు కలిపి కాళోజీ దాన్ని ఒక వ్యంగ్య గేయం చేశాడు. మా పి.వి. నరసింహారావు మాటల్లో చెప్పాలంటే, "లక్ష ఉపన్యాసాలకంటే ఎక్కువ పని మా కాళోజీ గేయం చేసింది."

మచిలీపట్నం కూడా నాదే, రాయలసీమ అంతా నాదే. నాకు సముద్రపు ఒడ్డు కావాలి. అందుకని మచిలీపట్నం నాకు కావాలి, అట్లా బేరాలు. అది కూడా నాదే మీ బకాయి

వసూలుకని ఇచ్చాను. ఇంకా వసూలు కాలేదా అది కూడా నాదే అన్నాడు నిజాము. నిజాం రాజుగారి బావ అయిన షాహెమసూధ్, షాహెబెరాయి. అంటే మచిలీపట్నం రాజు. ఇవన్నీ తనవేనని నిజాం క్లెయిమ్ చేశాడు. ఖమ్మం దాటితే కృష్ణాజిల్లా. అప్పుడు ఖమ్మం మా వరంగల్ జిల్లాలోనే ఉండేది. ఖమ్మం దాటితే మిమ్మల్నెవరూ అడగరు. కాని మేం మాత్రం వసూలా రాజులం. మేము షాహెబారారు. ఇదంతా చాలా వ్యంగ్యం. ఇక్కడ ముప్పయి సంవత్సరాలు, నలభై సంవత్సరాలు పెద్ద పెద్ద ఉద్యమాలలో ఉండి మహాపండితులు, మహాకవులు అయినవాళ్లు, మా హైదరాబాదు రాష్ట్రంలో ఉండేటటువంటి ఇద్దరు. ఆలిండియా ప్రఖ్యాతిగాంచి నటువంటి సరోజినీనాయుడు ఒకావె. ఆమె మా హైదరాబాదు కోడలు. మేజర్ నాయుడు భార్య. ఆయన మిలిటరీ డాక్టరు. ఈమె ఆ రోజుల్లో బెంగాల్ నుంచి వచ్చినటువంటి ఒక హెడ్మాస్టరుగారి బిడ్డ. ఈమె మా హైదరాబాదు నివాసి. రెండో వారు రాయప్రోలు సుబ్బారావుగారు. మహానుభావుడు. ఈయన కృష్ణదాటితే జాతీయ కవి. ఎక్కడెక్కడ ఉండేవాడో ఏమిటో మా కెవరికీ తెలియదు. మేమెవరమో ఆయనకుతెలియదు.

మన రామానుజరావు శబ్దానుశాసన గ్రంథాలయ కార్యదర్శి గ్రంథాలయ రజతోత్సవంచేస్తూ దానికి మహామహులనందరినీ పిలిచాడు. 1944-45 ప్రాంతం - రాయప్రోలు సుబ్బారావుగారు, తల్లావజ్ఝల శివశంకర శాస్త్రిగారు, గాడిచెర్ల హరిసర్వోత్తమరావు గారు, 'విజయ' అనే పత్రిక తీస్తూ ఉండిన పల్లెల శ్రీ రామమూర్తిగారు ఈ అయిదారుగురు మహానుభావులు వచ్చారు. వీరందరిదీ కూడా వరంగల్ స్టేషన్ దగ్గర ఒక సత్రంలో బస. నేను, వీళ్ళంతా అక్కడ ఉన్నారు కాబట్టి వెళ్ళాను. ఆ హాల్లో జంపఖానా పరిచి ఉంది. అతిథులందరూ కూర్చుని ఉన్నారు. ఒక పక్క ఈజీచైరులో రాయప్రోలు సుబ్బారావుగారు కూర్చున్నారు. నేను పోయే సరికి వాళ్ళందరూ మా హరిసర్వోత్తమరావుగారూ, తక్కిన వాళ్ళూ కాళోజీ రా రా అని చనువుగా పిల్చి కూర్చో పెట్టుకొని వాళ్లందరూ మాట్లాడుతూ ఉన్నారు. రాయప్రోలు మహానుభావుడు నన్నేదో వింతగా చూస్తున్నాడు. హరి సర్వోత్తమరావుగారు చూసి 'ఏమోయ్ సుబ్బారావు అట్లా చూస్తున్నావ్ కాళోజీ నెరుగరా' అన్నాడు. తెలవదు అనవచ్చుగదా. కాని హరిసర్వోత్తమరావుగారు అంత ఇదిగా మాట్లాడుతున్నారు. తల్లావజ్ఝల స్వామి వారు మాట్లాడుతున్నారు. ఎక్కడనో చూసినట్లే ఉంది అన్నాడు. ఎందుకనాలి? హరిసర్వోత్తమరావుగారు పదిపది హేను నిమిషాలపాటు "ఏమిటిది? నీవు 30, 35 సంవత్సరాలుగా హైదరాబాదులో ఉండడమేమిటి? కాళోజీని ఎక్కడో చూసినట్లుందనడమేమిటి? ఎవరితోనూ కలవవా? ఇక్కడి ప్రజలతోటి, ప్రజల ఉద్యమాలతోటీ ఏమీ సంబంధం లేదా నీకు?" అని ప్రశ్నించారు. అది వసంత ఋతువు. సాయంత్రం సభలు. కవి సమ్మేళనం. రాయప్రోలు వారు అధ్యక్షులు. కవి సమ్మేళనంలో కవిత్వం చదవవలసిన వారిలో మొట్ట మొదటి పేరు కాళోజీ నారాయణరావుది. వసంత ఋతువు, పౌర్ణిమ, కవి సమ్మేళనంలో కాళోజీగారు 'కోకిల' అని కవిత వినిపిస్తారు అని పరిచయం చేశారు. నేను కోకిల అని రాశాను. దాంట్లో అన్యాపదేశంగా రాయప్రోలు వారిని తిడుతూ రాశాను. ఆ తర్వాత మాత్రం ఆయన వరంగల్లుకు వస్తే మా ఇంట్లోనే దిగేవారు. 'లేమావి చిగురులను లెస్సగా మేసెదవు, ఋతురాజు వచ్చెనని అతి సంభ్రమముతోడ, మావి కొమ్మల నీడ మైమరచి పాడెదవు, తిన్నతిండెవరిదే కోకిలా - పాడుపాటెవరిదే! ఏనాటి సుకృతమో, ఏ విశ్వకవి చలవో ఈనాడు నిన్నింత దానిగా చేసినది..'

అంతేకాదు రాయప్రోలు ప్రసిద్ధ గీతం 'ఏ పీఠమెక్కినా ఎందుకాలిడినా ఏ దేశమేగినా..." అనే దానికి మొట్టమొదట పేరడీ చేసింది కాళోజీ. ఆ పాదాలట్లనే ఉంచి 'పొగడరా నీ తల్లి భూమి భారతిని' అన్నదాన్ని 'చూడరా నీ బొజ్జ పూడుమార్గము' అని మార్చి రాశాను. 'నరులు ప్రాణాలతో నడచునందాకా...' చూడరా నీ బొజ్జ నిండు మార్గము' అని. సభలో నేనే అధ్యక్షుణ్ణి. రాయప్రోలు వారు ముఖ్య అతిథి అనుకుంటాను. రాయప్రోలు వారు ఇంత గొప్ప దేశభక్తి గీతం రాసి ప్రభావం వేస్తే, నేను ఈ పేరడీ రాసి ప్రభావం వేశాను. 'చూడరా నీ బొజ్జ పూడు మార్గము' అన్న నామాటే అందరూ పాటిస్తారు కాబట్టి నా ప్రభావమే ఎక్కువ అన్నాను. వరంగల్లులో సుప్రసన్న, సంపత్కుమార, జగన్నాథం వీళ్లు సాహితీ బంధు బృందం అని సంస్థ పెట్టారు. ప్రారంభోత్స వానికి రాయప్రోలు అధ్యక్షులు, విశ్వనాథ ముఖ్య అతిథి. విశ్వనాథ సంస్కృతం లేకపోతే తెలుగు లేదు. సంస్కృతం లేకపోతే దేవుడే లేదు అన్నాడు. దేవుడులేకపోతే మాకు దయ్యం లేదు పొమ్మన్నాను.

అరవవాళ్ళతో బాధలుపడి విడిపోయి ప్రత్యేక రాష్ట్రం కావాలని అంతకాలం ఉద్యమాలు నడిపి 1913లో ఆంధ్ర మహాసభ మొదలు 1953లో కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడేదాకా రాసిన కవితలన్నిటిలో చేసిన ప్రసంగాలన్నిటిలో అరవల దగ్గర ఆంధ్ర అనీ, ఆంధ్రుల దగ్గర తెలంగాణులనీ పెడితే సరిగ్గా సరిపోతాయి ఆ బాధలన్నీ. మరి అన్ని బాధలు పడ్డవాళ్లు మమ్మల్నింకా బాధలెందుకు పెడుతున్నారో నాకర్థం కావడంలేదు. మొదట్నుంచీ ఢిల్లీ నుంచి, లక్నో నుంచి వచ్చినవాడు మాకు ఉర్దూ రాదనీ, మద్రాసు నుంచి వచ్చిన పెద్ద పెద్ద ఇంగ్లీషు పండితులు మాకు ఇంగ్లీషు రాదనీ, హిందీ వాళ్ళు వచ్చి మాకు హిందీ రాదనీ అన్నారు. కాని మాకు తెలుగు రాదన్న వాళ్లులేరు. కాని ఈ మహానుభావులొచ్చి మాకు తెలుగు రాదన్నారు. ఇది చూడండి మీరు.

1913 లోపల శ్రీ పాదకృష్ణమూర్తి శాస్త్రి వంటి పండితులు కూడా మడికొండకు వచ్చి రెండేసి నెలలు, మూడేసి నెలలు ఉండి పోయారు. ఇల్లెందులో 25వ గ్రంథాలయ మహాసభలు జరిగితే ఈ మహానుభావు లందరూ వచ్చారు.


వీర్‌సావర్కార్

'ఏ భాషరా నీది ఏమి వేసమురా?'...'అక్కడగాని, ఇక్కడ గాని మొన్న మొన్నటి దాకా 'తెలంగీమే బాత్‌కర్‌నా నహీ ఆతా' అనో, 'ఐ డోంట్ నొ, హౌటు స్పీక్ తెలుగు' అనో అనేవాళ్లే. ధోవతి కట్టుకోవడం అవమానం, పంట్లాం వేసుకొని టై కట్టుకోవడం వానికి, ఇక్కడ పైజామా లాల్చీ వేసుకోవడం వీనికి, వాడు వీణ్ణి ఆక్షేపించడం, ఎట్లున్నది చూడండి. వానిది రోడ్డు తెలుగు, వీనిది సడకు తెలుగు, మాకు 'చాయ్' తెలుగు, మీకు 'టీ' తెలుగు. 'అన్యభాషలు నేర్చి ఆంధ్రమ్ముురాదనుచు సకిలించు ఆంధ్రుండా చావవేమిటికిరా....' అని రాయవలసి వచ్చింది కాళోజీ.

ఒకని అలవాట్లను ఒకడు సహించాలి. సహృదయం ఉండాలి. మైత్రి ఉండాలి. వ్యసనమున్నవాడు తనకు స్నేహితుడయితే వ్రతం చేసేవాడు వానికి తన యింట్లో ఏర్పాటు చేస్తాడు. వ్రతము, వ్యసనము కలిసి వల్లించు పాఠాలు, పండితుడు, పామరుడు పలికించి మాటాడు, కలిమిలేములు కలిసి సయ్యాటలాడు! మా రాఘవరెడ్డి ఎంత పండితుడు! మా గురువుగారు మహాదేవ వర్మ కవితలన్ని తెలుగులో రాసినవాడు అటువంటి మహానుభావుడు. ఇంకో మహానుభావుడు పిల్లా వెంకటరత్నం (విజయవాడ) నాలుగువేలో, పదివేలో, పద్యాలు రాశాడు. క్విట్ ఇండియా ఉద్యమాన్ని వర్ణిస్తూ ఆయన రాసిన పద్యాలు రాఘవరెడ్డిగారు, పి.వి. నరసింహారావుగారు, పాములపాటి సదాశివరావుగారు మేం అందరం విన్నాం.

**పసిపాపలు బుసకొట్టిరి**
**కసవూడ్చెడి ముసలి యవ్వ కను లెర్రబడెన్**
**అసువుల కన్నను స్వేచ్ఛా**
**మసలుండె మేలటన్న మత్సరమొదవెన్**

అన్న పద్యం నాకింకా గుర్తు ఉంది. బెజవాడకు పోతే ఆ పిల్లా వెంటకరత్నం ఇంటికి పోయే వాళ్ళలో నేనొకణ్ణి, పువ్వాడ శేషగిరిరా వొకడు. పువ్వాడ శేషగిరిరావుగారికి ఆయన శిష్యుడు. 'వినయ కుమారము' అని వెంకటరత్నం గారు రాసిన చిన్న కావ్యం ఆవిష్కరణ సభలో చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారు అధ్యక్షత వహించి చెప్పిన పద్యం పంక్తులలోని భావం. నా శిష్యుడు లక్ష్మీకాంతం, అతని శిష్యుడు, పువ్వాడకవి, అతని శిష్యుడు వెంకటరత్నం. ఈ విధంగా ఈ కవితా శిష్యవంశం దినదినాభివృద్ధి పొందుతూంది అని. ఆ పిల్లా వెంకటరత్నం గురించి ఇప్పుడెవరికీ ఏమీ తెలియదు. ఎవరన్నా చదువుతున్నారో లేదో.

మహానుభావుడు వట్టికోట ఆళ్వారుస్వామి, కాశీనాథుని నాగేశ్వరరావు చనిపోయిన సంవత్సరంలో దేశోద్ధారక గ్రంథమాల స్థాపించి 38 పుస్తకాలు అచ్చువేశాడు. వాటిలో 1940లో అచ్చయిన పుస్తకం 'నా భారతదేశ యాత్ర' అంతకుముందే కె.సి. గుప్తా, వెల్దుర్తి మాణిక్యరావు కలిసి అణా గ్రంథమాల పెట్టారు. అణాకు ఒక పుస్తకం. పదహారు

పేజీలు, ఇరవై పేజీలు చిన్నవి. సుభాష్ చరిత్ర, గాంధీ చరిత్ర, వీర్‌సావర్కార్ చరిత్ర, ఆర్య సమాజ్ దయానంద సరస్వతి చరిత్ర మొదలైనవి. కె.సి. గుప్తాగారి మీద ప్రభుత్వం 12 సంవత్సరాలు శిక్షపడే కేసు పెట్టినారు. హైకోర్టులో బూర్గుల రామకృష్ణారావు మొదలయిన వాళ్లు – చాలా మితవాదులని వారిపైన ఆక్షేపణ. ఆరు పుస్తకాలో, ఎనిమిది పుస్తకాలో నిషేధింపబడ్డాయి. దాంట్లో కాళోజీ కథలు కూడా అని, వాదించి తప్పించారు. ఉపన్యాసాలకంటే ఉద్యమాలలో ఈ కథలు గేయాలు కవితలు ప్రజలకు అందుబాటులో ఉంటాయి. ఉద్యమాన్ని ప్రజలలోకి తీసుకు వెళ్తాయి అని ప్రహ్లాదుని చరిత్ర. పురాణ కథలు కొన్ని తీసుకొన్నాను.

ప్రహ్లాద చరిత్ర తీసుకొని యాదగిరిగుట్ట నృసింహస్వామి బ్రహ్మోత్సవాలలో ఆ నరసింహస్వామిని సంబోధించి ఆనాడు హిరణ్య కశిపుని చంపిన నాటి నీ కోపం, లక్ష్మీదేవి స్వయంగా వచ్చి ప్రార్థించినా చల్లారని కోపం, నాకు మళ్ళీ చూడాలని ఉంది అని రాశాను. ఆనాడు రుద్రుడు, ఇంద్రుడు ఎవరు వచ్చి ప్రార్థించినా ఆయన కోపం చల్లారలేదు. వేయి యుగాలలో ఎన్నడూ చూడనంత కోపం ఆయనకు వచ్చింది. అంతవరకు హిరణ్య కశిపునికీ జేజేలు పలికినవారంతా, వాణ్ణి నృసింహస్వామి చంపేటప్పటికి నృసింహస్వామికీ జై అన్నారు. అయినా ఆయన కోపం చల్లారలేదు.

ఆనాడు నిన్ను జేరగ భయకంపితగు లచ్చియై ఈనాడు నీతొడపై హాయిగా కూర్చుని యున్నది లక్ష్మి. అటువంటి నీ కోపము దితి పుత్రుడు ప్రహ్లాదుడు చేరి మ్రొక్కె చప్పున చల్లారెన్, మా కొంపలు ఆరెన్. నా గొడవలో నా సాహిత్యంలో ఉండే విశేషం ఇటువంటిది.

ఎందుకు మన కొంపలెందుకు ఆరినయి. ఇక ఆనాటి గోల ఎందుకు? ప్రహ్లాదుల మాట ఎందుకు? వాని అయ్యతలదన్నిన వాళ్ళు, వాని బంట్లు, ఏజెంట్లు ప్రహ్లాదుని పేరుతోడ నీకడకు ఏ తెంచుట లేదా మరి కొంపలారినట్లే కదా. నీకు తెలస్తలేదురా. బ్రహ్మోత్సవాలు చేస్తున్నారు. దద్దోజనాలు పెడుతున్నారు. పులిహోరల నైవేద్యం పెడుతుంటే నీకు తెలుస్తలేదు మా బాధలు. నీ వెవడవురా నీ వా అసలు నరసింహం? నేను నీకు మొండెం ఇచ్చాను. సింహం తన తలిచ్చింది. సింహపుతల నా మొండెం. నీకు తల ఇచ్చిన ఆ సింహం సంతానం, నీకు మొండెమిచ్చిన నా సంతానం ఏ పరిస్థితిలో ఉంది? ఆనాడు నా మొండెం నీకిస్తి. నా తలకాయ ఎక్కడో పారేసుకున్నాను. ఇంకా దొరకలేదు. నేను తల లేకుండానే ఉన్నా యింకా. సింహాలెక్కడున్నాయి. సర్కసులోనన్నా ఉన్నాయి, లేకపోతే జూలో ఉన్నాయి. అందుకోసం ఆనాటి నీరూపం ప్రళయ భయంకర రూపం చూడాలని ఉంది నాకు. నీ ఈ రూపంతో నాకు తృప్తి లేదు. ఆ బ్రహ్మోత్సవాలకు 20, 30 వేల జనం వచ్చారు. నా గొడవ విన్నారు.

**అతిథివోలె వుండి వుండి / అవని విడిచి వెళ్ళుతాను**
**పల్లె పట్టణంబులనక / పల్లేరై తిరిగాను. – కాళోజీ**

---

ఇక్కడ యుద్ధాలు లేవు. పేదరికం లేదు. మత్తు మందులా - ఎందుకు? అవినీతి - అంటే ఏమిటి? కాలుష్యమా? ఎక్కువ జనాభా లేదు. కారాగారాలా - అవసరమే లేదు... ఇది జరావా జీవనం గత 55 వేల సంవత్సరాలనుంచి - వీరినా మనం అనాగరిక ఆదిమ వాసులని పిలుస్తున్నాము?



అండమాను దీవుల్లో ఒక దీవిలో 'జరావా' తెగ వుంటున్నది. ఇప్పుడు వారి ఉనికి ప్రమాదంలో పడింది. వారి తల్లి నేలకు అడ్డంగా రోడ్డు వేస్తున్నారు. నాగరిక దొంగలు వారి ఆహారాన్ని వేటాడి దోచుకుంటున్నారు. అమాయకులైన వారికి కొత్త రోగాలు అంటిస్తున్నారు. అవును, వారి ఉనికే ప్రమాదంలో పడింది. మనం వారిని రక్షించలేమా!

# చరిత్ర – సాహిత్యం

- విరియాల లక్ష్మీపతి

గతాగతాల మధ్య గంభీర మహాప్రవాహంగా వర్తమాన తీరాల్ని స్పృశిస్తూ ప్రవహిస్తూంటుంది కాలం. అందులో ఎప్పటికీ పోకుండా గతిశీలంగా ప్రయాణిస్తూంటుందీ చరిత్ర నౌక. కాలవాహినిలో ఆ నౌక శతాబ్దాల రేవులు తాకుతూ పోతూంటుంది. అలా ప్రవహించే ప్రవాహకాలమూ, చారిత్రక నౌక రెండూ ఒకటి పరోక్షమూ, రెండోది ప్రత్యక్షమూ, తమ అస్తిత్వాన్ని ప్రదర్శిస్తూనే వుంటాయి.

అయితే ఈ చరిత్ర నౌక ఎన్నో తుఫాను గాలుల వత్తిడికి లోనైంది, మత విధ్వంస విషాద దృశ్యాలు చవిచూసింది. ఎన్నో శరద్రాత్రుల వెన్నెల హొయల్లో వయ్యారాలు పోయింది. ఎన్నో విజ్ఞాన కాంతులలో ప్రకాశించింది. ఈ నౌకా ప్రయాణంలో 19, 20, 21వ శతాబ్దాలు ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

పద్దెనిమిది, పందొమ్మిదో శతాబ్దంలో జన్మించిన మేధావుల ధీశక్తి, సంస్కార హృదయమూ, వైజ్ఞానిక పరిశోధనా ఫలితము, భౌతిక శాస్త్రవేత్తల వినూత్న శాస్త్ర సాంకేతిక విజ్ఞానమూ ఇరవయ్యో శతాబ్దంలో సాధించిన అపూర్వ విజయాలకు కారణభూతమయ్యాయి.



సార్త్రె

పందొమ్మిదో శతాబ్దం ఆరంభ దశలో గతంలో ఎప్పుడూ లేనంత తీవ్రంగా వివిధ సిద్ధాంతాల సంఘర్ష సంక్షోభాలు యుగాన్ని అతలాకుతలం చేశాయి. ఈ సంఘర్షణ అన్ని భాషలలోనూ, అన్ని దేశాలలోనూ, అన్ని వర్గాలలోనూ ఎన్నో రకాలైన వైరుధ్యాలకి, వైవిధ్యాలకి దారితీసింది. ఈ సిద్ధాంత రాద్ధాంతాలు ప్రపంచ సాహిత్యాలన్నింటిలోనూ దర్శనమిచ్చాయి. మేధావుల్ని ఆలోచింప చేశాయి. ఈ కాలంలోనే కళాకారులు, సాహిత్య కారులు తమ సృజనాత్మకతకు పదునుపెట్టి విశ్వవిఖ్యాతి గాంచిన కళా రూపాలకు జన్మనిచ్చారు. పందొమ్మిదో శతాబ్దంలో జన్మించిన మహనీయుల ఆలోచనలే మానవజాతిని నడిపించాయి.

డార్విన్ పరిణామ సిద్ధాంతంతోపాటు, జేమ్స్ జాయిస్ ప్రతిపాదించిన చైతన్య స్రవంతీ సిద్ధాంతము, టి.యస్. ఇలియట్ సృజించిన శ్రామిక యుగీన అధి భౌతిక నైరాశ్య వాదము, జీన్‌పాల్ సార్త్రె నిర్ధారించిన అస్తిత్వ సిద్ధాంతము, మార్క్స్ గతి తార్కిక భౌతిక వాదము, ఫ్రాయిడ్ మనోవిశ్లేషణ, ఐన్‌స్టీన్ అణు సిద్ధాంత వాదనమూ....అన్నీ.

అన్ని రంగాలలోనూ ప్రవేశించినట్టే సాహిత్య రంగంలోనూ ప్రవేశించి ప్రపంచ పాఠకుల్ని ఆలోచింప చేశాయి. మొత్తం ప్రపంచ మానవాళి వీరి ఆలోచనాబలంతో సకల రంగాలలోనూ సర్వతోముఖమైన అభివృద్ధిని సాధించింది. వైజ్ఞానిక రంగం మానవునికి కొత్త సుఖమయ జీవితం ప్రసాదించింది. కాలానికి దూరానికి గల పాత అర్థాలు తొలగిపోయాయి. చంద్రుడు మానవుని చేతికి అందినంత దూరానికి వచ్చి నిలుచున్నాడు.

ఇవన్నీ శిల్ప సంవిధానాలుగానూ, శైలి వైవిధ్యాలుగానూ, వస్తు వైశిష్ట్యాలుగానూ, హేతువాదాలుగానూ, అనుభూతి వాదాలుగానూ ప్రపంచ సాహిత్యాన్ని ప్రభావితం చేశాయి. సాహిత్యం ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంది. ప్రపంచ సంక్షోభాన్ని కవులూ, రచయితలూ తమలో పలికించగలిగారు.

విరియాల లక్ష్మీపతి, ఫోన్ : 0891-2529202

నాటి శతాబ్దారంభంలోనే అంటే, 1910 సంవత్సరంలోనే సాహిత్యం గురించి ముచ్చటిస్తూ వర్జీనియా ఊల్ఫ్ *"All human relations have shifted"* యజమానికీ, సేవకునికీ గల సంబంధం; భార్యలకీ, భర్తలకీ గల సంబంధం; తల్లితండ్రులకీ, పిల్లలకీ గల సంబంధం మార్పులు పొందాయి, ఇంకా మార్పులు చెందుతాయి. ఈ మార్పు ముందుగా ఆంగ్లసాహిత్యంలోనే ప్రస్ఫుటంగా దర్శనమిస్తుంది. "మానవ సంబంధాలలో మార్పులు వచ్చినట్టే మత సంబంధాలలో కూడా పెనుమార్పు వస్తుంది. రాజకీయ, ఆర్థిక సంబంధాలు, సాహితీ ప్రక్రియలు అన్నీ మార్పు చెంది విలువల్ని మార్చి వేస్తాయి" అని ప్రపంచానికి గొప్ప జోస్యం చెప్పి, ఆనాడు, మేధావుల్ని ఆలోచింప చేసింది. నాటి జోస్యం ఒక్కొక్కటీ నిజం కావడంతో ఈనాడు ఆశ్చర్య పోవడం మన వంతయింది. వర్జీనీయా ఉల్ఫ్ గొప్ప క్రాంత దర్శిని అన్నది కాలమే నిర్ధారించింది. ఇరవయ్యో శతాబ్దం పోతూ పోతూ ఆవె నాడు చెప్పిన జోస్యాల్ని ఎన్నింటినో నిజం చేస్తూ పోయింది. ఇరవయ్యొకటో శతాబ్దం ప్రపంచం ముంగిట్లో అడుగు పెడుతూనే ఆమె చెప్పిన విషయాలు ఒక్కొక్కటీ సత్యంగా ప్రపంచానికి తేటతెల్లం చేయసాగింది. ఆ విదుషీమణి చెప్పిన *"All human relations have shifted"* అన్న ఒక్క వాక్యంలోనూ నేడు మారిపోతున్న ప్రపంచపు అఖండ దృశ్యం అందరిముందూ దృగ్గోచరమైంది. మానవ సంబంధాలలోనూ, మతపరమైన సంబంధాలలోనూ ఆమె చెప్పినట్లు మునుపు ఎన్నడూ లేనంత వికృత మార్పులు ఈ శతాబ్దారంభంలోనే పొడసూప నారంభించాయి.

> "మానవ సంబంధాలలో మార్పులు వచ్చినట్టే మత సంబంధాలలో కూడా పెనుమార్పు వస్తుంది. రాజకీయ, ఆర్థిక సంబంధాలు, సాహితీ ప్రక్రియలు అన్నీ మార్పు చెంది విలువల్ని మార్చి వేస్తాయి"
> – వర్జీనీయా ఉల్ఫ్

లెనిన్ మహాశయుని నాయకత్వంలో ప్రపంచంలో గల ఫాసిస్టు మూకల్ని తరిమికొట్టి ప్రపంచంలోగల ఆరవ వంతు భూభాగాన్ని విముక్తం చేసినా అక్కడ సోషలిజం ఒక శతాబ్దమైనా నిలదొక్కుకోలేకపోయింది. సామ్యవాద వ్యవస్థ కుప్పకూలి పోయిన దురదృష్ట దృశ్యం కూడా గత శతాబ్దంలోనే సంభవించింది. అది పోతూ సామ్యవాద వ్యవస్థని అదృశ్యం చేసి మరీ పోయింది.

ప్రస్తుత నూతన శతాబ్దంలో అలజడి, అసంతృప్తి, ఆవేశము, ఆందోళన, హింస, తీవ్రవాదం, మత విధ్వంసం, అశాంతి, ప్రపంచ వ్యాప్తంగా అలుముకుంటున్న ప్రత్యక్ష దుష్టశక్తులు. ప్రపంచ సమాజం అన్ని దేశాలలోనూ సామాజికంగానూ, వైయక్తికంగానూ ఎన్నో పరిణామాలకి లోనై హింసాయుతంగా మారిపోతోంది. అనిశ్చిత స్థితి, అభద్రతావ్యవస్థ సర్వరంగాలలోనూ ఉగ్రరూపం ధరించి సామాన్య జనజీవితాన్ని అస్తవ్యస్తం చేస్తోంది. వర్జీనియా ఉల్ఫ్ చెప్పిన విధంగానే విలువలన్నీ తారుమారవుతున్నాయి. మానవ సంబంధాలు దిగజార్చుకు పోతున్నాయి.

నేడు మనం నివసిస్తున్న ప్రపంచ సమాజం ఎంత వైజ్ఞానికమైందో అంత వైరుధ్యమైంది. ఎంత సుఖమయమైందో అంత ప్రమాదభరితమైంది. ఎంత ఆశాజనకమైందో అంత నైరాశ్యంతో కూడినది. విరుద్ధ భావాలు ఎన్నో ఒకే వ్యక్తి హృదయంలో డోలాయమానంగా నెలకొని వున్నాయి. సమాజ ప్రభావమే వ్యక్తిమీద అలుముకుని వుంటుంది. వ్యక్తి తన లక్ష్యాన్ని తన దృక్పథాన్ని ఆఖరికి తన అభిరుచిని తానే పోల్చుకోలేని సంధిగ్ధవ్యవస్థలో కూరుకు పోయాడు. దానికి కారణం సంకీర్ణ సమాజ దుష్ప్రభావమే అని నిర్ధారించ వలసి వుంది.

నేటి సమాజంలో యాంత్రిక నాగరికతలోని సుఖాలను అనుభవిస్తూ కొత్త కారుకి పసుపు కుంకుమ పెట్టి విఘ్నేశ్వర పూజ జరిపించి కొబ్బరికాయ కొట్టే హేతువాద మేధావులున్నారు. కొత్త ఇల్లు నిర్మించుకుని ఆవుని ముందుగా గృహప్రవేశం చేయించి మలమూత్రాలు విసర్జిస్తే అదృష్ట సూచనగా మురిసిపోయే సైన్స్ ప్రొఫెసర్లున్నారు. ఇంటికి ఈశాన్య భాగంలో నుయ్యి తవ్వించేముందు వాస్తు పూజలు జరిపించి మూల పూజలు చేసే భూగర్భ శాస్త్రవేత్తలయిన యూనివర్సిటీ అధ్యాపకులున్నారు. గ్రహాంతర సీమల్లోకి పంపే రాకెట్టు ప్రయాణానికి శుభముహూర్తాలు పెట్టి ఋగ్వేదాలు వల్లించే ఖగోళ శాస్త్రజ్ఞులున్నారు. తొమ్మిదిని అదృష్ట సంఖ్యగాను, యేడుని దురదృష్ట సంఖ్యగానూ విశ్వసించే వారు ప్రపంచంలో మూడోవంతు జనాభా... ఈ వర్తమాన మానవ సమాజం డోలాయమానంగా విశ్వాసాలు, మూఢ విశ్వాసాలూ, నమ్మకాలు మూఢనమ్మకాలూ నీతి నియమాలు ధర్మాధర్మాల మధ్య ఊగిసలాడుతోంది. అయితే కవి, రచయిత, మేధావి, కళాకారుడు ఈ సమాజంలోని వాడే

అయిన కారణంగా విచక్షణా విజ్ఞతలు పాటించి, వ్యవస్థని నడిపించే పవిత్ర బాధ్యతలను స్వీకరించవలసి వుంది.

గతంలోని సాంప్రదాయం అంతా పవిత్రమైందని, గొప్పదని మూర్ఖవాదనతో ముందుచూపు అంతరించుకు పోయిన జనావళికి మూఢ విశ్వాసాలతో వెనక చూపు సంక్రమించింది. ఈ వెనక చూపు నుండి తిరోగమన దారులు నుండి జాతిని రక్షించవలసిన బాధ్యత క్రాంతదర్శులయిన ఉల్ఫలాంటి సాహిత్యకారులదే... అని చెప్పక తప్పదు.

నిజానికి ఇంతటి వైజ్ఞానిక యుగంలో జ్ఞాన పుష్పాలను ఆఘ్రాణిస్తూ సైన్స్ అందించిన ఉత్తమ ఫలాలు అనుభవిస్తూ సుఖమయంగా జీవిస్తున్నందుకు మానవాళి తప్పక గర్వపడ వలసిందే.. కానీ దృశ్యం దానికి భిన్నంగా దర్శనమిస్తోంది. జంబూద్వీపే భరత వర్షే అన్నది పూర్వపు హద్దులు గురించిన ఆర్ష కాలం నాటి మాట. నేడు ఈ హద్దులు దూరంగా జరిగి అంతర్ధానమయి పోయాయి. విశ్వమానవ సాంస్కృతిక ప్రగతికి శాస్త్ర సాంకేతిక రంగం మరు భూమిగా మారిపోతోంది కాని సారవంతమైన భూమి కాలేక పోతోంది.



యుద్ధము - శాంతి

ప్రపంచం ఎంత విశాలమైందో, అంత మేరా విజ్ఞానం కాంతిలా పరుచుకుని వుంది. అంతటి విజ్ఞాన ప్రపంచంలో మానవుడు తనకిష్టమైన చోట సుఖంగా జీవించే అదృష్టం విజ్ఞానం ద్వారానే సంపాదించుకున్నాడు. అయితే దురదృష్ట వశాత్తూ మానవుడు సముపార్జించుకున్న విజ్ఞానం, హింసాయుత జీవితం గడపడానికే ఉపయోగించు కుంటున్నాడు. ప్రపంచంలో ప్రతి నిముషమూ ఏదో ఒకచోట మానవ బాంబు పేలి విధ్వంసం సృష్టించబడుతోంది. విజ్ఞానమూ, సైన్స్ మానవుడికి పిచ్చివాని చేతిలో రాయి మాదిరి అయ్యింది. సైన్స్ ఎన్నో ఆనందాల్నిచ్చి పెద్ద విషాదంగా తయారయ్యింది. ఎన్నో సౌకర్యాలిచ్చి అసౌకర్యంగా మారింది. ప్రపంచ ప్రాంగణంలో అడుగు పెట్టిన ఇరవయ్యొకటో శతాబ్దం ఎన్నో ఆధునిక సమస్యలు తెచ్చి పరిష్కారంకోసం ఎదురుచూస్తోంది. ప్రపంచ పౌరుడైన కవి, రచయిత, మేధావి, తాత్వికుడు ఆ సమస్యలకి స్పందించి తమ తమ కళాప్రక్రియల్లో జవాబులందించి ప్రపంచంలో శాంతిని నెలకొల్పవలసిన అవసరం ఏర్పడింది. ఇది ఒక యుగమంత ప్రశ్న.

మానవుడు అమానుషంగా తన మూలాలు తానే అంతరించుకు పోయేలా చేయడానికి ప్రయత్నించడం, ఇంత వరకూ మానవజాతి సముపార్జించుకున్న శాస్త్రవిజ్ఞాన సంపదని తానే విధ్వంసం చేసుకోవడం ఈ రెండూ నేటి నాగరిక సామాజికులు చేయకూడనివి, కలలోనైనా తలపెట్టరానివి. ప్రపంచ సాహిత్యకారులందరూ తమ సృజనాత్మకతను అనే పద్యానికి అంకితం చేయవలసి వుంది. ఆలోచనలకి పదును పెట్టవలసి వుంది.

కాల ప్రవాహంలో ప్రవహించే చరిత్రనౌక ఒక శుభముహూర్తాన ఏదో ఒక సువర్ణతీరాన్నిచేరి మానవ జాతి శాంతియుత సహజీవనం గడిపిందని ఏనాటికైనా రికార్డు చేయగలదని విశ్వసిద్దాం.

చరిత్ర అంటే తీవ్రవాది చెప్పిన రక్తపాతంతో కూడిన బీభత్స రసభరితమైన కథ కాదు. సంఘటన అంతకన్నా కాదు, కాకూడదు అని సర్వులూ గ్రహించాలి. చరిత్ర నౌకని, ఒడుదుడుకులు లేకుండా కాలప్రవాహంలో సజావుగా నడిపించేశక్తి ఆధునిక మానవునికి సంపూర్ణంగా వుంది. ఇది ప్రపంచ మానవాళి అందరూ గ్రహించవలసిన సత్యం.... ఈ నౌకకి, సాహిత్యం చుక్కాని, తీరం సామ్యవాదం.

# బాపూ దారిచూపు

**- విన్సెంట్ షీన్**



బిర్లా హౌజ్‌లో ప్రార్థనా సమావేశానికి ఒక టాక్సీలో వెళ్ళాను. ఈసారి నేను ఒక్కణ్ణే వెళ్ళాను. బిర్లా భవనం ప్రధాన ద్వారం ఎదుట ఉన్న ఒక చెట్టు కింద టాక్సీని నిలిపి, ప్రార్థనా స్థలికి నడిచి వెళ్ళాను. సమయం అప్పటి కింకా ఐదు గంటలు కాలేదు. ప్రజలు నడిచో లేదా కార్లలోను, టాంగాలలోను ప్రార్థనా సమావేశానికి వస్తూనే వున్నారు. బిర్లా హౌజ్ ఉద్యానవనంలో ఒక చివరగా ఉన్న ప్రార్థనా స్థలికి వెళ్ళగానే బాబ్ సిమ్సన్ (బ్రిటిష్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్, ఢిల్లీ కరస్పాండెంట్) ఎదురయ్యాడు. మేము మాటల్లో పడ్డాము. అమృత్‌సర్‌కు నా ప్రయాణం గురించి, అక్కడ చోటుచేసుకున్న సంఘటనల గురించి బాబ్‌కు చెప్పాను. గాంధీజీ ప్రార్థనా సమావేశం వద్ద పత్రికా ప్రతినిధులెవరినైనా చూడటం చాలా అరుదు. బిబిసి కోసం మహాత్మునికి కొన్ని ప్రశ్నలు సమర్పించానని, ఎలాగూ వచ్చాను కాబట్టి ప్రార్థన అయిపోయేంతవరకు ఉంటానని బాబ్ చెప్పాడు. అతడు తన గడియారం చూసుకొని ఇలా అన్నాడు. 'చిత్రంగా ఉందే, ప్రార్థనా సమయం అయినా గాంధీజీ ఇంకా రాలేదు. సాధారణంగా ఆయన ఎప్పుడూ ఆలస్యంగా రారు.' మేమిరువురమూ మళ్ళీ మా గడియారాల వంక చూసుకొన్నాము. 'అదిగో ఆయన వస్తున్నారు' అని బాబ్ అన్నప్పుడు నా గడియారంలో సమయం 5 గంటల 12 నిమిషాలుగా ఉంది. తోటవైపున ఉన్న గోడ మూలకు దగ్గరలో మేము నిలబడి వున్నాము. అస్తమిస్తోన్న సూర్యుని కిరణాలు ఆయన ముదురు గోధుమరంగు తలపై పడి ప్రకాశిస్తున్నాయి. ఆయన ఆ సాయంత్రం చెట్ల కింద నుండి కాక పూల మొక్కలకు ఆవలివైపున ఉన్న పచ్చిక బయలు మీదుగా నడిచి వస్తున్నారు. బిర్లా హౌజ్ ప్రాంగణంలో అటూ ఇటూ చెట్లు ఉన్న బాట, పచ్చిక బయలు, చాలా పూలచెట్లు, ఆ తరువాత విశాలమైదానం ఉన్నాయి.

సంధ్య వెలుగులతో శోభితమయ్యే ఢిల్లీ సాయంత్రాలలో అది ఒకటి. వెచ్చదనం లేదు. అయితే వసంతాగమన సూచనలు కన్పిస్తున్నాయి. బాబ్, నేను తీరిగ్గా మాట్లాడు కొంటున్నాము. ఇద్దరు యువతుల భుజాలపై చేతులు వేసి మహాత్ముడు పచ్చిక బయలు మీద నుంచి మెల్లగా మా వైపు నడిచి వస్తున్నారు. ఆయన వెనుక ఇద్దరో, ముగ్గురో కుటుంబ సభ్యులు (లేదా అనుయాయులు) ఉన్నారు. మా వైపు వస్తోన్న మహాత్ముడిని చూశానే గాని ఏమి చూశానో ఇప్పుడు నాకు గుర్తు రావడం లేదు. ఆ తరువాత కొద్ది రోజులకు ఆయన కాళ్ళకు చందనపు పావుకోళ్ళు ఉన్నాయని చదివాను. నాకైతే వాటిని చూసిన జ్ఞాపకం లేదు. ఆయన పచ్చిక బయలు మీద ఒట్టి కాళ్ళతో నడచి వస్తున్నట్లు నాకు కనిపించింది. ఆ సాయంసంధ్యా వాతావరణంలో వెచ్చదనం లేకపోవడంతో గాంధీజీ ఖద్దరు శాలువా కప్పుకొన్నారు. మాకు అవతలి వైపు నుంచి మమ్ములను దాటిపోయి ప్రార్థనా వేదికకు దారితీసే నాలుగైదు మెట్లు ఎక్కడానికి మలుపు తిరిగారు. అక్కడ మామూలుగానే ప్రజలు బాగా గుమిగూడి ఉన్నారు. గాంధీజీ వస్తుండగా కొంతమంది అలానే నిలబడి ఉండగా మరికొంతమంది వంగి ఆయన కాళ్ళకు నమస్కారాలు చేస్తున్నారు. బాబ్, నేను ఆ వైపుకు తిరిగి చూస్తున్నాము. మేము ప్రార్థనా సమావేశ వేదికకు దారితీసే మెట్లకు పది అడుగుల దూరంలో ఉన్నాము. అయితే ప్రజా సమూహం అడ్డంగా ఉండటం వలన గాంధీజీ మాకు సరిగా కనిపించలేదు. ఆ తరువాత కొద్ది క్షణాలకే తక్కువ శబ్దంతో నాలుగు పేలుళ్ళు వినిపించాయి. నేను ఒక్కసారిగా భీతిల్లిపోయి 'ఏమిటది' అని బాబ్‌ను అడిగాను. 'నాకూ

తెలియడం లేద'ని అతడు అన్నాడు. అతని మోము ఒక్కసారిగా పాలిపోవడం నాకు ఇప్పటికీ బాగా గుర్తు. 'మహాత్ముడు కాదు కదా!' అన్నాను. అన్నానో లేదో జరిగిందేమిటో తెలిసింది.

నా మనస్సులో అశాంతి కెరటాలు ఉవ్వెత్తున లేచాయి. వాటిని సముద్రపు అలల ఉగ్రతాండవంతో మాత్రమే నేను పోల్చగలను. ఇదంతా నాకు ఇప్పటికీ బాగా గుర్తు ఉంది. ఒక విధమైన నిస్త్రాణతో రాయిమీద కూలబడి గోడకు ఆనుకున్నాను. మహాత్ముని స్మృతి నన్ను విడిచి వెళ్ళిపోయిన భావన కలిగింది. అప్పటి నా పరిస్థితిని ఈ విధంగా మినహా మరోలా వ్యక్తం చేయలేను. మరికొద్ది నిమిషాలవరకు నా మనస్సులో తుఫాను కొనసాగింది. అలా ఎంతసేపు కొనసాగిందో తెలుసుకొనే అవకాశం నాకు లేదు. సరిగ్గా ఆ సమయంలోనే చాలా విషయాలు చోటు చేసుకున్నాయి. నాకు చేరువలోని పరిసరాల్లో – కొద్ది గజాల దూరంలో – అనేక సంఘటనల పరంపర చోటుచేసుకొంది. అవేమిటో, ఎలా జరిగాయో నాకు తెలియదు. ఒక డాక్టరు పరుగున వచ్చాడు. పోలీసులు అక్కడి పరిస్థితులను అదుపులోకి తీసుకొన్నారు. మహాత్ముని భౌతిక కాయాన్ని అక్కడి నుండి తీసుకెళ్ళిపోయారు. గుమిగూడిన ప్రజలు చెదిరిపోయారు. బహుశా పోలీసుల హెచ్చరికలతోనే ఎవరి దోవన వారు వెళ్ళిపోయి వుంటారు. ఇదేమీ నేను చూడలేదు. మహాత్ముడిని నేను చివరిసారి చూసింది ఆ సాయంసంధ్య వెలుగుల్లో పచ్చిక బయలు మీద నడిచి ప్రార్థనా సమావేశ వేదిక వద్దకు వెళుతుండగా. ఎట్టకేలకు నేను శక్తిని కూడదీసుకొని లేచి నిలబడేసరికి అక్కడ పోలీసులు, సైనికులు మినహా ప్రజలు పెద్దగా ఎవరూ లేరు. బాబ్ సిమ్సన్ అక్కడే ఉన్నాడు. అతనికీ ఊపిరాడటం లేదు. బిబిసికి ఫోన్ చేయడానికి కాబోలు ఎక్కడికో వెళ్ళాడు. నాతోపాటు పచ్చిక బయలుకు దారితీసే మెట్లు దిగాడు. కొంతసేపు పూల మొక్కల పక్కన నడిచాము. చెట్లబాటకు ఒక చివర గ్లాస్ ద్వారాలు, కిటికీలు ఉన్న ఒక గది ఉంది. ప్రజలు అక్కడ గుమిగూడి వున్నారు. వారిని అక్కడి నుంచి పంపించివేయటానికి పోలీసులు నానావిధాల ప్రయత్నిస్తున్నారు. మహాత్ముడిని ఆ గదిలోకి తీసుకెళ్ళారని మాత్రమే బాబ్ అప్పుడు నాకు చెప్పాడు. మహాత్ముడిని తీసుకెళుతుండగా చూశాననీ, ఆయన ఒంటిమీద ఉన్న ఖద్దరు బట్టలు పూర్తిగా రక్తంతో తడిసిపోయి ఉన్నాయనీ బాబ్ మరుసటిరోజు నాకు చెప్పాడు.

***(జనవరి 30, మహాత్ముని వర్ధంతి)***

# ఆరని జ్యోతి

**మ**న జీవితంలోని వెలుగు ఆరిపోయింది. అంతటా చీకట్లు అలముకొన్నవి. మీకేమి చెప్పాలో, ఎలా చెప్పాలో నాకు తెలియడం లేదు. మనం 'బాపూ' అని పిలిచిన మన ప్రియతమ నాయకుడు, మన జాతిపిత, ఇక మనకు లేడు. నే నీ విధంగా అనడం తప్పు కావచ్చు. అయినా ఎన్నో సంవత్సరాలుగా మనం ఆయనను చూస్తూ ఉన్నట్టు ఇక మీదట చూడలేము. సలహా కోసం ఆయన దగ్గరకు పరుగెత్తడమూ, ఓదార్పు కోసం ఆయన సన్నిధికి చేరడమూ ఉండదు. ఆ విధంగా చేరలేని దుస్థితి నాకే కాదు. ఈ దేశంలోని కోట్లకొలది ప్రజలకు తీవ్రాఘాతంగా తోస్తుంది. ఈ బాధను నేను గాని, మరే వ్యక్తిగాని హిత వచనాలతో ఉపశమింప జేయడం కష్టసాధ్యం.



వెలుగారిపోయిందని నేనన్నాను. కాని నే నన్నది తప్పు. ఎందుచేతనంటే మన దేశాన్ని తేజోమయం గావించిన ఆ కాంతి ఇక ముందు కూడా ఈ దేశంలో ఎన్నో సంవత్సరాల పాటు తన ప్రకాశాన్ని దశదిశల ప్రసరిస్తుంది. వెయ్యి ఏళ్ళు గడిచాక కూడా ఈ దేశంలో ఆ కాంతి ఇంకా వెలుగుతూనే వుంటుంది. ప్రపంచానికది ఇంకా కనిపిస్తూనే వుంటుంది. అసంఖ్యాక హృదయాలకు శాంతినీ, ఓదార్పునూ ప్రసాదిస్తూనే వుంటుంది.

ఎందుచేత నంటే ఆ కాంతి కేవలం వర్తమానానికి మాత్రమే పరిమితం కాలేదు. అది చిరంతన సత్యాలను ప్రబోధిస్తూ, మనల్ని తప్పు దారుల నుండి మరలిస్తూ సరియైన త్రోవ చూపుతూ తరతరాల ప్రాచీన చారిత్రక వైభవానికి నెలవైన ఈ దేశాన్ని తిరిగి స్వాతంత్ర్య గమ్యం వైపు నడిపిస్తూ వెలిగింది.

**- జవహర్‌లాల్ నెహ్రూ**

# నాయకురాలు నాగాంబ

- భట్టిప్రోలు ఆంజనేయశర్మ

మధ్యయుగ ఆంధ్రదేశచరిత్రలో తప్పుగా అర్థం చేసికోబడి బురద పులుమబడిన వ్యక్తి నాగాంబ. సంప్రదాయ సాహిత్యపరంగా కూడా పల్నాటి యుద్ధానికి కారకురాలు-దోషి-నాగాంబ. మహాభారత కథలోని శకునితో, రామాయణంలోని మంథరతో నాగాంబను కవులు, విమర్శకులు పోలుస్తుంటారు. మంచితనం రూపుదాల్చిన వ్యక్తిగా 'పల్నాటి శ్రీకృష్ణు'నిగా నాగాంబ ప్రత్యర్థి బ్రహ్మన్నను పోలుస్తారు. అధికారంపై మోహమూ, హైహయసింహాసనానికి తానే ముఖ్యమైన శక్తిగా గుర్తింపు పొందాలనే ఆరాటం, అతిశయం మున్నగు స్త్రీ సహజమైన బలహీనతలు నాగాంబలో లేకపోలేదు. కానీ పల్నాటి యుద్ధానికి నాగాంబే కారకురాలు అనడం అన్యాయం, చారిత్రక అసత్యం.

పల్నాటి యుద్ధానికి సంబంధించిన చారిత్రక ఆధారాలు చాల తక్కువ. అవికూడ బ్రహ్మన్నపక్షాన వక్రీకరించబడినై. కానీ యుద్ధసమయంలోనూ, శాంతి సమయంలోనూ - శక్తిసామర్థ్యాలు, పాలనాదక్షత ఉన్న వ్యక్తి నాగాంబ - అనే విషయాన్ని ఆ ఆధారాలు దాచలేవు. నాగమ్మే స్వయంగా సైన్యాన్ని యుద్ధభూమికి నడిపించింది. నలగాముని దక్షిణభాగాన ఉండి యుద్ధవ్యూహాన్ని వివరించింది. నాగులేరు ప్రక్కన కారెమపూడి కొండలలోని విశాలమైన పంటచెరువు ప్రజాసంక్షేమంపై నాగమ్మకున్న శ్రద్ధకు చక్కని ఉదాహరణ. పటిష్టము స్వేచ్ఛాపూరితము అయిన నాగమ్మపాలన ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నది. కొదమగండ్ల గ్రామ ప్రజలు నలగామునిపైన, నాయకురాలునిపైన చూపిన గౌరవం ఇందుకు ఉదాహరణ. నేటికీ పలనాటి ప్రజలు నాగమ్మను 'విష్ణుమాయ'గా కీర్తిస్తారు. దాచేపల్లి, ఉబ్బెపల్లి, కారెమపూడి, గి(జి)ట్టగామాలపాడు మున్నగు గ్రామాలలో నాగమ్మకు ఆలయాలున్నాయి. పండుగదినాలలో ఆమెకు పూజాద్రవ్యాలు సమర్పిస్తారు, సంతానానికి ఆమెపేరు పెట్టుకుంటారు.

అంతిమవిజయం నాయకురాలిదే. శక్తివంతులైన సమకాలీన పాలకులు ఆమెపక్షం వహించారు అనే చారిత్రక సత్యాన్ని గ్రహిస్తే నాగమ్మ వ్యక్తిగతమైన కోరికతో యుద్ధ భీభత్సాన్ని సృష్టించలేదనే నిజం ఆవిష్కృతమౌతుంది. నాగాంబ పక్షం వహించిన నాయకులు: 1. ధరణికోట పాలకుడైన కోట భీమరాజు (A.D. 1153-82), అతని కుమారుడు కేతరాజు. 2. గుడిమెట్ల పాలకుడైన ఛాగి పోతరాజు (A.D. 1161-90) 3. అన్మకొండ పాలకుడైన కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు (A.D. 1158-96) 4. ద్వారసముద్ర పాలకుడైన హొయసల రాజు రెండవ బల్లల (A.D. 1173 - 1224) 5. దేశింగ రాజు-కళ్యాణి పాలకుడైన చివరి కాలచురి రాజు సింఘన (A.D. 1183)

బ్రహ్మనాయడు, అతనికుటుంబం వెలనాటి ప్రాంతం వారు; పల్నాటికి కొత్తవారు. అనుగురాజుతో మైలమ వివాహ సందర్భంగా వెలనాటి రాజేంద్రచోడుడు కుమార్తెకు అరణంగా పలనాడు ఇచ్చాడు. హైహయ వంశీయులపై నిఘా ఉంచడానికి చందోలు పాలకులైన చోడరాజుల రాజ(కీయ) ప్రతినిధులుగా బ్రహ్మన్న కుటుంబీకులను గురజాల పంపాడు. (బ్రహ్మన్న అతని మిత్రుల విచ్చలవిడి సాంఘిక దుష్కృత్యాలకు ఖిన్నులైన ప్రజల నూరడించడానికి, బ్రహ్మన్నను దూరంగా పంపడం కూడా ఒక ఎత్తు). అప్పటి వరకు పల్నాడులో ఉన్నతస్థానాలలో ఉన్నవారు రెడ్డి ప్రభువులు. తమ ఆర్థిక వనరులలో కొత్తవారైన వెలమల ప్రవేశమూ, రాజాస్థానంలో వారి ఆధిపత్యమూ స్థానికరెడ్డి నాయకులలో అసంతృప్తికి కారణమైంది.

బ్రహ్మనాయడు విప్లవాత్మకమైన సాంఘిక సంస్కరణలు ప్రవేశపెట్టాడు. సహపంక్తి భోజనం (చాపకూడు), కులాంతర వివాహాలు ప్రోత్సహించాడు. పంచములను మాచర్లలోని చెన్నకేశవ ఆలయంలోనికి అనుమతించాడు. పంచములు,

డా. భట్టిప్రోలు ఆంజనేయశర్మ, ఫోన్ : 9441263553

ఇతర నిమ్నకులజులు అతని పంచన చేరారు. శతాబ్దాలుగా అణచివేతకు గురైన పంచములలో ఇతర నిమ్నకులజులలో ఉన్నత కులజులపై ద్వేషం, ప్రతీకార వాంఛ రెచ్చగొట్ట బడినాయి. కానీ లోతుగా వేళ్లూనిన సాంఘిక చట్రాన్ని విధ్వంసం చేయడం కన్నమదాసు బ్రహ్మన్నలకు సాధ్యం కాలేదు.

ఇక్కడొక విషయం గ్రహించడమవసరం: బ్రహ్మనాయని విప్లవాత్మక సంస్కరణలు – సాంఘికన్యాయం సమానత్వం ఉన్నత విలువలుగా గుర్తించే నేటి ప్రజలు ఆదరించగలరు కానీ అజ్ఞానంలో అంధవిశ్వాసాలతో దేవునిశాపభీతితో మ్రగ్గుతున్న నాటి (మధ్యయుగ) ప్రజలు తీవ్రవ్యతిరేకతను వ్యక్తం చేయడం సహజం. అతని కుటుంబ సభ్యులు కూడా వ్యతిరేకించినట్లు తెలుస్తోంది. అతని కుమారుడు బాలచంద్రుడు భగవాన్ శ్రీకృష్ణుడు నిర్దేశించిన, మనుస్మృతికి అనుగుణమైన – కుల విభజన ఉండాలనే అంటాడు. అంతేకాదు, కారెమపూడి యుద్ధానంతరం నాగులేరు ఒడ్డున నిర్మించిన దేవాలయంలో బ్రాహ్మణ పూజారులనే బ్రహ్మనాయుడు నియమించాడు.

బ్రహ్మనాయని విప్లవాత్మక సంస్కరణలు, సాంఘికన్యాయం సమానత్వం ఉన్నత విలువలుగా గుర్తించే నేటి ప్రజలు ఆదరించగలరు కానీ అజ్ఞానంలో అంధవిశ్వాసాలతో దేవునిశాపభీతితో మ్రగ్గుతున్న నాటి (మధ్యయుగ) ప్రజలు తీవ్రవ్యతిరేకతను వ్యక్తం చేయడం సహజం.

నిజానికి, నిమ్నకులజుల అజ్ఞానాన్ని బ్రహ్మనాయుడు వ్యక్తిగత స్వార్థానికి ఉపయోగించుకున్నట్లు కనిపిస్తుంది. ఆనాడు ఆంధ్రదేశం సాంఘిక మత అలజడులతో నిండి ఉంది. శైవ, వైష్ణవ భక్తి ఉద్యమాలతో ఉగ్రరూతలూగుతోంది. బ్రహ్మనాయుడు వైష్ణవాన్ని ప్రచారంచేశాడు. నాలుగు ప్రధాన కులస్త్రీలను వివాహమాడాడు. పంచముడైన కన్నమదాసుని దత్తత చేసుకున్నాడు. మాచర్లలోని చెన్నకేశవస్వామి ఆలయంలోనికి పంచములకు ప్రవేశం కల్పించాడు. 'చాపకూడు'–సహపంక్తి భోజనం ప్రచారం చేశాడు. వైష్ణవదీక్ష ఇచ్చేటప్పుడు తన ఉచ్ఛిష్టాన్ని తినిపించేవాడు. 'దాస' అని పేరు మార్చేవాడు. సంస్కరణలకు ఉన్నతకులజుల నుండి వ్యతిరేకత వచ్చింది. 15వ శతాబ్ది తెలుగు కవి మాటల్లో – నాయకురాలి కుతంత్రాలు, బ్రహ్మనాయని చాపకూడు పల్నాటి యుద్ధానికి సమాన కారణాలు. సిద్ధంగాలేని ప్రజలపై బ్రహ్మనాయుడు విప్లవభావాల్ని రుద్దాడు. అవి బెడిసి కొట్టాయి. ప్రజలు నమ్మిన భావాల్ని – అవి ప్రగతి కారకాలు కానీ, అభివృద్ధి నిరోధకాలు కానీ – నాగమ్మ రెచ్చగొట్టింది. శతాబ్దాలుగా ఘనీభవించిన సాంఘిక చట్రం విచ్ఛిన్నం కావడాన్ని ఎదిరించింది. *జనవాక్యంతు కర్తవ్యం* నానుడికి అనుగుణంగా ప్రవర్తించింది ప్రజాభిప్రాయం గెలుపొందడం లోనే ఆమె విజయం ఉంది. వ్రేళ్ళు లేని ఆదర్శం యొక్క విషాదమే బ్రహ్మన్న పతనం.

పోల్చిన కవిభావం వేరైనప్పటికీ, ఒక దృష్టిలో బ్రహ్మనాయన్ని శ్రీకృష్ణునితో పోల్చడం సబబే అనిపిస్తుంది. తన యదువంశానికి అనుకూలంగా కురుక్షేత్ర యుద్ధంలో కౌరవపాండవుల నాశనాన్ని శ్రీకృష్ణుడు ఆశించాడు. హైహయులను, వారి మిత్రులను కాలచురి వంశస్థులను, కారెమపూడి రణరంగానికి ప్రోత్సహించి వారి నాశనంతో తన కుమారుడు బాలచంద్రుడు పల్నాటి సింహాసనాధీశుడు కావడమే బ్రహ్మనాయని ఆశయం. నలగాముని అల్లుడయిన కాలచురి యువరాజు అలరాజును చంపించడం, బాలచంద్రుని యుద్ధభూమికి దూరంగా ఉంచే ప్రయత్నం – బ్రహ్మనాయుని ఆశయ సాధనాయత్నానికుదాహరణలు. ఈ దుర్మార్గపు యత్నం, శ్రీకృష్ణునికి జరిగినట్లే, నిరాశా నిస్పృహలతో అంతమైంది.

నాయకురాలికి అనుకూలంగా బ్రహ్మనాయనికి వ్యతిరేకంగా ఇన్ని ఆధారాలున్నప్పటికీ నాగమ్మపై బురదజల్లడం జరిగింది. ఆమె చేసిన మొదటి పాపం: స్త్రీకి ఏ మాత్రం గౌరవంలేని సమాజంలో స్త్రీగా జన్మించడం. వనిత, విత్తము సర్వానర్థాలకు కారణాలని కవులు యోగులు శతాబ్దాలుగా నూరిపోస్తున్నారు. నమ్మకమైన స్త్రీ 'తెల్లని కాకి'లా అరుదు అని బాల్యం నుండి నేర్పుతున్నాము. గృహిణికి ఉన్న 'భార్య' పదం 'భరించవలసినది' అనే అర్థాన్నిస్తుంది. బహుభార్యత్వము, అమ్మకానికి పడతులు విరివిగా లభించే సమాజంలో స్త్రీకి గౌరవాన్ని ఆశించడం అర్థంలేని విషయం. అనుగురాజుకు ముగ్గురు భార్యలు, బ్రహ్మనాయనికి నలుగురు భార్యలు. మాంచాలను బాలచంద్రునికై అతని మేనమామ నుండి కొన్నారు. స్త్రీ ఆటవస్తువు సంతానాన్నిచ్చే యంత్రం. హైందవ ధర్మప్రకారం కర్మకాండలు నిర్వర్తించడానికి అవసరమయిన 'మగ' సంతానాన్ని కనడానికి స్త్రీని పురుషులు

భరించాలి. ఇటువంటి సమాజంలో జన్మించిన నాగమ్మ హైందవ స్త్రీలు ఉన్నత విలువగా భావించే నమ్రత, అభిమానములను ప్రక్కకు బెట్టి, స్త్రీ స్థానమైన వంటింటిని కాదని – పురుషుని 'గుత్త' అయిన రాజాస్థానాన్ని ప్రవేశించింది. అంతేకాదు, పల్నాటి శ్రీకృష్ణుడైన బ్రహ్మన్నకు ప్రత్యర్థి అయింది. ఆమె విజయం పురుషాహంకారాన్ని దెబ్బతీసింది. తర్వాతి కాలపు చరిత్రలో ఆమె వ్యక్తిత్వాన్ని మసిబూసిన మారేడుకాయగా మార్చడం జరిగింది.

*ఇక రెండోకారణం:* పల్నాటి చరిత్రకు వాఙ్మయమే ముఖ్య ఆధారం. అదీ గేయరూపంలో. 'దాసర్లు'గా గుర్తించబడే పంచములకే ఆ గేయాలు పరిమితం. ఆ పంచములనే బ్రహ్మనాయుడు ఉన్నతస్థానానికి తీసుకురా ప్రయత్నించాడు. వారు బ్రహ్మన్నకు కృతజ్ఞతాబద్ధులైనారు చారిత్రక సత్యాన్ని వక్రీకరించారు. తమ నాయకుని ఆకాశానికెత్తి కీర్తిగానం చేసారు. ప్రత్యర్థి నాయకురాలిని అపకీర్తిపాలు చేసారు.

నాగాంబ పేద రైతు కుటుంబంలో జన్మించింది. తండ్రి ఛాపదారి రామిరెడ్డి, మేన మామ మేకపోతు సింగారెడ్డి. ఆమె 'రెడ్డి నాగమ్మ'గా ప్రసిద్ధి గాంచింది. దాచేపల్లి దగ్గరలోని నాగులేటి ఒడ్డున ఉన్న గి(జి)ట్టగామాలపాడు నాగమ్మ స్వగ్రామం. 'పల్నాటివీరచరిత్ర', వీరజగ్గారెడ్డి నాగాంబ తండ్రి అనీ, మేకపోతులరెడ్డి మేనమామ అనీ పేర్కొంది. అక్కిరాజు ఉమాకాన్తం మాత్రం తండ్రి చౌదరి (ఛాపదారి) రామిరెడ్డి అనీ, మేనమామ మేకపోతు సింగారెడ్డి అనీ వ్రాశాడు. ఏది ఏమయినా అన్ని ఆధారాలు నాగాంబ 'పంట రెడ్డి' కులానికి చెందినట్లు తెలియచేస్తున్నాయి. నాయకురాలి ఉపకులం 'పాకనాటి'గా వీరభారతం పేర్కొంది. ఆరవెల్లి కుటుంబానికి నాయకురాలు కోడలు అని పల్నాటి వీరచరిత్రద్వారా తెలుస్తోంది. వల్లభామాత్యుని క్రీడాభిరామం కూడా దీన్ని బలపరుస్తోంది. నాగమ్మ భర్తపేరు తెలియదు. చిన్నతనంలోనే వైధవ్యం ప్రాప్తించి ఉండవచ్చు. భర్తమరణం తర్వాత యుద్ధ విద్యతో సహా అన్ని విద్యలు నాగాంబ అభ్యసించి ఉంటుంది.

> నాగాంబ పేద రైతు కుటుంబంలో జన్మించింది. తండ్రి ఛాపదారి రామిరెడ్డి, మేనమామ మేకపోతు సింగారెడ్డి. ఆమె 'రెడ్డి నాగమ్మ'గా ప్రసిద్ధి గాంచింది. దాచేపల్లి దగ్గరలోని నాగులేటి ఒడ్డున ఉన్న గి(జి)ట్టగామాలపాడు నాగమ్మ స్వగ్రామం. 'పల్నాటివీరచరిత్ర' వీరజగ్గారెడ్డి నాగాంబ తండ్రి అనీ, మేకపోతులరెడ్డి మేనమామ అనీ పేర్కొంది.

నాగమ్మ గురజాల హైహయ రాజాస్థాన ప్రవేశం అంతుచిక్కని చారిత్రక సంఘటన. దొడ్డనాయుని, అతని కుమారుడు బ్రహ్మనాయని దుష్పరిపాలనను వ్యతిరేకించిన ప్రజాఉద్యమ నాయకురాలిగా నాగాంబను రాజాస్థానం ఆహ్వానించినట్లు వీరచరిత్ర, వీరభారతం ద్వారా తెలుస్తోంది. హైహయసింహాసనాన్ని దురాక్రమించడానికి దొడ్డనాయుడు, బ్రహ్మనాయుడు ప్రాంతీయ అధికారుల్ని అణగద్రొక్కే ప్రయత్నం చేసారు. ఇందుకు వ్యతిరేకంగా ప్రజలలో ఆందోళనలు, ఉద్యమాలు చేలరేగాయి. పలనాటిలోని ఒక సంప్రదాయ కథానుసారం – అటువంటి ఒక ఉద్యమంలో నాగమ్మ తండ్రి హత్యకు గురైనాడు. వ్యక్తిగత ప్రతీకారాన్ని తీర్చుకోవడానికీ, ప్రజాభీష్టాన్ని నెరవేర్చడానికి నాగమ్మ ఉద్యమించింది. నాగమ్మకు ఉన్నత కులస్థుల గట్టి అండదండలు లభించాయి. పాలకులపై అసంతుష్టులైన పలనాటి ప్రజలకు పాలకులకు నాగాంబ 'నాయకురాలు' అయింది. అనుగురాజు కూడా వెలమనాయకులతో విసిగెత్తి, తను–తన కుటుంబం, వారి కనుసన్నల నుండి బయటపడడానికి తగినశక్తిగా గుర్తించి నాగాంబకు ఆస్థానంలో చోటిచ్చాడు. అనుగురాజు ఆశల్ని నాగాంబ వమ్ము చేయలేదు.

బ్రహ్మనాయుడు ముఖ్య మంత్రి అయిన వెంటనే తన స్థానాన్ని పదిలపరచుకొనే ప్రయత్నం చేసాడు. అనుగు రాజును, తండ్రి దొడ్డమనాయుని అంతమొందించాడు. మైలమ తనయుడు నలగాముని సింహాసనాధీశుణ్ణి చేసాడు భూరమ తనయుడు నరసింహ రాజును యువరాజు చేసాడు. హైహయ కుటుంబంలో చిచ్చుపెట్టే ప్రయత్నమే యిది. పరిపాలనను పటిష్ఠ పరచలేదు. ప్రజోపయోగ కార్యాలు చేసిన ఆధారాలు లేవు. ఆతని పాలనాకాలంలో పల్నాటి ప్రజలు పన్నుల భారంతో క్రుంగిపోయారు. ఆదాయంలో చాలభాగం బ్రహ్మనాయుడు, అతని సన్నిహితుల పాలయింది. క్రమంగా రాజ్యం పతనావస్థను చేరింది. శత్రువులు బలపడసాగారు.

నాగాంబ బ్రహ్మనాయని ఎత్తులను గ్రహించింది. ప్రాంతీయ భావాల్ని రెచ్చగొట్టి నరసింహరాజును తనవైపు త్రిప్పుకోగలిగింది. ఆర్థిక ఇబ్బందులకు కారణాలను రాజుకు విశదీకరించింది. నాగమ్మ సలహా మేరకు బ్రహ్మనాయని, అతని సన్నిహితుల గృహాలను నలగాముడు వెతికించాడు.

పెద్దమొత్తాల్లో ధనం దొరికింది. బ్రహ్మనాయని మోసం బహిర్గతమైంది. నాగాంబ పరపతి పెరిగింది; అనధికార ముఖ్యమంత్రి అయింది. బ్రహ్మనాయడు రాజాస్థానం నుండి దాదాపు తొలగించబడ్డాడు. అతని ఆశాసౌధం కూలగొట్ట బడినట్లయింది.

నరసింహరాజు నాగమ్మ పక్షాన చేరిన తర్వాత బ్రహ్మనాయడు మలిదేవునిలో రాజ్య కాంక్షను రెచ్చగొట్టాడు. ఏ మాత్రం అవకాశం లేని మలిదేవుని సింహాసనానికి వారసునిగా ప్రకటించాడు. రాజ్యంకోసం కుటుంబకలహాలు ఆంధ్రదేశంలో అసహజం కాదు – బ్రహ్మనాయడు ఇంకొక కుటుంబకలహానికి ఆజ్యం పోసాడు. కారెమపూడి యుద్ధానికి ముందు శాంతిదూతగా వచ్చిన కోటకేతరాజు, హైహయ కుటుంబాన్ని రెండుగా చీల్చి, అన్నదమ్ముల మధ్య ద్వేషాన్ని రగిల్చిన వాడు బ్రహ్మనాయడు అని నిందించాడు.

బ్రహ్మనాయని అంతిమ లక్ష్యాన్ని గ్రహించిన నాగాంబ రాజ్యవిభజనను వ్యతిరేకించింది. ధనాన్ని పంచుకోవచ్చుగానీ, అధికారం పంచుకోరాదని నలగామునిని హెచ్చరించింది. రాజకీయ విజ్ఞతకు, పాలనాదక్షతకు, పలనాటి రాజ్య రక్షణ విషయంలో నాగాంబ ఆరాటానికి ఈ సలహా చక్కని ఉదాహరణ. మలిదేవుని, అతని సోదరులను ఖైదు చేసే కఠిన చర్య తీసికుంది. దాససైన్యంతో కన్నమదాసు నాయకత్వంలో బ్రహ్మనాయడు యుద్ధం ప్రకటించాడు. శక్తికంటె విజ్ఞత (ధన మాన ప్రాణ నష్టాల్ని అంచనావేసి యుద్ధాన్ని వ్యతిరేకించడమే) నయమని నాగాంబ తలచింది. ఆమె సలహామేరకు మలిదేవునితో రాజ్యాన్ని అనుభవించడానికి నలగాముడు వార్త పంపాడు. బ్రహ్మనాయని పథకం పారింది. హైహయరాజ్యం రెండు ముక్కలైంది. మలిదేవుడు, అతని సోదరులతో బ్రహ్మన్న మాచర్లకు తరలాడు.

మాచర్ల స్వతంత్రరాజ్యం కావడం మాత్రమే బ్రహ్మనాయని ఆశయం కాదు. మలిదేవుడు నామమాత్రపు రాజుగా, బ్రహ్మన్న, మాచర్లకు పూర్తిపాలకుడయాడు. హైహయ రాజ్యాన్ని సగం ఆక్రమించిన బ్రహ్మన్న, గురజాలపై దృష్టి సారించి, చక్రవర్తులైన వెలనాటి పాలకులను ఇరుకున పడవేసి వారి అయిష్టతకు గురైనాడు. సాంఘిక మత సంస్కరణలకు మాచర్లను కేంద్రం చేశాడు. దురదృష్టవశాత్తూ గురజాల, మాచర్ల రాజ్యాలలోని సంఘ వ్యతిరేక శక్తులు వైష్ణవం ముసుగులో తలదాచుకొనే అవకాశం ఏర్పడింది. దీనికి ఉదాహరణ పల్నాటి వీరచరిత్రలోని కొర్తివీరుని గాథే!

బ్రహ్మనాయడు, కళ్యాణి రాజయిన సోమేశ్వరుని కుమార్తె సిరియాళదేవిని మలిదేవునికి వివాహం చేసి, మాచర్లకు కళ్యాణికి బాంధవ్యం నెలకొల్పాడు. కళ్యాణి రాజ్యం నుండి వస్తాదులను తెచ్చి మాచర్లలోని వీరులకు శిక్షణ ఇప్పించాడు. కాలచురి రాజులు వెలనాటి పాలకులకు శతృవులు. అన్మకొండ కాకతీయులతోనూ, నెల్లూరు తెలుగు చోడులతోనూ కాలచురి రాజులకు స్నేహసంబంధాలున్నై. వీరిరువురూ వెలనాటి చోడులపై కత్తికట్టి ఉన్నారు. కాకతి రుద్రదేవుడు వెలనాటి ఉత్తరభాగంపై దండెత్తినపుడు కాలచురి రాజులు దక్షిణ భాగంపై దండెత్తినారు. కాలచురులు, కాకతీయులు, తెలుగు చోడులు అంతా శైవులే. శైవప్రవక్త పండితారాధ్యునికి చందోలు రాజు విధించిన శిక్షకు ప్రతీకారంగా వీరంతా కలిసి వెలనాటి చోడులపై కక్ష తీర్చుకున్నారనిపిస్తుంది. ఆ పరిస్థితులలో బ్రహ్మనాయడు కాలచురి రాజులతో చేతులు కలిపాడు. ఇంకొకరినైతే అతి దుర్మార్గుడయిన వెన్నుపోటుదారునిగా చరిత్ర – వాఙ్మయం నిందించి ఉండేవి కానీ, అతని వైష్ణవశిష్యగణం దాసభక్తులు భగవాన్ శ్రీకృష్ణునిగా కీర్తించారు(?)!

బ్రహ్మనాయని కూట రాజకీయాన్ని నాగమ్మ అర్థం చేసుకుని నలగామునికి వివరించింది. పల్నాటి హైహయ రాజ్యాన్ని ఒకటిగా చేయటమే నాగాంబ అంతిమ లక్ష్యం. ఆమె ఆశయ సిద్ధికి బ్రహ్మన్నే మార్గం చూపాడు.

**కోడి పందేలు:** మలిదేవుని వివాహం తరువాత, వివాహ బహుమతులను నలగామునికిచ్చే మిషతో, బ్రహ్మనాయడు గురజాల వచ్చాడు. నిజానికి నలగాముని వివాహానికి ఆహ్వానించలేదు. నలగాముని ఆధిపత్యాన్ని గౌరవిస్తున్న దాఖలాలు లేవు. పెరిగిన మాచర్ల శక్తిసామర్థ్యాలను గురజాల ప్రభువులకు తెలియజెప్పే ప్రయత్నం అది!. తన తంత్రాలకు నాగాంబ ప్రతిస్పందనను తెలుసుకోవడం కూడా అవసరం.

నాగమ్మ తగిన ప్రత్యర్థి కదా! బ్రహ్మన్నని సాదరంగా ఆహ్వానించింది. స్నేహ సుహృద్భావ వాతావరణంలో గురజాల – మాచర్ల మధ్య కోడి పందేలను ప్రతిపాదించింది. తన రాజు తరఫున బ్రహ్మన్న అంగీకరించాడు. బ్రహ్మన్నలాంటి సంఘసంస్కర్త జూదానికి తలవొగ్గడం ఎంత హాస్యాస్పదం!

మాడుగుల గ్రామ ప్రజలు కూడ జూదం వలదని బ్రహ్మన్నను వారించారు. రెంటచింతలలో కోడిపందేలు జరిగాయి. మొదటిపందెంలో బ్రహ్మన్నను గెలుపు వరించింది. ఆనందాతిరేకంతో, దేనినైనాపణంగా పెడతాననీ– రాజ్యాన్నైనా సరేననీ – బ్రహ్మన్న అన్నాడు. చివరికి బ్రహ్మన్న ఓడిపోయాడు. మలిదేవుడు రాజ్యాన్ని కోల్పోయాడు.

'విషం పెట్టినా బ్రహ్మన్న చావలేదు' 'బలహీనమయిన వేదికనిచ్చినా బ్రహ్మన్న పడిపోలేదు' – అని పల్నాటి వీరచరిత్ర నాయకురాలి కుట్రలను బ్రహ్మన్న ఎలా వమ్ముచేసిందీ చెబుతుంది. నాగమ్మ మంత్రశక్తితో బ్రహ్మన్న కోడిని చంపినట్లు చెబుతుంది. ఎన్నిటినో వమ్ము చేసిన పల్నాటి కృష్ణుడు కోడిని బ్రతికించు కోలేకపోయాడు. ఓటమిని గెలుపుగా తారుమారు చేయలేక పోయాడు. అమాయికంగా నమ్మిన రాజును బ్రహ్మనాయడు మోసగించాడు. బ్రహ్మనాయని గురించి పల్నాటి వీరచరిత్రనాటి ప్రజాభి ప్రాయాన్ని నమోదు చేసింది. సమకాలీన ప్రజల తీర్పు ఎంతో సత్యం!

పల్నాటియుద్ధం కాకతీయ పూర్వయుగ ఆంధ్రులచరిత్రలో ఒక విశిష్టము, విలక్షణము అయిన చారిత్రక సంఘటన. కాని ఇది పలనాటి హైహయవంశస్థుల కుటుంబకలహంగా–రాజకీయంగా గుర్తించనవసరం లేని చాల చిన్న తగాదాగా అంచనా వేయబడుతోంది. చోళులు – చక్రవర్తులు; వెలనాటి దుర్జయులు – సామంతులు; పలనాటి హైహయులు – చిన్న సంస్థాన పాలకులు.

కులమత సామాజిక పరంగా చరిత్రను అధ్యయనం చేస్తే, పల్నాటియుద్ధం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న రాజకీయ ఘటన అని గుర్తించక తప్పదు. పల్నాటి యుద్ధ నేపథ్యము, అనంతర పరిణామాలు – ప్రాంతీయత, కుల–మత తత్వాలు, సనాతన సంస్కరణల మధ్య ఘర్షణ మున్నగు మధ్యయుగ ఆంధ్రదేశ సామాజిక పరివర్తనలోని అనేక కోణాలపై వెలుగును విస్తారంగా ప్రసరింప చేస్తాయి. రాజకీయంగాకూడ పల్నాటియుద్ధం సుదూర పరిణామాలకు సూచిక (సంకేతం) కాదు అని చెప్పలేము. చిల్లర (చిన్న చిన్న) ఘర్షణలతో కాలం వెళ్లబుచ్చే పాలకులు అంతమై, ఆంధ్రులంతా ఒకే గొడుగు క్రిందికి – కాకతీయ చక్రవర్తుల నీడన – చేరడానికి దారితీసింది. అంటే ఆంధ్ర భాష (తెలుగు) మాట్లాడే వారికి 'ఆంధ్రదేశం' ఏర్పడే అవకాశానికి దారి తీసిందని చెప్పవచ్చు. కాకతీయ యుగానంతరం కూడా సుమారు 100 సం. పాటు ఆంధ్రదేశ చరిత్రలో ముఖ్య పరిణామాలకు పల్నాటియుద్ధం కారణమైంది. క్షత్రియుల (హైహయులు), శూద్రుల (వెలమ లేక నాయడు) మధ్య యుద్ధంగా మొదలైన పల్నాటియుద్ధం ఇరువురు శూద్రుల (వెలమలు – రెడ్లు) మధ్య ఘర్షణగా అంతమైంది.

పల్నాటియుద్ధంలో బ్రాహ్మణుల ప్రాధాన్యత లేకపోవడం ముఖ్యమైన చారిత్రక విషయం. ఆంధ్రదేశంలో సామాజిక, మత ఉద్యమాలకు నాయకత్వ పాత్రను నిర్వహించే బ్రాహ్మణులు క్రమంగా తొలగించబడినారనటానికి స్పష్టమయిన ఉదాహరణ బ్రహ్మనాయడు. అప్పటివరకు విద్వాంసులైన బ్రాహ్మణులు నిర్వర్తించే సున్నితమయిన 'దూత' పాత్రనుకూడా పల్నాటియుద్ధంలో రాజవంశీయుడే పోషించాడు.

పల్నాటియుద్ధంలో బ్రాహ్మణుల ప్రాధాన్యత లేకపోవడం ముఖ్యమైన చారిత్రక విషయం. ఆంధ్రదేశంలో సామాజిక, మత ఉద్యమాలకు నాయకత్వ పాత్రను నిర్వహించే బ్రాహ్మణులు క్రమంగా తొలగించబడినారనటానికి స్పష్టమయిన ఉదాహరణ బ్రహ్మనాయడు.

పల్నాడులో హైహయులు అంతంకావడంతో క్షత్రియుల రాజకీయ ప్రాధాన్యత అంతరించింది. కొలది కాలంలోనే తెలంగాణా ప్రాంతంలోని క్షత్రియ పాలకులను రుద్రదేవుడు అంతమొందించాడు. శూద్రులు ఉత్తేజితులైనారు. బ్రహ్మదేయాల ద్వారా వ్యవసాయం వృద్ధి చెందింది. సామాజికంగా ఉన్నతస్థాయిని జైన–శైవ మతాలు వారికి ప్రసాదించాయి. ఈ సచ్ఛూద్రులు గౌరవ సూచికమయిన 'రాజు' నామాన్ని ధరించి (ఉదా: వేమరాజ, గొంకరాజ, బుద్ధరాజ, కేతరాజ) సంప్రదాయ పాలకులతో పాటు రాజకీయాధికారాన్ని అనుభవించ సాగారు.

ప్రథమ చాళుక్య – చోళరాజయిన రాజేంద్ర (లేక) కులోత్తుంగ చోళుడు దుర్జయ వంశస్థుడైన గొంకరాజును దత్తత స్వీకరించి వెలనాటి పాలకుణ్ణి చేసాడు. సూర్యవంశ చోళులను చంద్రవంశ చాళుక్యులను (రెండు క్షత్రియ వంశాలను) కలిపిన వ్యక్తిగా గుర్తించబడిన రాజేంద్రుడు చతుర్థ కులజుని (శూద్రుని), క్షత్రియుని హక్కు అయిన రాజ్యపాలనా బాధ్యతనిచ్చి సింహాసనాధీశుణ్ణి చేసాడు. శూద్రులు,

ఈవిధమైన రాజకీయాధికార ఆరోహణ కాకతీయ సామ్రాజ్యస్థాపన వరకు సాగింది.

రాజాస్థానంలోనూ, ఉద్యోగాలలోనూ కాకతీయుల కాలంలో బ్రాహ్మణులు లేకపోలేదు. రాజ్యానికి ముఖ్య ఆదాయమైన 'పన్ను' వసూలు చేసే బాధ్యతకు చదువుకున్న బ్రాహ్మణులు ఉపయోగింపబడినారు. కానీ భద్రత, న్యాయవ్యవస్థ, చతుర్థ కులజులైన – నాయకుల, రెడ్ల చేతుల్లోనే ఉండేది. కాకతీయరాజ్యం పతనమైన రెండు సంవత్సరాలలోనే అద్దంకి రాజధానిగా ప్రోలయవేముడు 'రెడ్డి' రాజ్యాన్ని స్థాపించడం 'స్వతంత్ర రెడ్డి రాజ్యస్థాపన' నేపథ్యాన్ని తయారించడంలోని కృషికి, ఆరాటానికి సూచికగా పల్నాటియుద్ధాన్ని మనం గుర్తించ వచ్చు.

ఆనాడు, సామాజిక మత విషయాలలో విప్లవాత్మకమైన మార్పు తీసుకురా ప్రయత్నించిన వారికి – పల్నాటియుద్ధం ఒక హెచ్చరిక. సనాతనధర్మరక్షకులంతా ఏకమై బ్రహ్మనాయని సంస్కరణోద్యమాన్ని ప్రతిఘటించారు. సామాజిక సమానత్వానికై కన్నడ దేశంలో ప్రయత్నించిన బసవేశ్వరుని జీవితం కూడ విషాదాంతమే. లోతుగా వ్రేళ్లూనుకుపోయిన కులతత్వాన్ని సమూలంగా అంతమొందించడం అసాధ్యం అనే విషయాన్ని, బసవేశ్వరుని ఎంతగానో అభిమానించే మల్లికార్జునపండితారాధ్యుడు గ్రహించాడు. భక్తితత్వం, వైదికమతం అవగాహనకు రావడం అవసరం అనే విషయం గ్రహించాడు. ఈ విషయాన్ని అతని గ్రంథం 'శివతత్వసారం' స్పష్టీకరిస్తోంది. బసవేశ్వరునిపైన పండితారాధ్యునిపైన భక్తిప్రపత్తులు కలిగిన వీరశైవకవి పాల్కురికి సోమనాథుడు తన సిద్ధాంతాన్ని నాలుగువేదాల సారం – 'చతుర్వేదసారం' అన్నాడు. నిజానికి వీరశైవమతం వైదికమూ కాదు, ఆగమ సంప్రదాయమూ కాదు. కానీ పాల్కురికి సోమనాథు డంతటివాడే, వేదప్రామాణికతను ఆపాదించని ఏ సిద్ధాంతమూ నాడు ప్రజాదరణకు నోచుకోదని గ్రహించాడు. ఈ విధమైన గ్రహింపు కాకతీయుల కాలంలో ఉచ్ఛస్థితికి చేరింది. కాకతీయులు శైవులైనా వైదిక సనాతనత్వాన్ని ఆదరించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది.

రుద్రదేవుని ఆశయాన్ని, అతని వారసుడు ప్రఖ్యాత గణపతిదేవుడు చాలవరకు నెరవేర్చాడు. తెలుగుభాష మాట్లాడే ప్రాంతాన్ని చాలవరకు ఒకే రాజ్యాధికారం క్రిందికి తీసుకువచ్చాడు – అంటే 'ఆంధ్రరాజ్య' స్థాపన జరిగింది! పంచమ కులంతో సహా 'పదునెనిమిది కులాలు' అని ఆనాటి శాసనాలు కొన్ని తెలియజేస్తున్నాయి. కులాలకు వ్యతిరేకంగా ప్రారంభించిన సంస్కరణోద్యమం అపజయం పాలై సామాజిక చట్రంలో కులం ఒక పునాది అయింది! సవర్ణహిందువులపై పంచములలో బ్రహ్మనాయుడు రెచ్చగొట్టిన ద్వేషం, ప్రతీకారవాంఛ కారెమపూడి రణరంగంలో కొంతకాలం పాటు సమాధి అయింది (మసిబారి పోయింది). కానీ పాలకులలోని సహనము ఔదార్యము పదునెనిమిది కులాల మధ్య సహకారానికి తోడ్పడింది; దేవాలయాలకు, సాంఘిక మత సంస్థలకు భూరి విరాళాలు లభించాయి.

'రాజ్యము బ్రాహ్మణమతాతీతము, కానీ రాజ్యపు మతపునాదులు వైదికమే'–ఇదే పల్నాటి యుద్ధానంతర మధ్యయుగ ఆంధ్రరాజకీయ రంగంలోని విరోధాభాసం!

**ఉపయుక్త రచనలు:** పల్నాటి వీరచరిత్ర (అక్కిరాజు ఉమాకాన్తం); పల్నాటి వీరభారతం (వీరభద్రకవి); క్రీడాభిరామం (వినుకొండ వల్లభామాత్యుడు); రెడ్డి కింగ్‌డమ్స్ (యం. సోమశేఖరశర్మ) మొదలయినవి. మి

## ప్రవేశం

"మునిమాణిక్యం నరసింహారావుగారు, మొక్కపాటి నరసింహశాస్త్రి గారు ఒక హొటల్‌లో కూర్చుని బాతాఖానీ మాట్లాడుతూ కాఫీ త్రాగుతున్నారు. కొంచెం దూరంలో కూర్చుని కాఫీ త్రాగుతున్న కొంతమంది విద్యార్థులు, ఏవో రచనలపై ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యానిస్తూ మధ్యలో బూతులు కూడా వాడుతున్నారు. ఆ మాటలు విన్న మునిమాణిక్యం వారు 'అడ్డమైన వెధవలందర్నీ హొటల్‌కి రానీయవద్దని ప్రొప్రయిటర్‌కి చెప్పాలండీ' అన్నారు. దీనికి మొక్కపాటి వారు 'ఆ పని మాత్రం చేయకండి. అతను అలా రానిస్తున్నాడు కాబట్టే మనమూ రాగలిగాం' అన్నారు నవ్వుతూ.



# సరిగమకాలు

- ఆకెళ్ళ మల్లికార్జున శర్మ

లలిత కళలన్నింటిలోనూ లలితమైనది సంగీతం. పరమహంస యోగానందులవారు వారి ఆత్మకథలో 'సంగీతం పూర్తిగా ఆధ్యాతికమైనది' అని చెప్పారు. భారతదేశంలో గల సకల శాస్త్రాలకూ పరమార్థం భగవత్ప్రాప్తి మాత్రమే. ఈ ఆధ్యాత్మికతను కాపాడుకోవడానికే శృంగారరస ప్రధాన రచనలైన క్షేత్రయ్య పదములు, జావళీలు, తిల్లానల వంటివి కూడా సర్వేశ్వరునిల ఉద్దేశించి వ్రాసిన భక్తి శృంగార రసరచనలైనాయి. ఆ విధంగా శాస్త్రీయ సంగీతమంతా భక్తి రసరచనలతో నిండి ఉంటుంది. కాని జనసామాన్యంలో శాస్త్రీయసంగీతంపట్ల ఆసక్తిని రేకెత్తించడానికీ, పెంపొందించడానికీ, పరిరక్షించడానికీ పూర్వంలాగా రాజులూ వారి సంస్థానాలూ లేకపోవడంవల్లా ఇప్పుడు ప్రజలే రాజులు కావడంవల్లా ప్రజలే యిందుకు పూనుకొనవలసి యున్నది.

అంటే శాస్త్రీయ సంగీతంపట్ల గౌరవము, ప్రేమ, అభిమానము, ఆసక్తి ఉన్నవారూ, ఈ పవిత్ర సంగీత సేవను కచేరీలను ఏర్పాటు చేయడం ద్వారానూ, ఆ కచేరీల ఏర్పాటులో ధన సహాయం, సేవా సహాయం ద్వారానూ సహకరించేవారూ, ఈ సంగీతాన్ని బోధించే ఆధ్యాపకులూ, కచేరీలు చేసే కళాకారులూ, ఈ కచేరీలను వినడానికి వచ్చే శ్రోతలూ మొదలైన వారంతా ఎవరి పరిధిలో వారు నిజాయితీతో పూనుకుంటే ఈ శాస్త్రీయ సంగీత పరిరక్షణ మహోన్నతంగా జరుగుతుందనడంలో ఏ మాత్రమూ సందేహం లేదు.

సినిమాలు లేని కాలంలో ఆధ్యాత్మికతే ప్రాతిపదికగా గల శాస్త్రీయ సంగీత రచనలే అందరినోళ్ళలోనూ నానుతూ పాడబడుతూండడంచేత ప్రజలకు శాస్త్రీయ సంగీతంపట్లా, ఆ రచనలపట్లా గౌరవము, ప్రేమ, అభిమానము, ఆసక్తి ఉండేవి. తరువాతి కాలంలో క్రమేణా అనాధ్యాత్మిక సినిమా రచనలూ ఇతర లౌకిక రచనలూ వాటి ఆకర్షణీయ సాంప్రదాయేతర సంగీతమూ సినిమా హాళ్ళలోనూ, కొంత వరకూ రేడియోద్వారానూ వినిపిస్తూండేవి. ఇక ఇటీవలి కాలంలో దూరదర్శన్ ప్రభావంవల్ల ప్రతి ఇల్లూ ఒక సినిమా హాలుగా మారిపోయి సినిమాకు సంబంధించిన సకల విషయాలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చే కార్యక్రమాలతో లౌకిక ఆకర్షణీయ సంగీతం వెలయాలులాగా ప్రజాబాహుళ్యానికి అతిగా అందుబాటులోకి వచ్చి సమాజాన్ని ఉద్రేక పరుస్తూ కలుషితం చేస్తోంది.


ఏ సౌకర్యాన్నయినా దుర్వినియోగం చేసుకోకుండా సద్వినియోగం చేసుకుంటే సమాజం బాగుపడుతుంది. అదే విధంగా మన సాంప్రదాయ సంగీత సాహిత్యాల పరిరక్షణకు క్రిందటి కాలంలో ఆకాశవాణి ఎక్కువగా తోడ్పడినా గాని ఇప్పటికాలంలో వ్యాపార దృష్టి ఎక్కువగా సోకి దూరదర్శన్‌తో బాటుగా ఆకాశవాణి కూడా సాంప్రదాయ సంగీత పరిరక్షణలో చెప్పుకోతగినంతగా నీరసించిపోయింది. నిజానికి సినిమా ఆకాశవాణి, దూరదర్శన్‌లు శక్తివంతములైన ప్రచార సాధనాలు. ఇవి వ్యాపార దృష్టికి ఎక్కువ తావీయకుండా మన సంస్కృతీ పరిరక్షణకే ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చే విధంగా విజ్ఞుల సలహాల సాయంతో ప్రణాళికలను రూపొందించి నిజాయితీతో అమలు పరచవలసిన అవసరం ఉన్నది.

అంతేగాక ఆకాశవాణిలో ఇదివరలో రద్దు చేయబడిన మ్యూజిక్ ప్రొడ్యూసర్ ఉద్యోగాలను పునరుద్ధరించి వాటిలో తగిన వారిని నియమించడంలోనూ కాళీ అయిన నిలయ విద్వాంసుల ఉద్యోగాలను రద్దు చేయకుండా వాటిలో తగిన

ఆకెళ్ళ మల్లికార్జున శర్మ, ఫోన్ : 9908822992

వారిని నియమించడంలోనూ వ్యాపార దృష్టికి గాక సంస్కృతీ పరిరక్షణకే ప్రాధాన్యం యిస్తే ఈ విద్యను నేర్చుకొనేవారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది.

మన రాష్ట్రంలో గల నవోదయ విద్యాలయాలలోనూ, కేంద్రీయ విద్యాలయాలలోనూ ఇతర సాధారణ విద్యాలయాలలోనూ పని చేయుచున్న సంగీతాధ్యాపకులు కొద్ది మందే ఉన్నాగాని వారు మొదటి నుంచీ దేశభక్తి గీతాలు, జానపద గీతాలు, కథాగీతాల వంటివాటినే విద్యార్థులకు బోధిస్తున్నారు గాని శాస్త్రీయ సంగీత అంశాలేవీ బోధించడమే లేదు. ఈ విద్యాలయాలలోని సంగీత విషయం ఐచ్ఛికమేగాని నిర్బంధం కాదుకూడా. దీనిలో పరీక్షలే ఉండవు. ఈ విషయాలన్నీ శాస్త్రీయ సంగీతాభివృద్ధికి దోహదపడేట్లుగా పేరెంట్స్, కమిటీవారూ, స్థానిక మేధావులూ, పెద్దలూ నిజాయితీగల రాజకీయ నాయకుల సాయంతో విద్యాశాఖవారి మీద ఒత్తిళ్ళు తెచ్చి తగిన ప్రణాళికలను రూపొందించి అమలు జరిగేట్లుగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నది.



డాక్టర్లూ, ఇంజనీర్లు వంటివారు వేల మీదే ఉంటారు గాని, నిష్ణాతులైన సంగీత విద్వాంసులు వ్రేళ్ళమీద లెక్కపెట్టగలిగిన వారే ఉండి సరియైన సంగీతాధ్యాపకులు ఇంకా తక్కువ మందే లభ్యమవుతారు. ఇతర చదువులన్నీ చాలా వరకూ వయస్సుతో నిమిత్తం లేకుండా చదువుకొనే సావకాశం ఉన్నాగాని, సంగీత విద్యను మాత్రం చిన్న తనం నుండే నేర్చుకొని విపరీత సాధన చేయాలి. అందులకుగాను సంగీతాసక్తిగల పిల్లలను పరీక్షింపచేయించి, వారిలో సంగీతం బాగా అబ్బే పిల్లలకు తప్పక సంగీతం నేర్పించి అమితంగా ప్రోత్సహించాలి. సంగీతాసక్తిగల పిల్లలను పరీక్షించేటపుడు మొదటగా లయజ్ఞాన పరీక్షచేసి, ఆ లయజ్ఞానం సక్రమంగా గలవారికి మాత్రమే శ్రుతి జ్ఞాన పరీక్ష కూడా చేసి, ఆ రెండూ సక్రమంగా గల వారికి మాత్రమే సంగీత బోధన ప్రారంభించి మొట్ట మొదటగా లయ అభ్యాసముల సాధన తదుపరి శ్రుతి అభ్యాసముల సాధన చేయించాలి.

లయ జ్ఞానం సక్రమంగా లేనివారికి సంగీతాభ్యాసములు బోధించడం నిరుపయోగం అని గ్రహించడం చాలా అవసరం. అదే విధంగా సంగీతాధ్యాపకులు వారికి వచ్చిన సంగీతాన్ని విద్యార్థులకు బోధించడంలో, వారికి సంగీతం త్వరగా సక్రమంగా వచ్చేట్లుగా సులభ పద్ధతులతో బోధించడం అవసరం. సాధారణంగా సంగీతాధ్యాపకులు గీతాలు, వర్ణాలూ, కీర్తనలూ ఎక్కువగా నేర్పుతుంటారు. ఆ కీర్తనలనైనా మంచి పట్టుత్వము గల స్వరలిపితో వ్రాసి ఇచ్చి విద్యార్థులలో సంగీత విజ్ఞానాన్ని వృద్ధిచేసి వివరంగా స్వరలిపిని వ్రాసే పద్ధతిని బోధించి రాగాలాపన, స్వరకల్పనలవంటి మనోధర్మ సంగీత విషయాలకు మంచి పునాదిని కల్పించేవారే గురువు. అటువంటి విజ్ఞానాభివృద్ధికి కాకుండా అనుకరించి పాడడం మాత్రమే నేర్పేవారంతా బరువులే.

సంగీత విద్యాలయాలలోని బోధన, సాధన, పరీక్షలు మొదలైనవన్నీ ఒక ప్రణాళికాబద్ధంగా, ఒక లక్ష్య సాధనతో జరిగి, చివరన ఒక పరీక్షలో ఉత్తీర్ణులైనట్లుగా ధ్రువపత్రం కూడా లభించి అవసరమైనవారికి ఉద్యోగాన్వేషణలోగాని, తన సంగీత విద్యా స్థాయిని ఎదుటి వారికి ఎరుక చేయడంలో గాని తోడ్పడుతుంది. కాని కొంతమంది స్వతంత్ర సంగీతాధ్యాపకులు ఎటువంటి పాఠ్య ప్రణాళికనూ అనుసరించకుండా, వారికి తోచిన విధంగా విద్యను నేర్పడం వలన చివరకు ధ్రువపత్రాలేవీ లేక అలాసంగీతం నేర్చుకొనిన వారు చాలా ఇబ్బందులను ఎదుర్కోవడం జరుగుతుంది.

విద్యార్థులకు లక్ష్యసాధనను కల్పించడంలో పరీక్షలు, పోటీలు చాలా సహకరించి వారి అభివృద్ధికి దోహదం చేస్తాయి. ఈ సంగీత పోటీలలో రెండు రకాలున్నాయి.

**1. సంగీత విజ్ఞాన పోటీలు :** వీటిలో అలంకారాలుగాని, వర్ణాలు గాని చతురశ్రగతిలో 3 లేక 4 కాలాలూ, త్రిస్రగతిలో 2 కాలాలూ విడివిడిగా పాడడం, కలిపి పాడడం. వర్ణాలలోని పూర్వాంగ, ఉత్తరాంగాలు అన్ని గతులలోనూ 2 కాలాలు చొప్పున విడివిడిగా పాడడం, ముక్తాయి లెక్కలతో విషయ జాగాలకు కూడా సమర్థవంతంగా స్వర కల్పన పాడడం, రెండు చేతులతో వేరు వేరు తాళాలు వేస్తూ కీర్తనలు, పల్లవులు స్వరకల్పనతో పాడడం, 2 కళలూ 4 కళలలో గల పల్లవులు 3 కాలాలు చతురశ్ర గతిలోనూ 2 కాలాలు త్రిస్రగతి లోనూ

పాడడం క్లిష్టమైన గతి భేదపల్లవులను 3 కాలాలలోపాడడం వంటి సంగీత విజ్ఞానాన్ని పెంచే అంశాలుంటాయి.

**2 సంగీత పోటీలు :** వీటిలో సంగీత రచనలు, రాగాలాపన, నెరవు, స్వరకల్పనలు పాడడంలో ఉన్న వాళ్ళల్లో బాగా పాడిన వారికి బహుమతులిచ్చేస్తూంటారు. వీటిలో మొదటి రకమైన సంగీత విజ్ఞాన పోటీలను సక్రమంగా నిర్వహించి విద్యార్థులకు మంచి జ్ఞానం అందీయడంలో బాగా కృషి జరగాల్సి ఉంది.



ఇక గానసభల విషయానికి వస్తే తమిళదేశంలో అన్ని స్థాయిల సంగీత విద్వాంసులకూ ఎవరి స్థాయికి తగిన కచేరీలు వారికి లభించి ప్రోత్సాహం లభిస్తుండగా మన తెలుగుదేశంలో మహోన్నత స్థాయికి చెందిన వారికే ఎక్కువ అవకాశాలు లభిస్తాయి. ఉన్నత స్థాయికి చెందినవారికంటే తక్కువ అవకాశాలు లభించి, దిగువ స్థాయికి చెందిన వారికి అరుదుగా అవకాశాలు లభిస్తాయి. ఒక విద్వాంసుడు ఏదైనా కారణం చేత అంత బాగా పాడకపోతే మళ్లీ పుష్కరం దాకా అతడికి అవకాశం లభించే సూచనలుండవు. ఇపుడిప్పుడే కొన్ని చోట్ల దిగువస్థాయి వారికి కూడా అవకాశాలిచ్చే కృషి జరగడం ఆశావహంగా ఉంది. అన్ని స్థాయిల వారికి ఎక్కువ అవకాశాలు లభిస్తేనేకదా వాతావరణం అందరికీ ప్రోత్సాహకరంగా ఉండేది. దానికి తగిన కృషి జరగాల్సి ఉంది.

గాన సభలలోనూ, విద్యా లయాలలోనూ సంగీత కచేరీలే కాకుండా అనుభవజ్ఞులైన విద్వాంసులచేత సంగీత విద్యా విషయాల మీద ప్రదర్శ నోపన్యాసాలు కూడా ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలలో సంగీతం పట్ల కొంత అవగాహన పెంపొందించే అవకాశమున్నది. అంతే గాక అపుడపుడు గాన సభలలోనూ, విద్యాలయాలలోనే గాక దేవాలయాలలో కూడా ఆకర్షణీయమైన గాత్ర సౌలభ్యంగల అనుభవజ్ఞులైన విద్వాంసుల చేత వాగ్గేయ కారుల రచనలు, వారి జీవితంలోని ముఖ్య ఘట్టాల గురించి ప్రదర్శనోపన్యాసాలిప్పించడం అవసరం.

ఈ విధంగా శాస్త్రీయ సంగీతాభిమానులూ, విజ్ఞులూ కలిసి సక్రమమైన ప్రణాళికాబద్ధంగా నిజాయితీతో కృషి చేసి మన ఆధ్యాత్మికోన్నతికి బాగా సహకరించే శాస్త్రీయ సంగీతమును పరిరక్షించుకోవలసిన అవసరం చాలా ఉన్నది.

## తిరుపతి

ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం తిరుపతి (చిత్తూరు) తెలిసిందే. మొత్తం 108 దివ్య తిరుపతులున్నాయి. తిరుపతిలోని 'తిరు' అనే పదం 'శ్రీ' నుండి ఉత్పన్నమైందని భావన. అలాగే 'పతి' అంటే వల్లభుడు, దైవం. ఇక్కడ అంటే తిరుపతిలో శ్రీ వేంకటేశ్వరుడు వున్నాడు గనుక, 'శ్రీ' అంటే లక్ష్మీ గనుక, ఆయన నెలకొన్న క్షేత్రం తిరుపతి అయిందని భావిస్తారు. కాని అది సరికాదు. తిరుపతి నిజమైన పేరు తిరుపత్తి. తిరు శ్రీ శబ్ద భవం కాదు. స్త్రీ శబ్ద భవం. అందులోని 'స' కారం లోపించి మిగిలినది వికృతి పొంది 'తిరి'గా రూపొందింది. తిరుగా పరిణమించింది. తమిళంలో స్త్రీ లింగాన్ని తిరిలింగం అంటారు. ఇక్కడ స్త్రీ అంటే ఆద్య ప్రకృతి. ఆ మూల ప్రకృతినే లక్ష్మిగా, పార్వతిగా, సరస్వతిగా మూడు రూపాల్లో సంభావించటం జరిగింది. ఆద్య ప్రకృతి అంటే ముగురమ్మల మూలపుటమ్మ. పత్తి, పత్తు నుండి వచ్చిన రూపం అంటే వేద పఠనం జరిగే చోటు అని అర్థం. ఇక్కడ దైవారాధన. అలా తిరుపతి సిద్ధం అయింది.

శ్రీశైలానికి కూడా తిరుపతి అనే పేరుంది. కనుక తిరుపతి అంటే కేవలం వైష్ణవ క్షేత్రమే కానక్కర లేదు. శైవక్షేత్రం లేదా ఏదైనా క్షేత్రమైనా కావచ్చును. తిరుపతిలో ఎగువన వున్న దానిని తిరుమల అని, దిగువన వున్నదానిని దిగువ తిరుపతి అనటం తెలిసిందే. దిగువ తిరుపతి గోవిందరాజ పట్టణమని శాసనాల్లో చెప్పబడింది.

**- యార్లగడ్డ బాలగంగాధర రావు**



# పాపికొండల వెన్నెల

ముందు పెద్ద కొండ; అందు మీదట చిన్న
మలల మలుపులందు మసలుచుండు
నీటి వాలులందు నెఱిపల్లెల పసందు
పాపికొండలెల్ల పఱచి యుండు.

నలుపు దిగజాఱి, పాపికొండలకు నడుమ
రేయి మేనికి నవకంపు హాయి యబ్బె
బీఱ పాదున పూవులు విచ్చినట్లు
పచ్చటడవిని వెన్నెల పలక బాఱె.

నింగిని మోచు కొండలకు
    నీడ నొసంగును మ్రాని గుంపు; సా
రంగపు చాలు నింపు మధు
    రంబగు నాదము గుండె లోతులన్
ఱింగున దూకొనున్ కలవ
    రింతల వింతగు గౌతమీ నదిన్
పొంగులువారు కార్తికిక
    పూర్ణిమనాటి విభావరీ రుచుల్.

ఇటునటు నిలచిన కొండల
పటుతర గంభీర భావ పటిమకు నెలవై
రటియించు గౌతమీ నది
నటియించును జాజి విరుల నవ చంద్రికలన్.

నల్లని గౌతమి నీళుల
మెల్లగ కనుపించు పులుల, మెకముల జాడల్
ఝల్లన గుండెలు; వెన్నెల
వెల్లువ తరగెత్తి నటుల వేడబ మమరున్.

కలత లేని నీట కదలెడు పడవకు
కనుల నిదుర గ్రమ్ము క్షణము పాటు;
కునుకు తీయగోరి కొండదరిని జేర
రిక్క వెలుగు చెంగు ప్రక్క పఱచు

చెలగి గోదావరీ నది చేసినట్టి
కొండ చఱియల కోతల క్రొత్త గాయ
ములకు కట్టిన కట్టుల పోలుపు దోచు
తొదరి ప్రసరించు వెన్నెల పొడలు మదికి

చిరు వెచ్చని చలి గాలికి
మరుబాణతతికి కలసిన మైత్రి యదేమో!
మరులుగొనిన గోదావరి
పరుగు లిడును సాగరంపు ప్రణయము కొఱకై.

ఋతువు కొక్కతీరు చతురత నెరపుచు
పాపికొండ చఱియలోపు గొనుచు
ఎన్ని చందమామ లింతవరకు జూచె
ఇట్టి ముద్దరాలి కెవరు సాటి?

*(పోలవరం ప్రాజెక్టు వలన, గోదావరి సహజ సౌందర్యం, పాపికొండల కమనీయ దృశ్యాలు  కనుమరుగవుతాయనే స్పృహ కలిగి)*

**- ఇంద్రగంటి శ్రీకాంతశర్మ**
ఫోన్ : 9848078079

# సంక్రాంతి లక్ష్మి
# శీలా వీర్రాజు



**ప**ల్లె రంగుల్లో - మట్టి వాసనలతో మనలను ఆహ్వానిస్తూ అలరిస్తాయి - శీలా వీర్రాజు చిత్రాలు. మన జీవనానికి - మన మాటలకు దగ్గరగా వుంటూ - మనం మరచి పోతున్న జ్ఞాపకాలను నిద్ర లేపుతాయి.

బహుముఖ ప్రజ్ఞాశాలి, శీలా వీర్రాజు 22 ఏప్రిల్ 1939వ సంవత్సరంలో రాజమండ్రిలో జన్మించారు. అక్కడే బి.ఏ. వరకూ ప్రభుత్వ కళాశాలలో విద్యాభ్యాసం చేశారు. చిన్నతనం నుంచీ ఆయనకు కవితలన్నా, కథలన్నా, చిత్రాలు వేయటమన్నా ఎంతో ఇష్టంగా ఉండేది. రాజమండ్రి రసమయ జగత్తుకు ఆలవాలం. పంతొమ్మిది వందల ఇరవై దశాబ్దంనాటికి ఆంధ్ర ప్రాంతంలో, మద్రాసు తరువాత లలిత కళల కళాశాల ఒక్క రాజమండ్రిలోనే ఉండేది. దానికి మొదటి ప్రిన్సిపాల్‌గా వచ్చిన కూల్డ్రే గొప్ప చిత్రకారుడు. ఐరోపాలో పరిఢవిల్లిన వాస్తవ చిత్రకళా శైలిలోనే ఆయన చిత్రాలు వేసేవారు. అయినప్పటికీ విద్యార్థులను తమ దృశ్యాలను వేయమంటూ, స్వతంత్ర ధోరణులను ప్రోత్సహించేవారు. ప్రసిద్ధులైన దామెర్ల రామారావు, వరద వెంకటరత్నం, భగీరథ లాంటి వజ్రాలు అక్కడే సానబెట్టబడ్డాయి. అఖండ ప్రతిభావంతుడయి, అల్పాయుషుతో నిష్క్రమించిన దామెర్ల రామారావు పేరుతో 1930 నాటికే ఒక చిత్ర శిల్ప కళాశాలను రాజమండ్రిలో ఏర్పాటు చేశారు (మరిన్ని వివరాల కోసం 'మిసిమి' సెప్టెంబరు 2010 సంచికను చూడగలరు).



రాజమండ్రిలో పుట్టి పెరిగిన శీలా వీర్రాజు తన తొలి యౌవన దశలో తనలోని నిబిడీకృతమైన, అందమైన ఆలోచనలకు ఒక ప్రక్క అక్షర రూపం ఇస్తూ కవితలు, కథలు వ్రాయటం ప్రారంభించారు. తన అందమైన ఊహలను, ఆలోచనలనుంచి బయటకు తీసి, కాన్వాస్‌పై చిత్రాలుగా వేయాలనే కోరికతో రాజమండ్రిలో రామారావు స్కూలులో, అప్పుడు ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న వరద వెంకటరత్నం వద్ద చిత్రకళను అభ్యసించి, దానిపై మంచి పట్టు సాధించారు.


ఆడంబరాలకు ఆమడ దూరంలో ఉండే వీర్రాజు తన చిత్రకళకు భూమికగా గ్రామీణ జీవితాన్ని ఎంచుకున్నాడు. నిరాడంబరగా కనిపించే ఆ జీవన శైలిలోనున్న నిజమైన మానవ అనుబంధాలకు ఆనవాళ్లుగానున్న పండుగలు, పబ్బాలు, గ్రామీణుల

ముచ్చట్లను ఏంతో హృద్యంగా చిత్రించారు. అందుచేతనే ఆయన చిత్రాలలో మట్టిరంగు, కొట్టొచ్చినట్లు జీవంతో కనిపిస్తుంది. ఈ చిత్రాలు ఒకప్పుడు అజేయంగా నడచిన గతకాలపు స్మృతులను గుర్తుకు తెస్తాయి. వీరి చిత్రాలు చూసిన ఆనాటి తరం వారు, మరగవుతున్న తమ జ్ఞాపకాలతో, ఆనందాను భూతిలో గాఢమైన నిటూర్పులను విడవటం నాకు తెలుసు.

1953వ సంవత్సరంలో (అప్పుడు వీర్రాజుకు 14 సం॥ల వయస్సు) రాజమండ్రిలో జరిగిన తూర్పు గోదావరి జిల్లా విద్యార్థి ఫెడరేషన్ మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన చిత్రకళా పోటీల్లో ప్రథమ బహుమతి ('ప్రయాణం' చిత్రానికి) అందుకున్నారు.

మరో మూడు సంవత్సరాల తరువాత ఇంటర్‌మీడియెట్ చదువుతున్న రోజుల్లో తొలి ఆంధ్రరాష్ట్ర ఆస్థానకవి శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారి చేత సన్మానం పొందారు.

1959లో మైసూరులో జరిగిన దక్షిణ భారత అంతర్ విశ్వ విద్యాలయాల యువజనోత్సవాలలో చిత్రకళా ప్రదర్శనలో వారి 'మధుర స్మృతులు' చిత్రం ఉత్తమ చిత్రంగా ఎంపిక చేయబడింది.



**అన్నపూర్ణగా వచ్చిన పార్వతి (లేపాక్షి శిల్పం)**
కాశీలో భిక్షాటన మూర్తిగా నున్న శివునకు భిక్షవేయు తొందరలో వలువలు జారుతున్నా గమనించని అన్నపూర్ణ, పార్వతి.

చిత్రకళా విద్యాభ్యాసం పూర్తయిన తరువాత హైదరాబాదు వచ్చి కృష్ణాపత్రికలో మూడు సంవత్సరాల పాటు చిత్రకారునిగా పనిచేశారు. ఆ తరువాత ఆంధ్రప్రభలో ఆయన వేసిన 'బౌద్ధ జాతక కథలు' చిత్ర రూపంలో ధారావాహికంగా వచ్చాయి. కొంతకాలం ప్రభుత్వ జనసంబంధ శాఖలో అనువాదకునిగా పనిచేసి, 1990 జనవరిలో ఐచ్ఛికంగా ఉద్యోగ విరమణ చేసి, చిత్రకళా రంగానికి మరింతగా అంకితమై కళాజీవితాన్ని కొనసాగిస్తున్నారు.

1970 లేపాక్షి స్కెచ్‌లను 'శిల్పరేఖ' పేరుతో ఒక పుస్తకాన్ని వెలువరించారు. లేపాక్షి శిల్పాలు మోల్టెన్ రాక్ శిలలపై చెక్కినవి కావటంతో వాటిని మనం చూసినపుడు అందులోని సూక్ష్మ వివరాలపై దృష్టిని నిలుపలేము. శిల్పము యొక్క స్థూలరూపాన్ని మాత్రమే మనం గమనించ గలుగుతాము. ఇవి ఛాయా చిత్రాలుగా వచ్చినా, దానిలో కూడా ఇవి స్పష్టంగా కనిపించవు. సూక్ష్మంగా కనిపించే ఈ విశేషణాలను శిల్పాకృతిలోని నైపుణ్య సోయగాలను ఆయన ఎంతో గొప్పగా తన రేఖలలో చూపగలిగారు.

జూన్ నెల 1960 సంవత్సరంలో రాజమండ్రిలో జరిగిన శీలా వీర్రాజు చిత్ర కళాప్రదర్శనానికి శ్రీ యన్.టి రామారావు ప్రారంభోత్సవం చేశారు. అతిచిన్న వయసులో గణనీయమైన కృషి చేసిన వీర్రాజును శ్రీ రామారావు అభినందించారు.

1968లో ఆయన రచించిన 'కొడిగట్టిన సూర్యుడు' ప్రచురితమయింది. కథను కవిత్వంలో మిళితం చేసి చెప్పిన కథాగేయం. ఇది తెలుగు సాహిత్యంలో చేయబడ్డ ఒక కొత్త ప్రయోగం. ఈ పుస్తకంతో బాటుగా ఇందులోని భావ సంఘటనల ఆధారంగా 25కు పైగా నీటి రంగుల చిత్రాలను రచించి ప్రదర్శించారు. ఇది ఉత్తమ కవితా కథగా 'బాలగంగాధర్ తిలక్' అవార్డును అందుకుంది.


ఆయన రచనలు జాతీయస్థాయిలో గుర్తింపు పొందాయి. కన్నడ, హిందీ భాషలో అనువాదం చేయబడ్డాయి. ఈతని సాహిత్య కృషికి ఒక భారతీయ సాహిత్య అకాడమీ బహుమతి కూడా లభించింది.

'కొడిగట్టిన సూర్యుడు' అనే తన ఫ్రీ వర్స్ కథకు నీటి రంగుల్లో వేసిన పాతికపైగా పెయింటింగులతో 1968లోనూ, లేపాక్షి శిల్పాల స్కెచ్‌లతో 1970లోనూ హైదరాబాదులో 'ఒన్ మాన్ షోలు జరిపారు. లేపాక్షి స్కెచ్‌ల ప్రదర్శన ఆ ఏడాదే బెంగుళూరులోనూ, ఆ తర్వాత పశ్చిమ జర్మనీ గోటింజెన్ నగరంలోనూ ఏర్పాటు చేశారు. అక్కడి పత్రికలు ఈ చిత్రాలను మెచ్చుకుంటూ "స్వర్గంలోనూ, భూమిమీదా

దేవతలూ, మానవులూ చేసిన నృత్యాలు యీ చిత్రాలలో కనిపిస్తాయి. వీటి ప్రతి భంగిమలోనూ ఒక అర్థం ఉంది. శిల్పాలు ఎక్కువగా ఆభరణాలు ధరించి, నగ్న రూపాల్లో వున్నాయి. శీలా వీర్రాజు తన ఫ్రీహేండ్ చిత్రాలద్వారా భారతీయ సంస్కృతికీ, చిత్రకళా రంగానికీ విశేషమైన సేవ చేశారు. ఈయన నాలుగు నవలలు, రెండు కవితా గ్రంథాలు, అనేక కథలు రాశారు" అని వ్రాశాయి.

"నే నీవేళ ఒక చిత్రాన్ని చూశాను. అది చూసిన తరువాత ఒక కథ వ్రాయాలనిపించిం"దంటాడు సంజీవదేవ్ ఒకచోట.

శీలా వీర్రాజు చిత్రాలలో కొన్ని మనకటువంటి భావాలను కలిగిస్తాయి. "నిరీక్షణలతోనే...." అనే అసంపూర్ణ మకుటంతో ఉన్న తైలవర్ణ చిత్రంలో, నిరాశకు సింబాలిక్‌గా పరిగణించబడుతున్న సుళ్లు తిరుగుతున్న నీలపురంగు నేపథ్యంలో, ఆశ, నిరాశలమధ్య ఓలలాడుతున్న ఒక కుటుంబ సభ్యుల సంధిగ్ధావస్తను చూస్తున్నపుడు మనం ఒక భావావేశానికి లోనవుతాము. అప్రయత్నంగానే ఒక కథను మన మస్తిష్కంలో అల్లుకుంటాము. ఒక బొమ్మలో ఒక బడుగు వ్యక్తి నేలపై మోకాళ్ళను, ముంజేతులను ఆనించి, బహుశ ఒక భూస్వామి ముందు మోకరిల్లడం మొదలుకొని, క్రమేపి తన హక్కులను గుర్తించి, ప్రశ్నిస్తూ, గుప్పెట బిగించి, ఆత్మస్థైర్యంతో నిలబడటం ఒక క్రమగతిలో మనం స్పష్టంగా చూస్తాము. అలానే "వేట పడవలు ఇంకా రాలేదు", "బస్సుకోసం నిరీక్షణ" అన్న చిత్రాలు. ఇవన్నీ హృదయం విప్పి మనసుతో మాట్లాడతాయి. కథలు చెబుతాయి. వాటి గురించి కథలు వ్రాయమంటాయి.



**భృంగి శిల్పం (లేపాక్షి)**

దేవేంద్రుని ఇంద్రసభలో నిత్య నృత్యకారుడు భృంగి. నృత్యము చేయునపుడు అలసట చెందకుండా ఉండటం కోసం మూడవ కాలును వరముగా పొందాడు. ఇక్కడ వున్న శిల్పంలో భృంగి తన మూడు కాళ్లతో నృత్యం చేయటం చూడవచ్చు.

వీర్రాజు 'మైనా' అనే పేరుతో ఒక గొప్ప నవలను వ్రాసి, ఒకనాటి ఆంధ్రుల 'రంగూను' జీవితపు రంగుల కల చివరకు పీడకలగా ఎలా విషమించిందో చారిత్రక సత్యాలతో మన ముందుంచాడు.

'మాతృస్తన్యం గ్రోలిన వాడెవడూ, మాతృ భూమిని, మట్టి పరిమళాలను మరువలేడు' అన్న నానుడికి నిదర్శనాలుగా గోదావరీ పరీవాహక జీవితపు సొగసైన నడకలు, క్రమేపి కనుమరుగవుతున్న చిన్న చిన్న జీవితానందాలు మనకు 'హరిదాసు', 'ఒప్పులకుప్ప', 'చెమ్మచెక్క', 'కేశాలంకరణ' లాంటి అనేక చిత్రాలలో కనిపిస్తుంది. వీటికి భిన్నంగా జానపద శైలిలో, ఆధునిక శైలిలో వేసిన చిత్రాలు వేటికవే, ఒకదానికి మరొకటికి తీసి పోనట్లుగా చిత్రీకరణ జరిగింది.

మనది ఉష్ణదేశం. భూమధ్యరేఖ, కర్కాటక రేఖ మధ్యన మనదేశం ఉండటంతో సూర్యుని వెలుగు ఎక్కువ ప్రకాశవంతంగా ఉంటుంది. మనం అనేకానేక రంగులను స్పష్టంగా చూడగలుగుతాము.

అందుచేతనే గాఢమైన ప్రాథమిక రంగులయిన ఎరుపు, నీలం, ఆకుపచ్చ (ఒకప్పుడు పసుపు) మన సంప్రదాయంలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. ఆ ఒరవడిలోనే వీర్రాజు వేసే చిత్రాలలో చక్కటి, చిక్కటి రంగులు ఎక్కువ సాంద్రతతో కనిపిస్తూ మన సంప్రదాయ సంస్కృతికి నీరాజనం పడుతూ తమ సహజత్వాన్ని, భారతీయతను చాటుకుంటున్నాయి.

'సంక్రాంతి లక్ష్మి'ని ముఖచిత్రంగా 'మిసిమి' పాఠకులకోసం ప్రత్యేకంగా శీలా వీర్రాజు చిత్రించారు.

కాన్వాస్ మీద తైలవర్ణం (31.5 × 46.5 సెం.మీ.)

**- కాండ్రేగుల నాగేశ్వరరావు**

# ఆధునిక కవిత్వ పరిణామం

*- పోతుగుంట్ల విజయకుమార్*

ఒక నిర్దిష్టమైన ఆలోచనా విధానం, సామాజిక చైతన్య దృక్పథం కలిగిన రచయిత ఒక వ్యవస్థ లాంటి వాడు. అటువంటి రచయితల ఆలోచనా సరళిని పాలుపంచుకొనే పాఠకులనేకులున్నారు. సమాజంలో క్రియాత్మకత, ప్రతి క్రియాత్మకత, వ్యక్తులను సాహితీ సృజన శక్తులుగా రూపొందిస్తుంది.

వినూత్నమైన ఆలోచనా పంథా, సంస్కరణల చైతన్యం, పరిణామస్థితి, వ్యక్తి నుండి ప్రారంభమై శక్తిగా పరిణమించి మానవజాతి పరంగా విస్తృతమవుతుంది. ఒక వ్యక్తి ప్రతిభాపూర్వక ఆలోచనల ప్రభావం సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలన్నింటా ప్రసరించి, సత్ఫలితాలనందించి వ్యవస్థాగతమైన పరిణామాన్ని సాధిస్తుంది.

సమాజపరంగా ఒక విశాల ప్రభావాన్ని తేగలిగిన శక్తులలో రచయితలు ప్రముఖ స్థానంలో ఉంటారు. సామాజిక పరిణామంలో సత్ఫలితాలను సత్వరంగా అందుకునేందుకు సామాజికుల కర్మణ్యత్వం అవసరం. వ్యక్తులు సామాజిక బాధ్యతలను నిర్వర్తించడం అవసరమే. ఈ అవసరాలను సంఘటింపచేయడానికి సముచిత చైతన్యం ప్రధానం. రచయిత తాను తన ఆలోచనలను హేతుబద్ధతతో వివేచించి మార్పును ఆకాంక్షించాలి. సామాజిక హృదయాన్ని ప్రేరేపించగలిగేది మౌలికంగా రచయిత సృజనాత్మకశక్తి. సమాజంలో ఉత్తమాశయాలను సాధించాలంటే సృజనాత్మక రచన, సుహృత్సమ్మితంగా తన హృదయాన్ని ఆవిష్కరించుకోవాలి. జాతిని నైరాశ్య తిమిరాలనుండి కాపాడి, క్రియాశీలత పట్ల ఉత్తేజాన్ని కలిగించాలంటే సృజనాత్మక రచన శ్రోతహృదయంలో స్థిరనివాసమేర్పరుచుకోగలగాలి. ఈ మన్నిక కళాత్మకత వల్లనే సిద్ధిస్తుంది. అపుడే సాహిత్యం సమాజ పరివర్తనానికి దోహదకారి కాగలుగుతుంది.

సాహిత్యం ప్రధానంగా సృజనాత్మక కళాస్వరూపమే కనుక సాహిత్యం ద్వారా జరిగే ప్రబోధం ఉత్తమోపదేశంగానే వుంటుంది. తద్వారా సమాజం నిరంతరం మానసికంగా తన్ను తాను పునర్నిర్మించుకుంటుంది. 20వ శతాబ్దికి ఆయత్తమవుతున్న సమాజాన్ని క్రాంతదర్శి గురజాడ అప్పారావు దర్శించాడు. అదే సమాజం గడిచిన 90 సంవత్సరాలలో ఎన్నో పరిణామాలందుకుంది. ఆధునిక సాహితీ జనకుడైన గురజాడ నవ మానవీయ మహోద్యమాన్ని ప్రారంభించాడు. దానికోసమై ఆయన ఆధునిక సాహితీ స్వరూపాన్ని దర్శించాడు. ఆయన అందించిన వెలుగుజాడ గత తొమ్మిది దశాబ్దాలలో ఎన్నో విజయాలు సాధించింది. ఇంకా మనం సాధించవలసిన విజయాల గురించి త్రికరణ శుద్ధిగా అంచనా వేసుకోవాలి. ఆధునిక రచయితలంతా బాధ్యతతో వ్యవహరించి వక్రమార్గాలన్నింటినీ చిన్నాభిన్నం చేయాలి. ఆగామి తరాలకు ఉత్తమ మార్గ నిర్దేశకులం కావాలి.

విశాల లోకపు పీడనా రాహిత్యానికి మనమంతా స్థిరమైన బాధ్యత స్వీకరించక తప్పదు. జనచైతన్యాన్ని ఆయత్తం చేయలేని రచయిత ప్రస్తుత కాలంలో రచయిత కానేకాడు. ఈ సత్యాన్ని జ్ఞాపకం చేసుకొని పురోగమించక తప్పదు.

మానవజాతి మనముందే అపూర్వ విజయాలెన్నో సాధిస్తోంది. శాస్త్రీయంగా, సాంకేతికంగా మునుపెన్నడూ ఎరుగని నూతన లోకాలను స్వాధీన పరచుకొంటోంది. మన శతాబ్దం వినూత్న సత్యాలనెన్నో సాధించింది. చీకటి కోనలలో సైతం మానవుడు గాఢ నిద్రనుంచి మేలుకొని, జూలు దులిపి గర్జిస్తున్నాడు. లోకమంతా యథాతథంగా తమ స్వాధీన హక్కు భుక్తంలో సాగాలనుకొనే సామ్రాజ్య వాద నీతికి కాలం చెల్లింది.

ప్రపంచ మానవ చరిత్ర ప్రతి రచయిత ముందుకు వచ్చి, నిలిచి భవిష్యత్తుకు ఏది దారి అని ప్రశ్నిస్తోంది.

డా. పోతుగుంట్ల విజయకుమార్, ఫోన్ : 9849302546

సావధాన చిత్తంతో మనమంతా ముందు దారి వెతుకక తప్పదు, పురోగమించకనూ తప్పదు. మనం కదలకపోయినా లోకం తనదారిన తను ముందుకు సాగిపోతుంది.

**సంస్కరణ కవిత్వం:** ఉద్యమం సమాజ పరిణామ కాలాన్ని ఆశించి రూపొందుతుంది. సమాజం పరిణామ శీలం కలది. సాంఘిక, రాజకీయ, మతోద్యమాలు ఆవిర్భవించడం మనకి తెలిసిందే. పాల్కురికి సోమన వీరశైవోద్యమం, తిక్కన సమన్వయోద్యమం, అన్నమయ్య జానపదోద్యమం మొదలైనవి ప్రాచీన కవిత్వంలో కనిపిస్తాయి. అయితే ఆధునిక కవిత్వంలోని ఉద్యమాలు వాటి కంటే తీవ్రమైనవి, వ్యాప్తి కల్గినవి. మధ్యయుగపునాటి భక్తి ఉద్యమ కవిత్వం, వేమన వంటి శతక కవుల సామాజిక సంస్కరణ భావజాలం తెలుగు కవిత్వానికి సంఘసంస్కరణ పూర్వరంగాన్ని ఏర్పరచి ఉన్నాయి. ఇరవయ్యో శతాబ్దారంభం నాటికి కందుకూరి వీరేశలింగం భాషా సంస్కరణోద్యమం, గురజాడ అప్పారావు సాహిత్య సంస్కరణోద్యమాలు తెలుగు సాహిత్యంలో వినూత్న కవాటాలు తెరిచాయి. సంఘసంస్కరణ కవిత్వ భూమిక తదనంతర కవిత్వ రూపాలలో అంటే హేతువాద, జాతీయోద్యమ, భావ, అభ్యుదయ, దిగంబర, విప్లవ, స్త్రీవాద, దళిత, ముస్లిం, బి.సి. వాద ప్రాంతీయ కవిత్వాలలో కూడా కనిపిస్తుంది. వర్ణ వ్యవస్థా నిరసనం, సంఘ వ్యవస్థా నిరసనం, దురాచార నిరసనం, గాంధేయ దృక్పథం మొదలైన ప్రధానాంశాలను ధ్యేయంగా పెట్టుకొని సంఘసంస్కరణ కవిత్వం, సమాజ పరిణామ క్రమానికి దోహదం చేసింది.

**హేతువాద కవిత్వం :** మానవుడు వివేచన, ఆలోచనలకు కేంద్రబిందువు. నియమబద్ధమైన ప్రశ్నలనుండి ఆవిర్భవించడం చేత పుట్టుకతోనే మానవుడు హేతువాది. సహజంగా ఏదైనా ఒక అంశాన్ని గూర్చి సందేహించడం, ప్రశ్నించడం, పరిశోధించడం, పరిశీలించడం, నిర్ణయించడం అనేది హేతువాద లక్షణాలుగా పేర్కొనడం జరుగుతుంది. ఆధునిక తెలుగు సాహిత్యంలో మొట్ట మొదటి హేతువాద భావాలు 19వ శతాబ్ది పూర్వార్థానికి చెందిన సామినేని ముద్దు నరసింహం నాయుడి 'హిత సూచని'లో దర్శనమిస్తాయి. ఆ నాటికే సామినేని మంత్ర తంత్రాలలో మహత్తులు లేవని, వర్ణ వ్యవస్థలో న్యాయం లేదని, బాల్య వివాహాలు కూడవని, స్త్రీ స్వాతంత్ర్యం కావాలని, భూత, ప్రేత, పిశాచాలు లేవని పేర్కొనడం జరిగింది. మనిషి భౌతిక జీవితం పట్ల విశ్వాసం, దాని అభివృద్ధి పట్ల శ్రద్ధ కందుకూరి, గురజాడ రచనలలోని తాత్త్విక సారాంశం.

ఆధునిక సాహిత్యంలో హేతువాదాన్ని ప్రవేశపెట్టిన వారు త్రిపురనేని రామస్వామి చౌదరి. కొత్త సమాజాన్ని నిర్మించుకోవాలంటే ముందుగా భావ దాస్యం పోగొట్టి, కొత్త తాత్వికత్వాన్ని రూపొందించుకోవాలి అనే విశ్వాసంతో హేతువాద ప్రచారార్థమే త్రిపురనేని తన సాహిత్యాన్ని సృష్టించారు. ప్రజలలో భావ విప్లవం రావాలంటే ముందుగా మతం పేరిట వారిలో పేరుకొని పోయిన మూఢ విశ్వాసాలు పోవాలి. ప్రజలలో మూఢాన్ని పెంచుతున్న మతాన్ని ప్రచారం చేసే పురాణాలను, కృత్రిమ అసమానతలు సృష్టించిన స్మృతులను హేతువాద దృక్పథంతో విమర్శించాలన్నదే త్రిపురనేని ధ్యేయం. ప్రజలలో ప్రబలిన వర్ణాశ్రమ ధర్మాలు, మూఢ విశ్వాసాలు పటాపంచలు చేసే ప్రయత్నంలో భాగంగా హేతువాద కవిత్వం సమాజ పరిణామానికి దోహదం చేసింది.

ఆధునిక సాహిత్యంలో హేతువాదాన్ని ప్రవేశపెట్టిన వారు త్రిపురనేని రామస్వామి చౌదరి. కొత్త సమాజాన్ని నిర్మించుకోవాలంటే ముందుగా భావ దాస్యం పోగొట్టి, కొత్త తాత్వికత్వాన్ని రూపొందించుకోవాలి అనే విశ్వాసంతో హేతువాద ప్రచారార్థమే త్రిపురనేని తన సాహిత్యాన్ని సృష్టించారు. ప్రజలలో భావ విప్లవం రావాలంటే ముందుగా మతం పేరిట వారిలో పేరుకొని పోయిన మూఢ విశ్వాసాలు పోవాలి.

**జాతీయోద్యమ కవిత్వం :** 'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అనే సూక్తి అక్షరాక్షర సత్యమని జాతీయోద్యమ చరిత్రవల్ల తెలుస్తుంది. జాతీయత అంటే ఒక జాతి ఆత్మగౌరవానికి, ఔన్నత్యానికి సంబంధించిన స్థితి. జాతి, సంస్కృతి, సంప్రదాయాలను, సహజత్వాన్ని ప్రవహింపజేసే జీవనది జాతీయత. మనమంతా ఒక్కటే అనే భావమే జాతీయత. భిన్న జాతులు, మతాలు, భాషలున్నా 'జాతీయత' అలవడుతుందని భారతదేశం ప్రపంచానికి చాటి చెప్పింది. ఒక అజ్ఞాత కవి బంకించంద్రుని 'వందేమాతరం' ప్రేరణతో డిసెంబరు 15, 1905న కృష్ణా పత్రికలో "ది క్రై ఆఫ్ మదర్ ఇండియా' అనే పేరుతో ప్రచురితమైన గేయమే తొలి జాతీయోద్యమ గీతంగా భావిస్తాం. చిలకమర్తి లక్ష్మీనరసింహం

ఆశువుగా చెప్పిన 'భరత ఖండంబు చక్కని పాడియావు' గీతం జాతీయోద్యమం 'స్వాతంత్ర్యోద్యమంగా పరిణమిస్తూ అనేకమంది రచయితలను ప్రభావితం చేసింది. ఆంధ్రమాత స్తుతి, భరతమాత స్తుతి, తెలుగు ప్రాంతాల ప్రశంస, గతవైభవ ప్రశంస, మేల్కొలుపు చైతన్యం, విశాలాంధ్రలో ప్రజారాజ్యం, ఆంధ్రావతరణం, మేలుకొలుపు సాహిత్యం, నాయకస్తుతి, నాయిక స్తుతి, పంజాబ్ దురంతం, జాతీయ జెండాపై సాహిత్యం, సహాయ నిరాకరణోద్యమం, స్వాతంత్ర సమరోత్సాహం మొదలగు ప్రధానాంశాల నేపథ్యంలో భాగంగా సామాజిక చైతన్య పరిణామక్రమంలో జాతీయోద్యమ కవిత్వం ప్రధాన భూమిక వహించింది.

**అభ్యుదయ కవిత్వం :** సామాజిక పరిణామ క్రమంలో తెలుగునాట తలెత్తుతున్న ప్రజా ఉద్యమాలతో మమేకమవుతూ, ఉద్యమాలకు ఊపిరి నిచ్చే అభ్యుదయ కవిత్వం ఒక సజీవ చైతన్య స్రవంతిలా ప్రవహించి, పురోగమించి 'గతమెంత మంచిదైనా రచయితలకు వర్తమానంతోనే పని. సమకాలీన వాస్తవ సంఘటనలకు స్పందించని కవి కవికాదని ప్రజలు తలంచ సాగారు. సామాన్య ప్రజలు మెచ్చని కవిత్వం వ్యర్థమనే భావన అభ్యుదయ కవిత్వం కలిగించింది. ఎప్పటి కప్పుడు సామాజిక రంగంలోనూ, సాంస్కృతిక రంగంలోనూ ఎదురవుతున్న సవాళ్లను ధీటుగా ఎదుర్కొంటూ అభ్యుదయ కవిత్వం ముందుకు దూసుకుపోతూనే ఉంది. దాదాపు నాలుగు తరాల రచయితలను ప్రభావితం చేసిన అభ్యుదయ కవిత్వం ప్రజలలో నుండి కవులను, కళాకారులను సృష్టించుకుంది. ప్రజాపోరాటాలకు ప్రతిబింబమైంది. సమకాలీన సమాజంలో ప్రపంచీకరణ దుష్ట భావాలను ప్రతిఘటించింది. ప్రైవేటీకరణ ప్రమాదాలను నిరసించింది. మతోన్మాద దురహంకారాన్ని ఎండగట్టింది.



నగ్నముని

**"అనాదిగా సాగుతుంది అనంత సంగ్రామం**
**అనాథుడికి ఆగర్భ శ్రీమంతునికీ మధ్య"**

అని దాశరథి కృష్ణమాచార్యులు, ఎడతెగని పోరాటం గురించి అన్నారు.

సాహిత్యం సామాన్యులకు చేరువ కావాలని, కవిత్వం జీవిత వాస్తవాలను చిత్రించే సాధనం కావాలని, భవిష్యత్తుకు మార్గదర్శకం కావాలనే సంకల్పంతో 'అభ్యుదయ రచయితల సంఘం' (అరసం) ఏర్పడి ప్రథమ మహాసభ 1943 ఫిబ్రవరి 13, 14 తేదీలలో తాపీ ధర్మారావు అధ్యక్షతన తెనాలిలో జరిగింది. అభ్యుదయ కవిత్వ ప్రతినిధిగా తెలుగు కవిత్వాన్ని ఖండించి, దీవించి, ఊగించి, శాసించి, రక్షించిన మహాకవి శ్రీశ్రీ 'నేటి రచయితలకు ప్రజలే ప్రమాణం' అని, 'మానవుడే నా సందేశం, మనుష్యుడే నా సంగీతం' అని చాటి చెప్పాడు. ఆధునికాంధ్ర సాహిత్యంలో అభ్యుదయ కవిత్వ యుగం, స్వర్ణయుగం. సామాన్యుని కష్టాలను గురించి వ్యక్తం చేసి నటువంటి కవిత్వం ఇంతకు ముందు కన్పించదు.

**దిగంబర కవిత్వం :** తెలుగు సాహిత్య రంగంలో ఏర్పడిన స్తబ్దత మీద హైదరాబాదులో ఆరుగురు యువకులు అలజడి ప్రకటించారు. వారే దిగంబర కవులు. ఈ నేపథ్యం నుండి 1966లో దిగంబర కవితోద్యమం ప్రారంభమైంది. 1965లో ప్రారంభమై 1968 వరకు మూడేళ్ళపాటు సాగి, మూడు సంపుటాలతో సాహిత్యంలో గగ్గోలు పుట్టించిన తిరుగుబాటు దిగంబర కవులది. అరసం నిర్వీర్యమై పోయాక ఏర్పడిన స్తబ్ధతను బద్దలు చేస్తూ వచ్చింది.

దిగంబర కవుల తిరుగుబాటు అప్పటి సమాజంలో కవుల రచనలు ఏదీ జీవిత వాస్తవికతను పట్టుకోలేకపోయిన దుస్థితి ఏర్పడినపుడు వచ్చిన తిరుగుబాటు దిగంబర కవిత. దిగంబర కవిత్వంపై విదేశీ ప్రభావం లేదనీ, 'మేం మేము'గానే వస్తున్నామని దిగంబర కవులు ప్రకటించారు. సంఘ దుస్థితికి కలుషిత వాతావరణానికి పిచ్చెత్తి, రోదించి, నినదించిన కవిత దిగంబర కవిత. ఈ ప్రాపంచిక ఆచ్ఛాదనల్ని చీల్చుకుని కొత్త రక్తాన్ని ఇంజక్ట్ చేయడానికి వచ్చిన యువకులు నగ్నముని, నిఖిలేశ్వర్, చెరబండరాజు, జ్వాలాముఖి, భైరవయ్య, మహాస్వప్నలు. ఈ ఆరుగురూ మూడేళ్ళ పాటు మూడు కవితా సంపుటాలను వెలువరించి తెలుగు కవితాలోకానికి షాక్ ట్రీట్‌మెంట్ ఇచ్చారు. వీరు కనీసం ఆరు సంపుటాలుగా తమ కవిత్వాన్ని వెలువరించాలని భావించారు కానీ మూడు సంపుటాలు వెలువరించి ఆగిపోయారు.

"కవీ! గాలిని గురించి వ్రాయి
గాలిని మాత్రం నీ కవిత్వంలో నింపకు"

అని నగ్నముని కవిత్వం గాలి కాదని ఘోషించారు.

"ఈ దేశంలో, ఈ భూగోళంలో ఊపిరి పీల్చే ప్రతిమనిషి ఉనికి కోసం తపనపడి, అతడి భావిని చూసి వెక్కి వెక్కి ఏడ్చి, పిచ్చెత్తి ప్రవచించిన కవిత తమదని" స్పష్టం చేశారు.

నిరక్షరాస్యత, నిరుద్యోగం, దారిద్ర్య పరాధీనత, కుహనా రాజకీయాలు, మతకలహాలు, పాలక వర్గాలకు వత్తాసు మొదలైన అంశాలను ప్రతిఘటిస్తూ తిరుగుబాటు తత్త్వం, వర్గపోరాటం, వ్యక్తి స్వేచ్ఛ, ప్రపంచ శాంతి, మొదలైన అంశాలను ప్రకటించి దిగంబర కవులు వ్యక్తి అస్తిత్వ పరిరక్షణ, నూతన వ్యవస్థా నిర్మాణానికై అగ్రులు చాచి సామాజిక చైతన్య పరిణామ క్రమానికి దిగంబర కవిత్వం ద్వారా కృషి చేశారు.

తెలుగు సాహిత్యంలో సమాజ పరిణామక్రమంలో భాగంగా ఒక సంధి యుగంలో జడత్వాన్ని తొలగించి, సాహితీపరుల నరాల్లో నిప్పు రగిలించి, విప్లవ 'ఝంఝ' వీచటానికి కవిత్వం తోడ్పడింది. ఈ విధంగా దిగంబర కవిత్వం తన చారిత్రక కర్తవ్యాన్ని నెరవేర్చింది.


దిగంబర కవుల ప్రేరణతో 'పైగంబరులు' పేరుతో సుగమ్ బాబు, కిరణ్‌బాబు, దేవీప్రియ, కమలాకాంత్, ఓల్గా, అనే ఐదుగురు రెండు కావ్య సంపుటాలను ప్రకటించారు. మానవత్వా వాదం తమ కవితా తత్త్వమని వీరు స్పష్టం చేశారు. ఆధునిక సాహిత్యంపై వీరి ప్రభావం నామమాత్రమే అన్న ధోరణి వ్యక్తమవుతుంది.

**విప్లవ కవిత్వం :** తెలుగులో విప్లవ కవిత్వోద్యమం సమాజ పరిణామ క్రమంలో భాగంగా 1967 నాటికి అంకురించి, మరో మూడేళ్ళలో మొలకెత్తింది, వేళ్లూనుకున్నది. 1970లో విరసం ఏర్పడిన తరువాత రెమ్మలుగా, కొమ్మలుగా విస్తరించి తెలుగు సాహిత్యలోకంలో గొప్ప మార్పులు తీసుకు వచ్చింది. 1970 అక్టోబరులో 'విరసం' ప్రథమ మహాసభలు ఖమ్మంలో జరిగాయి. "సాహిత్యం ఒక ఆయుధ విశేషం. సమగ్రమైన మానవ స్వాతంత్ర్యం వైపే విప్లవ సాహిత్యం జరిపే మహా ప్రస్థానం" అని విరసం తన పోరాట మార్గాన్ని నిర్దేశించు కొన్నది. "విశ్వమానవతా వర్గాన్ని, మార్గాన్ని మార్క్సిజం, లెనినిజం క్రాంతి మార్గంలో ఎలుగెత్తి చాటటం" తన ప్రధాన ధ్యేయంగా పేర్కొన్నది. 'సృజన' పత్రిక విప్లవ వాణిగా మారింది. ఇంకా ప్రభంజనం, పిలుపు, విద్యుల్లత పత్రికలు కూడా విప్లవ రచనలను ప్రచురించాయి. 'అరుణతార' విరసం అధికార మాసపత్రికగా కొనసాగుతున్నది.

కత్తినీది కలం నాది / శక్తి నీది యుక్తి నాది
నీ రంగం రణరంగం / నా రంగం భావతరంగం

అన్న చెర బండరాజు పలుకుల దృష్ట్యా విరసం స్వభావం స్పష్టమవుతుంది. విప్లవ సాహిత్య పరమార్థం నూతన ప్రజాస్వామ్య వ్యవస్థ అవసరం గురించిన వివేకానికి అవతరణ గురించి ఆచరణకూ అనుకూలమైన భావ చైతన్యాన్ని ప్రజల్లో పరివ్యాప్తం చెయ్యటమే.

జనజీవన సంక్షోభంలో భాగంగా కులకక్షలు, దారిద్ర్యం, అప్పులు, వడ్డీలు, సంపద విదేశాలకు తరలింపు, ధనికులు మరింత ధనికులవడం, పేదలు మరింత పేదలు కావడం, పేద ప్రజలపై బలప్రయోగం సాధించి, చైతన్యవంతులవుతున్న ప్రజల, మేధావుల కార్యాచరణను అణచి వేసే ప్రయత్నాలు, కార్మికులపై, వ్యవసాయ కూలీలపై నిర్బంధాలు జరుగుతున్న రోజులవి. నక్సల్బరిలోనైనా, శ్రీకాకుళంలోనైనా, తెలంగాణాలోనైనా స్థానిక పీడిత పేద ప్రజానీకం మావో ఆలోచనా విధానంగల దృక్పథంతో తరతరాలుగా జరుగుతున్న దోపిడీకి తిరగబడి తమ జీవితాల మీద, జీవన విధానాల మీద సాధికారతను సాధించడానికి చైతన్య పూరిత దృక్పథంతో


ఓల్గా

విప్లవోద్యమ సాహిత్యం వెలువడి సామాజిక చైతన్య పరిణామ క్రమానికి దోహదం చేసింది.

**స్త్రీ వాద కవిత్వం :** 'స్త్రీ వాదం', 'స్త్రీ విముక్తి' అనే పదాలు 13వ శతాబ్దిలోనూ ప్రస్తుతం 20వ దశాబ్ది చివరి దశకంలోనూ ఉపయోగించడంలో, ప్రస్తావించడంలో చాలా తేడా ఉంది. పూర్వపు ఫెమినిస్టులు హక్కుల సమానత అనే పదాలు వాడితే, నేటి ఫెమినిస్టులు 'అణిచివేత, విముక్తి అనే పదాలు వాడుతున్నారు. వారి రాజకీయ అవగాహనలో వచ్చిన మార్పును వారి భాషే తెలియజేస్తుంది. మారుతున్న సామాజిక, ప్రాపంచిక జాబితాలతో పాటు తమ అవగాహనా పరిధిని, అనుభవాల పరిధిని విస్తృతం చేసుకొని, కొత్త వస్తువులను ఎప్పటికప్పుడు స్వీకరించటం స్త్రీవాద కవయిత్రుల రచనలలోని విశేషం.

**ప్రతిబింబాన్ని ప్రేమించలేని దేశంలో పుట్టి**
**ప్రేతాత్మల ప్రపంచంలో మెట్టిన**
**ఏ అమ్మకయినా ఆలోచన మెదడులోకాదు**
**కడుపులో ఎదుగుతుంది.**

అన్న పంక్తుల్లో ఆడపిల్ల పుట్టుకను ఆడవాళ్ళే హర్షించని స్థితికి ఆడవాళ్ళను అట్లా తయారు చేసి తమవి కాని బతుకులు బతకమని శాసించిన ప్రపంచ లక్షణాన్ని ఆ ప్రపంచంలో మిగిలిపోయిన దుర్దశకు వరుసగా రూపు కట్టించారు స్త్రీ వాదులు.

**"అందమైన దోపిడీకి / పవిత్రమైన హింసకు**
**న్యాయమైన దాస్యానికి / బలైపోయిన నేను, భారత స్త్రీని."**

అంటూ ఓల్గా భారత స్త్రీని ఆవిష్కరించింది.

మాతృత్వం, లైంగిక వివక్ష, శారీరక స్పృహ, వివాహ వ్యవస్థ, కుటుంబంలో హింస, సామాజిక జీవితం, ప్రపంచీకరణ, ప్రధానాంశాలతో స్త్రీవాద కవిత్వం సామాజిక చైతన్య పరిణామ క్రమానికి దోహదకారి అయింది.

**దళిత కవిత్వం :** ఆధునికాంధ్ర కవిత్వంలో దళిత కవిత్వం దాదాపు ఒక శతాబ్ది కాలంగా వెలువడుతున్నదని చెప్పవచ్చు. జాతీయోద్యమ కాలంలో హరిజనాభ్యుదయ కవిత్వంగా వెలువడిన తొలి దశ కాగా, వామ పక్ష ఉద్యమాలలో పీడిత వర్గ కవిత్వంగా వికసించడం రెండవ దశ. నేడు ఉద్యమాలను భర్తీతో ఒక ప్రధానమైన సాహితీ స్రవంతిగా దూసుకు రావడం వర్తమాన దశ. భారతీయ సమాజంలో వేళ్లూనుకుని ఉన్న కుల వ్యవస్థను నిరసిస్తూ వివక్షతలను వ్యతిరేకిస్తూ, సామాజిక న్యాయం కోసం, సమ సమాజంకోసం దళిత కవులు, కళాకారులు, రచయితలు బలమైన గర్జనలు వినిపించారు.

సమాజ పరిణామ క్రమంలో భాగంగా వచ్చిన దళిత కవిత్వంలో ప్రతిఘటన చైతన్యంలో దళిత స్వరాన్ని వినిపించిన మహాకవి గుర్రం జాషువా "నా గురువులు ఇద్దరు, పేదరికం, కులమత భేదం. ఒకటి నాకు సహనాన్ని నేర్పితే, రెండవది నాలో ఎదిరించే శక్తిని పెంచింది" అని ప్రకటించిన జాషువా సాంఘిక, ఆర్థిక అసమానతలపై కత్తి గట్టాడు. విభిన్న నిమ్న కులాల జీవితాలనూ, భావాలనూ, వేదనలనూ, గుండె చప్పుళ్ళనూ, ధిక్కార స్వరాలను, ప్రతిఘటనా చైతన్యాలను ప్రతిధ్వనిస్తూ, సమకాలీన దళిత కవిత్వం పురోగమిస్తూ, బహుముఖాలుగా విస్తరిస్తూ, వేయిరేకులతో వికసిస్తూ సామాజిక చైతన్య పరిణామక్రమంలో భాగమైంది.


**ఆధునికానంతర వాదం :** ఆధునిక యుగం, తరువాత కాలాన్ని అత్యాధునిక యుగం అంటున్నాం. కవిత్వ వాదం పరంగా, ఆధునికానంతర వాదం, ఆధునికోత్తర వాదం, ఉత్తర ఆధునిక వాదం, వినిర్మాణవాదం, పోస్ట్ మోడర్నిజం అని పిలుస్తున్నాం. అప్పటిదాకా నడచిన చారిత్రక అవగాహనని, తాత్విక సంప్రదాయాన్ని తిరస్కరించి, మానవ సామాజిక ప్రవర్తనలను, పరిణామాలను వాటి మూలాలకు వెళ్ళి విశ్లేషణ చెయ్యటానికి ఆధునికానంతర వాద కవిత్వం ప్రయత్నం చేస్తుంది. ఏ సిద్ధాంతమైనా కొంత కాలం వరకే కొన్ని సమాజాలకే వర్తిస్తుందని, అన్ని కాలాలకూ అన్ని సమాజాలకూ, పనికి వచ్చే సిద్ధాంతమేదీ ఉండదని ఆధునికానంతరవాదులు భావిస్తారు. మార్క్సిజం వీరి దృష్టిలో కాలం చెల్లిన సిద్ధాంతంగా కనిపిస్తుంది.

ప్రస్తుతం ఇరవై ఒకటో శతాబ్దంలో మొదటి దశాబ్దం ముగిసింది. కాని సాహితీ సృజన ఏ స్థాయిలో జరుగుతుందో ప్రశ్నించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. సాహితీ ప్రక్రియల సృజన జరగటం లేదు. వచన కవిత్వం, మినీ కవిత్వం, హైకూ, నానీల తరువాత కవిత్వ రూపం గురించి ఆలోచన చేయాల్సి ఉంది. కవిత్వానికి కొత్త శక్తిని సమకూర్చుకోవాల్సిన అవసరం ఉంది. సృజించబడిన ప్రతి ప్రక్రియ సమాజ పరిణామ క్రమాన్ని ఆకాంక్షించాలి. అపుడే కవిత్వ పరమార్థం నెరవేరుతుందనడం అక్షర సత్యం. ●

# బంజారాల జీవన విధానం

**- కరిమిండ్ల లావణ్య**

ప్రపంచంలో ఆఫ్రికా ఖండం తరువాత గిరిజనులు ఎక్కువగా ఉన్నది ఆసియా ఖండంలోని భారతదేశంలోనే. ఈ దేశంలో గిరిజనులు భౌగోళికంగా దేశ విస్తరణలో కేవలం 20 శాతం భౌగోళిక ప్రాంతాన్ని మాత్రమే ఆక్రమించి ఉన్నారు. కాని, ఆశ్చర్యకరమైన విషయమేమంటే, దేశంలో ఉన్న ఖనిజవనరుల్లో డెబ్బైశాతం పైబడి ఈ ప్రాంతంలోనే నిక్షిప్తమై ఉన్నాయి. గిరిజనులు జార్ఖండ్, ఒరిస్సా, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఉన్నారు. ఈశాన్య భారతంలో అధిక శాతం గిరిజనులున్నారు. భారత దేశంలోని గిరిజనులను భౌగోళిక ప్రాంతం మరియు చారిత్రకనేపథ్యం దృష్ట్యా పరిశీలించినపుడు నాలుగు మండలాలుగా విభజించవచ్చు (1) ఉత్తర ఈశాన్యమండలం (2) మధ్యమండలం (3) దక్షిణమండలం (4) అండమాన్ నికోబార్ మండలం. ఈ నాలుగు మండలాల్లో దక్షిణ మండలాన్ని పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో బగత, చెంచు, గదబలు, గోండ్, కొండదొర, కొండరెడ్డి, కొలాములు, మన్నెందొర, సుగాలి/బంజార/నాయక్, వాల్మీకి, యానాది, కోయ, ఎరుకల తదితర తెగలున్నాయి. వీరంతా ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా తూర్పు కనుమలు, నల్లమల కొండల లోయలు, అటవీ ప్రాంతాల్లో నివాసాలేర్పరచు కున్నారు. అడవులు ఎక్కువగా ఉన్న మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్ర సరిహద్దుల్లో గిరిజన జనాభా ఎక్కువ. మహారాష్ట్ర సరిహద్దుగా గల నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో కూడా గిరిజన జనాభా ఎక్కువే. వారిలో సుగాలి/బంజార/నాయక్ తెగలు ముఖ్యమైనవి. ఈ బంజారాతెగల్లో కూడ వర్గాలున్నాయి (నిజామాబాద్ జిల్లాతో పాటు). శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాలు మినహా మిగతా అన్ని జిల్లాలో బంజారాలు వివిధ వర్గాలుగా నివసిస్తున్నారు. కేవలం నిజామాబాద్ జిల్లాలో మథుర(లబాన్) బంజారాలు ఒక ప్రత్యేకమైన తెగ. మిగతా ఆంధ్రప్రదేశ్‌లోని ఏ ప్రాంతలో కూడా వీరు లేరు. వేషధారణంతా బంజారాలకు విభిన్నంగా ఉంటుంది.



నిజామాబాదులోని బంజారాలు ఉత్తర భారతదేశం నుండి వచ్చి స్థిరనివాస మేర్పరచుకున్నట్లు చరిత్రకారులు చెబుతారు. వీరు ప్రోటో ఆస్ట్రలాయిడ్ జాతికి చెందినవారని శాస్త్రయుక్తంగా ఆంత్రోపాలజిస్టులు గుర్తించారు. వీరు మొదట సంచార జీవనం చేస్తూ పశువులను, ఆవులను మేపుతూ అటవీ ప్రాంతాల్లో సంచరించేవారు. క్రమక్రమంగా ఆయా ప్రాంతాల్లో స్థిరనివాసం ఏర్పరచుకొని, వ్యవసాయం చేయడం మొదలు పెట్టారు.

లబాన్ (మథుర) బంజారాలు అక్బర్ పరిపాలనా కాలంలో రాజస్థాన్ ప్రాంతంలో అధిక పన్నులు విధించడంతో ఆ ప్రాంతాన్ని వదిలి నిజామాబాద్ జిల్లాలోని గాంధారి మండల పరిసర ప్రాంతానికి వలస వచ్చినట్లు తెలుస్తుంది. వీరివృత్తి పశుపోషణ. ఇప్పటికీ కొన్నికుటుంబాల్లో వందలాది ఆవులున్నాయి. బంజారాలు ఎస్.టి.లుగా గుర్తించబడితే, లబాన్ బంజారాలు బి.సి.(డి) వర్గంలో గుర్తించబడ్డారు.

డా॥ కరిమిండ్ల లావణ్య, ఫోన్ : 9848410244

**బంజారా, లబాన్ (మథుర) బంజారాల సంస్కృతి, సాహిత్యం:** సంస్కృతి అనేది తరతరాల మానవుల యొక్క అనుభవాలసారం. ఆచార వ్యవహారాలు మొదలైన సంక్లిష్ట మొత్తం... "మానవుని సామాజిక జీవితంలో ముడిపడిన నమ్మకాలు, కట్టుబాట్లు, నీతినియమాలు, ఆచారవ్యవహారాలు, ప్రవర్తనావిధానం, ఆలోచనాసరళి మొదలైనవాటికి సంబంధించిన పదం సంస్కృతి". "జంతువుల్లోలేని, మానవుల్లో మాత్రమే కనిపించే ఆభరణం సంస్కృతి".

ఈ సంస్కృతిలో అంతర్భాగాల గురించి క్లాక్‌విస్లర్ అనే శాస్త్రవేత్త ఈ విధంగా తెలిపాడు. భాష, ఆహారం, గృహం, రవాణాసదుపాయాలు, రక్షణ, వేషభాషలు, పరిశ్రమలు, మతం, కళలు, పుక్కిటి పురాణాలు, శాస్త్రీయ విజ్ఞానం, కర్మకాండ, మూఢ నమ్మకాలు, కుటుంబం వర్గాలు, వివాహం, సామాజిక నియంత్రణ, ఆస్తి విలువ, మారకం, ప్రభుత్వం, చట్టం మరియు యుద్ధం అనే ఈ సాంస్కృతిక నిర్మాణమంతా బంజారా, మథురబంజారా తెగల్లో కనిపిస్తుంది. అయితే సంస్కృతినుంచే పుట్టిన నాగరికతకు ఒక ప్రమాణం ఉంటుంది. కాని, సంస్కృతికి ఏ ప్రమాణాలు లేవు. దేశ, కాలాలనుబట్టి సంస్కృతిలో విలువలు మారుతుంటాయి. సంస్కృతి ఒక నాగరిక సమాజంలో, సమూహంలో, సంస్థలో మరియు సంఘంలో ఉంటుంది.

***బంజార-లబాన్ (మథుర) బంజారాల భాష-వ్యాప్తి:*** ఆంధ్రప్రదేశ్‌లో నివసించే గిరిజన జాతుల భాషలను ముఖ్యంగా మూడు భాషాకుటుంబాలుగా విభజించవచ్చు. (1) ద్రవిడియన్ భాషా కుటుంబం (2) ముండారి భాషా కుటుంబం (3) ఇండో ఆర్యన్ భాషా కుటుంబం, అయితే చివరిది ప్రపంచంలోని పదిభాషాకుటుంబాల్లో అతి పెద్దదైనది. బంజార భాష ఈ భాషా కుటుంబానికే చెందుతుంది ఈ భాషకు లిపి లేదు. లిపిరహిత భాష. బంజార-లబాన్ (మథుర) బంజారులు ఒకేప్రాంతంలో నివసించడం వల్ల వీరిద్దరి భాషలు కలిసిపోయాయి. నిజామాబాద్‌లోని గాంధారి మండలం, నేరల్, "చద్మల్" గ్రామపంచాయతి పరిసర ప్రాంతంలోని చాలా తండాల్లో ఈ రెండు తెగల ప్రజలు కలిసి జీవనం గడుపుతున్నారు. బంజారాలు, లబాన్ బంజారాలు వారి వారి భాషా పదాలను ఈ విధంగా చెప్పారు. మొదట వాళ్ళకు బతుకునిచ్చిన పశు సంపద, వ్యవసాయ పదాలు పరిశీలిద్దాం.

| బంజారా | | | లబాన్ / మథుర బంజారా | | |
|---|---|---|---|---|---|
| గావుడీ | – | ఆవులు | గావుడీ | – | ఆవులు |
| బేంసీ | – | బర్రె | బేంసీ | – | బర్రె |
| ఖెల్టా/ఖేల్డీ | – | దూడ | ఖెల్టా/ఖేల్డీ | – | దూడ |
| ఛేరీ | – | మేక | ఛేరీ | – | మేక |
| గోర్లీ | – | గొర్రెలు | గోర్లీ | – | గొర్రెలు |
| నాగర్ | – | నాగలి | నాగర్ | – | నాగలి |
| ధాత్ల | – | కొడవలి | ధాత్ల | – | కొడవలి |
| కరాడీ | – | గొడ్డలి | కరాడీ | – | గొడ్డలి |
| అంగార్ | – | అగ్గి | అంగార్ | – | అగ్గి |
| లకడీ | – | కర్ర | లకడీ | – | కర్ర |
| ఖడ్ | – | గడ్డి | ఖడ్ | – | గడ్డి |
| పరాళ్ | – | ఎండు | పరాళ్ | – | ఎండు |
| ఝుగలా | – | అంగీ | ఝుగలా | – | అంగీ |
| ధోతి | – | ధోతి | ధోతి | – | ధోతి |
| సాడీ | – | చీర | సాడీ | – | చీర |
| కాళి | – | జాకెటు | కాళి | – | జాకెటు |
| ఘాగ్రో | – | లంగా | ఘాగ్రో | – | లంగా |

**కుటుంబంలో పిలుచుకునే పేర్లు**

| బంజారా | | లబాన్ / మథుర బంజారా | |
|---|---|---|---|
| బుడో డోక్రా | – ముసలి తాత | బుడో డోక్రా | – ముసలి తాత |
| నాన | – తాత/ అమ్మమ్మ | నాని | – అమ్మమ్మ |
| బుడీ/దాదీ | – నాన్నమ్మ- తాత | బుడీ/దాదీ | – నాన్నమ్మ |
| యాడి | – అమ్మ | బయి | – అమ్మ |
| బేటా | – కొడుకు | బేటా | – కొడుకు |
| బేటి | – కూతురు | బేటి | – కూతురు |
| బాప్ | – నాన్న | బాప్ | – నాన్న |

**బంజారా-లబాన్ బంజారాల గృహ నిర్మాణం:** బంజారాల గృహనిర్మాణం వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులను, సాంకేతిక పరిజ్ఞానాన్ని సూచిస్తాయి. వీరు అర్ధచంద్రాకారం, చతురస్రాకారం, దీర్ఘచతురస్రాకారం ఉన్న గుడిసెల్లో నివసిస్తారు. ఈ గుడిసెలకు మట్టిగోడలు కాని మట్టిపూతతో చేసిన తడికెలు లేదా వెదురు గోడలుంటాయి. గుడిసె పైకప్పు, అడవుల్లో దొరికే గడ్డితో కప్పుతారు. ఈ మధ్యకాలంలో నిర్మించిన డాబాలుకూడా దీర్ఘ చతురస్రాకారంగా ఉన్నాయి.

**బంజారా - లబాన్ బంజారాల ఆర్థిక వ్యవస్థాపన:** అటవీసంపద దేశ ఆర్థిక వ్యవస్థలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. అడవులు వాతావరణాన్ని, వర్షపాతాన్ని నియంత్రిస్తాయి.

అడవుల్లో లభించే కలప, ఇతర ఉత్పత్తులు వివిధ పరిశ్రమలకు ముడి సరుకుగా ఉపయోగపడుతాయి. అనేక జీవ, జంతు జాలలకు ఆవాసమయిన అడవులు పర్యావరణ సమతూకాన్ని కాపాడుతాయి. మందుల తయారీకి అవసరమయిన అనేక మూలికలు మనకు అడవులనుంచే లభిస్తున్నాయి. బంజార ఆర్థిక వ్యవస్థకు అనేక అటవీ ఉత్పత్తులు తోడ్పడుతున్నాయి. చీపుళ్ళు, విస్తర్లు, ఆకులు, చింతపండు, బంక, తునికాకు, తేనె, కరక్కాయలు, కుంకుడుకాయలు వంటి అనేక ఉత్పత్తులను అవి సరైన పక్వానికి వచ్చిన తురువాత దేవతలను ప్రార్థించి, పూజించి సేకరిస్తారు. వాటిని అమ్మకోగా వచ్చిన ఆదాయంతో జీవనం గడుపుతారు.

బంజారాలు లేదా లంబాడాలు పశుపోషకులుగా చెప్పుకోవచ్చు. పూర్వం ఒక ప్రాంతంనుంచి మరో ప్రాంతానికి తిరుగుతూ పశుపోషణ సాగించే బంజారాలు ఈ మధ్యే స్థిర నివాసాలు ఏర్పరచుకొని వ్యవసాయం, పశు పోషణలపై ఆధారపడుతున్నారు. వీరు తమ పశువులనే కాకుండ ఇతర బంజారాల పశువులను కూడా పెంచుతూ ఉంటారు. పశుపోషణ, పాల ఉత్పత్తులు అమ్మడం సాంప్రదాయక వృత్తి, స్థిర వ్యవసాయాన్ని సాగిస్తున్నప్పటికీ వారి సంస్కృతిలో పశుసంపదకు ప్రాముఖ్యత ఉంది. ఇప్పటికీ వివాహా సమయాల్లో వరునికి ఆవులను కట్నంగా ఇవ్వడం అనే సంప్రదాయం బంజారాల్లో ఉంది. అనేక పండుగలు, పూజలు పశువుల ఆరోగ్యం కోసం చేస్తుంటారు. నేటికీ బంజారాల్లో పశువులులేని కుటుంబం లేదని చెప్పవచ్చు. వ్యవసాయంలో ప్రధాన పంటలు జొన్న, పత్తి, మొక్క జొన్న.



ఈస్టిండియా కంపెనీ వారు మనదేశంలో స్థిరపడిన తరువాత బ్రిటీష్ ప్రభుత్వం ఏర్పడింది. 1894 వ సం॥లో అటవీ విధానం ప్రకటించారు. ఈ విధానంలో అడవుల్లో పశువులను మేపడం నిషేధించలేదు. కాని, ఆ తరువాత 1952 భారత అటవీ విధానం ప్రకారం పశువులను మేపడాన్ని నియంత్రించి, సుంకాన్ని విధించింది. ముఖ్యంగా ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమంటే 1894 విధానంలో గిరిజనులకుగల హక్కులు, 1952 విధానంలో మినహాయింపులుగా మారిపోయాయి. అప్పటినుండీ గిరిజనులు అడవులపై హక్కును కోల్పోయారు. లబాన్ బంజారాలు పశుపోషకులు. నిజామాబాద్ జిల్లాలో ముఖ్య పంటచెరకు. ఈ చెరుకు నాటేటపుడు చెరుకు పక్వానికి వచ్చిన తరువాత చెరుకు కొట్టేటపుడు చెరుకు పండించే ప్రాంతాలకు వలసలు వెళుతారు. చెరుకు తోటల పనికి పూర్తిగా లబాన్ బంజారాలే వెళుతారు. సంవత్సరంలో రెండు మూడునెలలు చెరుకుద్వారా ఆర్థికస్థితిని మెరుగు పరుచుకుంటారు.

**బంజార-(మథుర) లబాన్ బంజారాలు వారి వివాహ పద్ధతులు :** పూర్వకాలపు కన్యాశుల్క ఆచారం నుండి ప్రస్తుత వరకట్నపు ఆచారం వరకు కట్నం లబాన్ బంజారాల్లో లేదు. కట్నం తీసుకొని నాగరికులమని మనం చెప్పుకుంటున్నాం. అనాగరికులని భావిస్తున్న బంజారాల మథుర బంజారాల అతి ముఖ్య లక్షణం కన్యాదాన సమయంలో కట్నకానుకలు లేక పోవడమే. దీన్నిబట్టి మనం కుహనా నాగరికులమనే (సూడోసివిలైజ్డ్ పర్సన్స్) తెలుస్తుంది. మథుర బంజారాల్లో బాల్యవివాహాలు లేవు. వీరు వివాహాన్ని సంప్రదాయ బద్ధంగా 5 రోజులు చేస్తారు. మేనరికాలున్నాయి. పెళ్ళికి ముందు వరుని వధువు ఇంట్లోనే నెల రోజులుంచుకొని అతని గుణగణాలను పరీక్షిస్తారు.

**బంజార-మథుర (లబాన్) బంజారాలు - కుటుంబాలు:**

బంజారా, మథుర బంజారాల్లో ఉమ్మడి కుటుంబాలే ఎక్కువ. తండ్రే ఇంటిపెద్ద. బహుభార్యాత్వంలేదు. ఒకవేళ సంతానంకాకుంటే, యుక్తవయస్సులో భార్య మరణిస్తే మళ్ళీ వివాహం చేసుకునే సంప్రదాయం ఉంది. కుటుంబాల మధ్య బంధుత్వాలు గాఢంగా ఉంటాయి. ఆపద ఏ ఒక్కరికి వచ్చినా అందరిదిగా పంచుకొని పరిష్కారం చేసుకుంటారు. కాని, ప్రస్తుతం క్రమక్రమంగా తెరమరుగౌతుంది.

**బంజార-లబాన్ (మథుర) బంజారాల మూఢ నమ్మకాలు:** బంజారా, మథుర బంజారాల్లో దయ్యాలున్నాయనే నమ్మకం ఉంది. వీరు అడవుల్లో నివసించడం వల్ల రాత్రి పూట ఆహార

అన్వేషణ కొరకు తిరగకుండా ఈ నానుడి పుట్టి ఉండొచ్చు, మంత్రాలు, బాణామతి, పాములు, తేళ్ళు, విషపురుగులు కరిస్తే మంత్రాల ద్వారా నయమవుతుందనే గట్టి నమ్మకం వీరిలో కనిపిస్తుంది. పాములు, విషపు పురుగులు కరిస్తే చెట్ల పసర్ల ద్వారా నయం చేస్తారు.

**బంజార – (మథుర) లబాన్ బంజారాల శాస్త్రీయ విజ్ఞానం అటవీ సంపద :** అడవుల్లో లభించే వనరుల నుండి జ్వరం, పసరికల వంటి రోగాలను నయం చేస్తారు. ఆవు మూత్రంతో ఇల్లు అలకడం వల్ల రోగాలు రాకుండా ఉంటాయంటారు. ఆయుర్వేద వైద్యానికి ప్రాధాన్యతనిస్తారు.

**బంజార–(మథుర) లబాన్ బంజారాల పుక్కిటి పురాణాలు:** రాముడు, శ్రీకృష్ణుడు, బాలాజి, పూరి జగన్నాథుడు, రామ్‌సింగ్‌బాబా, కాళూబాబా, సేవాలాల్ మహరాజ్‌లకు సంబంధించిన చాలా నీతి కథలు వీరు  చెబుతారు. ఒక్కో కథ సుదీర్ఘంగా సాగుతుంది.

**బంజార–(మథుర) లబాన్ బంజారాల కళలు– వృత్తులు:** పాటలు, అల్లికలు, కుట్లు, కేశాలంకరణ, గృహాలంకరణ, వస్త్రాలంకరణ, జానపద బాణీలో నృత్యాలు, బాండ్ మేళాలు, కంసాలీలు, వంద్రంగివారు, కుమ్మరివాండ్లు, పురోహితులు.

**ఎ) బంజారాలు / మథుర  బంజారాలు పెండ్లి సమయంలో పాడుకునే పాటలు**

**బంజారా :** "బీయారే హసియా
మరే హసేతి బీయోమే హసియా"

**మథుర :** "కోనస్ వాడినే ఘోంఘరీ
ఆబే లాద్యేతో ఆవే"

**బి) బంజారాలు / మథుర  బంజారాలు హోలీ, రాఖీ పండుగల సందర్భంగా పాడే పాటలు**

**బంజారా :** "ఆజీ రాజ్ కూనె కెలాచకో
హోలీ ఆయి రామ్‌రే రాజా బోలో కేలోరే"

**మథుర :** "జోలాయిడే సోనో రూసో
హేరే హేరియో సోనో "


**బంజారాలు / మథుర  బంజారాల ఆహార పద్ధతులు:** వీరు మక్క రొట్టెలు, బియ్యపు పిండితో చేసిన ఘెమ్మర్, బాబర్ (చపాతి) తింటారు.  అన్నం, కూరలు మిగతావారి మాదిరిగానే తీసుకుంటారు. మథుర బంజారాలు శాఖాహారం ఎక్కువగా, మాంసాహారం అతి తక్కువగా తింటారు.

**బంజారాల / మథురబంజారాల పండుగలు:** రాఖీ, తీజ్, కృష్ణాష్టమి, ఎడ్లపోలాల అమావాస్య (మాస్), దసరా, దీపావళి, సంక్రాంతి, హోళి, ఉగాది, శ్రీరామనవమి తదితర పండుగలన్నింటి విధానాలు ఇద్దరిలో ఒకే రకంగా ఉంటాయి. కానీ సేవాలాల్ పండుగ విధానంలో మార్పులుంటాయి.

**బంజారాల/మథుర బంజారాల వేషధారణ:** మథుర లబాన్ లంబాడాలను గుర్తించడానికి బీడ్, ఖెట్ల, ధర్‌ల ఆధారం. ఇవి చెవికి ధరిస్తారు. అవి చాలా బరువుగా ఉంటాయి. "చుండై" జుట్టుకు ధరించేది. జుట్టుపైన నడినెత్తిమీద ప్రత్యేకాలంకరణ వీరికి ఉంటుంది. బంజారాల్లో కేవలం తలపై నుండి ముసుగుంటుంది. చేతులకు ప్రత్యేకంగా గాజులు ధరిస్తారు.

పై అంశాలే కాకుండా రక్షణ, సామాజిక నియంత్రణ, బంజారా, మథురబంజారేతర సంస్కృతి సంపర్కం పరిణామాలు, మతం, ఆస్తివిలువ–మారకం, బంధుత్వాలు వివిధ వర్గాలు, కర్మకాండలు మరియు చిత్రణ, స్వాతంత్ర్యం తర్వాత బంజారాల జీవనచిత్రణ అనే తదితర అంశాలెన్నింటినో వారి జీవన విధానంలో పరిశీలించవచ్చు. బంజారాను దృష్టిలో ఉంచుకుని భారత ప్రభుత్వ చట్టాలు, రాజ్యాంగ పరిరక్షణ హక్కులు, రిజర్వేషన్లు మరియు వివిధ కమీషన్లు వీరి అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని నిర్మితమైనవే.

**ముగింపు:** భారతదేశంలో 1990 తర్వాతే వ్యక్తి ఆర్థికాభివృద్ధి, జీవన ప్రమాణం, రేటు అత్యధిక వృద్ధిలోకి వచ్చింది. అలాగే బంజారాల్లో కూడా 1980–90 నుంచే జీవన ప్రమాణ స్థాయిలో ఘననీయమైన మార్పు వచ్చింది. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బంజారాల అభివృద్ధికి తోడ్పడుటకు అత్యధికమైన ప్రాధాన్యతనిచ్చి ఆర్థిక ఫలాలను అందజేయడమే కారణం. ఐక్యరాజ్యసమితి మార్గదర్శక సూత్రాలను అనుసరించి, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రజల జీవన ప్రమాణస్థాయి పెరుగుతూ వస్తుంది. అందులో భాగంగానే బంజారాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, వారి జీవన ప్రమాణాన్ని పెంచే క్రమంలో ఆర్థికంగా పెద్దపీట వేశారు. మనమంతా 21వ శతాబ్దంలో ఆర్థిక అసమానతలను తొలగించుకుని పంచవర్ష ప్రణాళిక పద్ధతుల్లో నాగరిక సమాజాన్ని సాధించాలనే లక్ష్యాన్ని పెట్టుకుని సహకరించుకుంటూ ముందుకు వెళ్ళినప్పుడే దేశం అభివృద్ధి పథంలో నడుస్తుంది. మి




## బెంగుళూరు నాగరత్నమ్మ

# త్యాగరాజ ఆరాధనోత్సవం

**- ఎన్నార్కె**

అది ప్రభవనామ సంవత్సరం. పౌర్ణమి గడచి ఐదు రోజులయింది. ఆ రోజు బహుళపంచమి, ఆదివారం (జనవరి 6, 1847వ సంవత్సరం).

ప్రభాత సమయాన, క్రమం తప్పకుండా జరిగే తన దినచర్యలో భాగంగా త్యాగరాజస్వామి తన శిష్య బృందంతో కలసి, కావేరీ నదిలో స్నానం చేసి, ఇంటికి వచ్చి పూజాదికాలు పూర్తి చేసుకున్నారు. కొందరు శిష్యులు భజనలు చేయటంలో నిమగ్నులైనారు. మరికొందరు 'బ్రోచే వారెవరురా!' అనే కీర్తన కోసం తంబురా శృతి చేసికుంటున్నారు. బ్రాహ్మణులకు, పేదలకు అన్నసంతర్పణ జరుగుతుంది. "సంగీత జ్ఞానము, భక్తి వినా.. సన్మార్గము కలదే ఓ మనసా" అన్నట్లు భక్తి, సంగీతాలతో శిష్య, ప్రశిష్యులతో తిరువయ్యూరులోని ఆ గృహము కళకళలాడుతుంది. అంతా నిండు పేరోలగంగా ఉంది. ఇంతలో వీణ తీగ తెగినట్లుగా అపశృతి. ఉన్నట్లుండి ఒక శబ్దం. తృటికాలం ఎవరికి ఏమి జరిగిందో అర్థం కాలేదు. ఆ విభ్రమ నుంచి తేరుకొని లోనికి వెళ్ళారు. కర్నాటక సంగీతానికి తనదైన నిర్వచనం చెప్పిన నాద బ్రహ్మ విగత జీవుడై పడి వున్నాడు. తాగ్యరాజస్వామికి కపాలమోక్షం జరిగింది.



**త్యాగరాజ మందిరం**

త్యాగరాజు తన జీవిత చరమాంకంలో పరమహంస పరివ్రాజిత శ్రీ బ్రహ్మానందస్వామి ఆదేశం మేరకు సన్యాసాశ్రమం స్వీకరించారు. తంజావూరు పరిసర ప్రాంతంలో మరణించిన సన్యాసులను కావేరినది ఒడ్డున వున్న భావస్వామి అగ్రహారంలో సమాధి చేయటం ఆచారంగా వస్తుంది. త్యాగరాజస్వామి గురువైన శొంఠి వెంకటరమణయ్య గారి సమాధి కూడా అక్కడే వుంది. త్యాగరాజు తనని ఎక్కడ సమాధి చేయాలో శిష్యులకు ముందే చూపించారు.

ఇప్పుడిక జరగవలసినవి ఉత్తర కర్మలు. త్యాగరాజు ఏకైక కుమార్తె సీతామహాలక్ష్మి పుత్రుడయిన పంచకేశయ్య అందుకు గాను సర్వం సిద్ధం చేశాడు. ముందుగా ఆ మృత దేహానికి స్నానం చేయించారు. శరీరమంతా విభూతి పూసి, రుద్రాక్షమాలను మెడలో వేసి కాషాయ దుస్తులు ధరింప జేశారు, పార్థివ శరీరాన్ని బాచింపట్టు వేసిన భంగిమలో వెదురు బుట్టలో కూర్చుండ బెట్టి, బుట్టను కర్రకు కట్టి నలుగురు బ్రాహ్మణులచే కావేరీనది ఒడ్డుకు తీసుకొని వచ్చారు. త్యాగరాజ స్వామి అంతకు ముందు సూచించిన స్థలంలోనే గొయ్యి తీసి, అందులో ఉప్పువేసి, ఆ మృత దేహాన్ని తలమాత్రం బయటకు కనబడేలా ఉంచి మిగిలిన భాగాలను ఉప్పుతో పూడ్చివేశారు. తల భాగం ఎటూ కదలడానికి వీలు లేకుండా అన్ని పక్కల నుంచి ఉప్పుతో గట్టిగా నొక్కి ఉంచారు. శిరస్సు ముక్కలయ్యేదాకా తల మీద కొబ్బరి కాయలు పగుల కొట్టారు. ఆ తరువాత దానిని కూడా ఉప్పుతో పూడ్చివేసి, మట్టితో

నాగరత్నమ్మకు కన్న బిడ్డలు లేరు. ఒక ఆడపిల్లను పెంచుకుంది. ఆ అమ్మాయికి విద్యా బుద్ధులు, సంగీతాది కళలు నేర్పి వృద్ధిలోకి తేవాలని ఎంతో ప్రయాస పడింది. తానొకటి తలిస్తే దైవమొకటి తలచినట్లు ఆ పిల్లకు ఏదీ అబ్బలేదు. నాగరత్నమ్మ జీవితంలో ఇది కూడా నిరాశా ప్రకరణమే. అయినా పెంచినందులకు తన ఆస్తిలో కొంత పెంపుడు కూతురుకు చెందేటట్లు వీలునామా వ్రాయించి, న్యాయవాది సమక్షంలో ఆస్తిని అప్పగించి, తాను ఆధ్యాత్మిక చింతనలో, రామభక్తురాలై, త్యాగరాజ ఆరాధనలో తన జీవితం చరితార్థం చేసుకుంది.

స్థూపాకారంలో సమాధి నిర్మించి దానిపై తులసి మొక్కను నాటారు.

పంచకేశయ్య తిరుమంజన వీధిలో నున్న తన తాతల ఇంట్లో ప్రతి సంవత్సరం త్యాగయ్యకు తద్దినం పెట్టేవాడు. త్యాగయ్య శిష్యులు ఆయన సమాధి వద్ద శ్రాద్ధకర్మలు నిర్వహించే వారు. పంచకేశయ్య 1855వ సం॥లో నిస్సంతుగా మరణించాడు. సుబ్బరాయ భాగవతార్ అనే త్యాగయ్య శిష్యుడు కొన్నాళ్లు తద్దినం పెట్టేవాడు. క్రమేపీ ఆలనా పాలనా లేక ఆ సమాధి పాడుపడింది. చివరకు అడుగు పెట్టడానికి వీలు లేనంతగా దుర్గంత పూరితంగా ఉండేది. పరిస్థితులలో మార్పు రాలేదు. కాలగతిలో ముప్పై సంవత్సరాలు దొర్లి పోయాయి.

కర్నాటక ప్రాంతంలోని నంజనగూడు శ్రీకంఠేశ్వ రాలయపు దేవదాసి పుట్టలక్ష్మికి, 1878 వ సంవత్సరం, నవంబరు 3వ తేదీన నాగరత్నమ్మ జన్మించింది. ఆమె తల్లికి పోషకుడయిన సుబ్బన్న సంపన్న బ్రాహ్మణుడు. ఏకసంథిగ్రాహి అయిన నాగరత్నమ్మ సంస్కృత కావ్యాలతోబాటు కన్నడం, తెలుగు, ఇంగ్లీషు నేర్చుకుంది. త్యాగరాజ స్వామి సంగీత పరంపరలోని వాడైన 'బిడారం కృష్ణప్ప' వద్ద ఆమె కర్నాటక సంగీతం నేర్చుకుంది. ఆ తరువాత కుటుంబ కలతల కారణంతో పుట్టలక్ష్మి, తన కూతురు నాగరత్నమ్మను తీసుకొని కంచీపురంలో నున్న తన దేవదాసీ కులానికే చెందిన ధనకోటి అమ్మాళ్ సంరక్షణలో కొంతకాలం ఉంది. ధనకోటి అమ్మాళ్ మరణించిన తరువాత తల్లీ కూతుళ్ళు బెంగుళూరు చేరుకున్నారు. అక్కడే త్యాగరాజ పరంపరకు చెందిన హైదరాబాదు మునుస్వామప్ప వద్ద నాగరత్నమ్మ వయొలిన్ నేర్చుకుంది. మైసూరులోని షిమోగాలో సెషన్స్ జడ్జిగా పనిచేస్తున్న నరహరిరావు ప్రాపకంలో ఆమె ఉండేది. అతనామెకు బెంగుళూరు పట్టణానికి దూరంగా ఉన్న ఒక కొండపై ఇల్లు నిర్మించి ఇచ్చాడు. ఆయన తన సహ మిత్రులను తోటి జడ్జీలను తీసుకొని ఆమె సంగీతం వినేందుకు వెళ్ళేవాడు. ఈ ప్రాంతాన్ని ఆనంద పర్వతమని ప్రజలు పిలిచేవారు. ఆ పేరు ఇప్పటికీ అలానే నిలబడి వుంది. ఆయన సాంగత్యంలో ఆమె రాణించింది. 1902 సంవత్సరంలో నరహరిరావు మరణించిన తరువాత సరియైన ఆశ్రయం లభించక నాగరత్నమ్మ శాశ్వతంగా బెంగుళూరు వదలి మద్రాసుకు చేరుకుంది. అప్పటికే మద్రాసులో నాగరత్నమ్మ పేరుతో మరో గాయని ఉండటంతో ఈమెను బెంగుళూరు నాగరత్నమ్మ అని పిలిచేవారు. ఆ విధంగా ఆమె పేరు బెంగుళూరు నాగరత్నమ్మగా స్థిరపడిపోయింది.

మద్రాసు వచ్చిన తరువాత ఆమె నాట్య ప్రదర్శనలు, పాటకచేరీలు చేసేది. లయజ్ఞానంతో, శాస్త్రీయంగా పాడే ఆమె పాటలు ప్రజలనెక్కువగా ఆకర్షించేవి. ఆమె కచేరీలో స్వర కల్పన కంటే రాగాలాపనకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చేది. హుందాగా తియ్యగా ఉండే ఆమె గాత్రం చాలా ఉత్తేజ పూరితంగా వుండేది. తన సంగీత జ్ఞానాన్ని ఎప్పటికప్పుడు ఇనుమడింప చేసుకోవాలనుకునేది. ఆమె నిత్య విద్యార్థిని. ఆమె అక్కడ పూచి శ్రీనివాస అయ్యంగార్ వద్ద శిష్యరికం చేసింది. ఈయన కూడా త్యాగరాజు పరంపరవాడే. ఆమెకు 26 సం॥ల వయస్సు వచ్చేనాటికి 146 పట్టణాలలో కచేరీలు చేసింది. తమిళ దేశంలో మొత్తం 1235 కచేరీలు చేసింది. సిలోన్, జాఫ్నాలో కూడా ఆమె కచేరీలు జరిగాయి. ఏకబిగిన మూడు, నాలుగు గంటలు పాడేది.

ఆమె సంగీత గురువులు త్యాగరాజ పరంపరకి చెందిన వారు కావటం ఆమెకు తెలుగు భాష తెలిసుండటముతో ఆమె తన కచేరీలలో ఎక్కువగా త్యాగరాజ కీర్తనలే పాడేది. ఆమె తన కచేరీలలో శ్రోతలతో పరిహాసాలాడటం, సమయ స్ఫూర్తితో చతురోక్తులు పలకటం పరిపాటి. ఆంధ్ర జమీందారులు ఆమె కచేరీలు లేని శుభకార్యాలు అసంపూర్తిగా వుంటాయని భావించేవారు. ఆమె తరచు బొబ్బిలి, వెంకటగిరి, నూజివీడు, తేలప్రోలు, విజయనగరం సంస్థానాలను సందర్శించేది.

నాగరత్నమ్మ తనకున్న సంస్కృత భాషా జ్ఞానంతో ధార్మిక ప్రవచనాలను సంగీత భరితంగా చెప్పేది. కొచ్చిన్ మహారాజు

ఆమె అనర్గళ ఉపన్యాస ధోరణిని మెచ్చి, అభిమానంతో బంగారు కంకణాలు, విలువైన శాలువాతో ఆమెను సన్మానించారు.

ఆమెను రాజమండ్రికి ఆహ్వానించారు. రైల్వే స్టేషనులో పండితులామెకు మెడలో కర్పూరమాల వేసి పద్యాలతో స్వాగతం పలికారు. 1905 నాటికి ఆదాయపు పన్ను కట్టేస్థాయికి ఆమె సంపాదన పెరిగింది. ఆభరణాలంటే ఆమెకు ఎక్కువ అభిలాష. వజ్రాల చెవి దుద్దులు, ముక్కుకు రెండు పక్కలా ముక్కు పుడకలు, కంఠాభరణాలు, దండ కడియాలు, వడ్డాణం, కాళ్ళ పట్టీలు, మెట్టెలతో ఆమె సర్వాంగ సుందరంగా తయారయి మాత్రమే బయటకు వచ్చేది. దాసదాసీ జనం తోడు పెట్టుకుని ఆమె ఎప్పుడూ గుర్రపు బండిలోనే ప్రయాణించేది. కాఫీ వున్న వెండి కూజా పట్టుకుని ఒకరు, మరొకరు వేణ్ణీళ్ళ పాత్రతో, ఇంకొకరు తమలపాకుల పెట్టెతో, తాటాకు విసన కర్రతో విసురుతూ మరొకరూ... ఇలా దర్జాగా జీవించేది.



నాగరత్నమ్మ

1905 సంవత్సరంలో గ్రామఫోనులు, వాటి రికార్డులు ప్రజలను విపరీతంగా ఆకర్షించాయి. గ్రామఫోనులో రికార్డు చేస్తే తమ గానం పాడవుతుందని కొందరు, ఇవి మంగళ షాపుల్లో, టీ బట్టీలలోనూ వేస్తారు కాబట్టి సంగీతపు పరపతి పోతుందని మరి కొందరూ రికార్డు ఇవ్వడానికి సుముఖంగా వుండేవారు కాదు. నాగరత్నమ్మ కూడా కొత్తలో ఇలానే అనుకున్నా తరువాత రికార్డులు ఇవ్వసాగింది. అవి జనాదరణకు నోచుకున్నాయి.

నాగరత్నమ్మకు దైవభక్తి ఎక్కువ. వెండిరేకు తొడుగుతోనున్న త్యాగరాజ స్వామి పటం ఆమె పూజ గదిలో ఉండేది.దాని దగ్గర రోజూ దీపం వెలిగించి కీర్తనలు పాడేది. 1921వ సంవత్సరంలో ఒక రాత్రి నాగరత్నమ్మకు త్యాగరాజు దీవించినట్లుగా కలగన్నది. మర్నాడు ఉదయమే ఆమె తొలి గురువు బిడారు కృష్ణప్ప నుంచి ఆమెకొక ఉత్తరం వచ్చింది. శిథిలావస్థలో మురికి వాతావరణంలో నున్న త్యాగరాజ స్వామి సమాధి గురించి చాలా బాధపడుతూ వ్రాశాడా ఉత్తరాన్ని. నాగరత్నమ్మ తిరువయ్యారు ప్రయాణమయింది. త్యాగరాజు సమాధి చూసినపుడు ఆమె పడ్డ వేదన అంతా ఇంతా కాదు. సమాధి బాగుకోసం తనజీవితాన్ని అంకితం చేయడానికి ఆమె నిర్ణయించుకుంది. అప్పుడు ఆమె వయస్సు 43 సంవత్సరాలు. ఇకనుంచి ఆమె దేవదాసి కాదు, త్యాగరాజు దాసి.

త్యాగయ్య సమాధి వున్న స్థలం ఒక మహారాష్ట్ర జమీందారి వంశస్థులది. అది ధార్మిక కార్యక్రమాలకు వాడాలి తప్ప అమ్మకానికి చెల్లదని తహసిల్దారు అడ్డుచెప్పాడు. అయితే ఆ భూమిని అంతే విలువగల భూమితో మారకం చేయవచ్చు.

నాగరత్నమ్మ తనకున్న సారవంతమైన భూమిని యిచ్చేసి ఆ స్థలానికి హక్కుదారయింది. ఆమె తిరువయ్యారు వచ్చిన వారానికే లావా దేవీలు పూర్తి చేసుకుని 1921 అక్టోబరు 27న సమాధి మీద ఆలయ నిర్మాణం మొదలు పెట్టింది.

ఆమె తిరువయ్యారు వచ్చేంత వరకూ రెండు వేర్వేరు వర్గాల వారు ఆరాధనోత్సవాలు జరిపేవారు. దానికోసం డబ్బులు వసూలు చేసేవారు. ఎప్పుడూ సమాధికోసం డబ్బులు మిగిలేవి కావు. సంవత్సరం పొడవునా సమాధి ముళ్ళకంపల మధ్య దుర్భేద్యంగా ఉండేది. ఆయన సంవత్సరీకం జరిగిన ఒక్క రోజు మాత్రం వెళ్లేందుకు దారి ఏర్పడేది. ఆమె తన ఆస్తినంతా ధారపోసి సమాధి కార్యక్రమం నిర్వహిస్తున్నా, పనులు ఊపందుకునే సరికి డబ్బు చాలేదికాదు. ఆమె సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తూ, అందులో వచ్చిన ప్రతి రూపాయి ఆలయానికే ఖర్చుచేసింది. ఒక సంవత్సరం పూర్తి కాకుండానే, ఆలయ పనులు ఒక కొలిక్కి వచ్చాయి.

1925 సం॥లో తిరువయ్యారు వచ్చిన వారు కావేరి నది ఒడ్డున కొబ్బరి చెట్ల నీడన నడుస్తూ సమాధి చేరుకోగలిగారు. ఒక్క సంవత్సరంలో ఎంత మార్పు! ఇప్పుడు ముళ్ళకంచల స్థానంలో చక్కటి ప్రహరీగోడ నిర్మితమయింది. ఎత్తు పల్లాలు లేకుండా నేల చదును చేయబడింది. చతురస్రాకారపు గుడిపై గుండ్రటి గోపురం నిర్మితమయింది. లోపలికి వస్తున్నపుడు విఘ్నాలు రాకుండా కాపాడడానికి భోగ గణపతి విగ్రహం ప్రతిష్ఠించబడింది. లోపలికి వస్తే

యోగాంజనేయులు చిన్నగుడి నిర్మితమయింది. సమాధికి వెళ్ళే దారిలో మిగిలిన సన్యాసుల బృందావనాలు చిన్నవి ఉన్నవి. 1925 జనవరి 7వ తేదీన దేవాలయాన్ని శుద్ధిచేసి త్యాగరాజ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠింప జేశారు. కన్నుల పండుగగా జరిగిన ఆ పూజా కార్యక్రమాలకు బ్రాహ్మణులు, దాతలు, పెద్ద పెట్టున హాజరయ్యారు. త్యాగరాజును స్తుతిస్తూ 108 పేర్లతో ఒక అష్టోత్తరాన్ని నాగరత్నమ్మ తయారుచేసింది. అది ఇప్పుడు అక్కడ నిత్యపారాయణ స్తోత్రమయింది.

ప్రముఖ పండితుడు, కీర్తనాచార్య సి.ఆర్. శ్రీనివాస అయ్యంగార్ నాగరత్నమ్మకు ఉత్తరం వ్రాస్తూ "ఏరాజుగాని, భూస్వామిగాని, గాయకుడుగానీ ఈ కీర్తిని దక్కించుకోలేదు. మా అందరి ధన్యవాదాలు అందుకోండి" అని వ్రాశాడు. ఆమె భక్తి, ఔదార్యాలను ఎందరో కొనియాడారు.

త్యాగయ్య ఆరాధనోత్సవాలలో రాజకీయాలు చోటు చేసుకున్నాయి. భక్తులు రెండుగా చీలిపోయి ఒకరిపై మరొకరు అభియోగాలు మోపుకుంటూ కోర్టుకు వెళ్ళి నానా హంగామా చేసేవారు. సమాధి వద్దకు స్త్రీలను రానివ్వకూడదంటూ పెరియకచ్చి వర్గం పేచీకి దిగింది. శూలమంగళం వైద్య నిధ భాగవతార్ సబ్ మెజిస్ట్రేటు ముందు ఇచ్చిన వాఙ్మూలంతో త్యాగరాజ సమాధిని కాశీలోని విశ్వనాథుడి శివలింగంతో పోల్చాడు. అక్కడిలానే ఇక్కడ కూడా లింగ కుల వివక్షలుండ కూడదని పేర్కొన్నారు. ఇంత జరిగినా లుకలుకలు కొనసాగాయి. వీలయినంత వరకూ స్త్రీలను దీనికి దూరం చేయాలనే ప్రయత్నం జరిగి, కొంతవరకు సాధించగలిగినా నాగరత్నమ్మ ముందు వారి ఎత్తులు పారలేదు. క్రమేపీ స్త్రీలు కూడా మగవారితో సమానంగా ఆరాధనోత్సవాలలో పాల్గొనటం ఇప్పుడు చరిత్రకాదు, వాస్తవం.

త్యాగయ్య సమాధి నిర్మించిన తరువాత నాగరత్నమ్మ జీవితం తిరువయ్యూరుతో ముడిపడింది. ఆరాధన ఉత్సవాల కోసం ఆమె కచేరీలు ఇస్తుండేది. సమయం దొరికినప్పుడు తిరువయ్యూరు వచ్చి సమాధి వద్దకు చేరుకునేది. 1933-35 ప్రాంతాలలో సమాధి చుట్టు పక్కల ప్రాంతాన్ని నాగరత్నం కొనటం మొదలుపెట్టింది. చిత్తూరు నాగయ్య నిర్మించిన 'త్యాగయ్య' సినిమాకు నాగరత్నమ్మ గౌరవ సలహాదారునిగా పనిచేసింది. నాగరత్నమ్మ ప్రతిఫలం నిరాకరించటంతో ఆమె తిరువయ్యూరులో దక్షిణంవేపు నున్న పెద్ద ఇల్లు కొనటంలో నాగయ్య ఆర్థిక సహాయమందించారు.

1952వ సంవత్సరంలో పండు ముదుసలిగా ఆమె రామనామం జపిస్తూ కన్ను మూసింది. ఆమె తనని త్యాగరాజ స్వామి సమాధికి కొంచెం దూరంలో సమాధి చేయవలసినదిగా తన వీలునామాలో పేర్కొంది. సన్యాసుల సమాధి వున్న చోట, ఒక స్త్రీని, అందునా ఒక దేవదాసిని సమాధి చేయడానికి సనాతనులు ఒప్పుకోలేదు.

త్యాగరాజు సమాధి వద్దకు ఆమె మృతదేహం ఊరేగింపుగా తీసుకొని వచ్చినపుడు కొంత గొడవ జరిగింది. ఆమె వ్యతిరేకులను నిరసిస్తూ దుకాణదారులు తమ షాపులను మూసి వేశారు. ఇక లాభం లేదని చివరకు ఆమె కోరుకున్నట్లే అక్కడ సమాధి చేయడానికి అందరూ అంగీకరించక తప్పలేదు.

తిరువయ్యూరులోని ఒక సన్యాసి నాగరత్నమ్మ సమాధి మీద ఆమె విగ్రహం పెట్టాలని తలపెట్టారు. త్యాగరాజుకు చేతులు జోడిస్తూ నమస్కరిస్తున్నట్లుగానున్న ఒక విగ్రహాన్ని తయారు చేయించి త్యాగరాజు సమాధికి ఎదురుగా ఉండేలా ప్రతిష్ఠించాడు.

త్యాగరాజు, నాగరత్నమ్మల సమాధులకి పది సంవత్సరాలుగా విద్యుత్ సరఫరా లేకపోయింది. ఆరాధన సమయాల్లో మాత్రమే మిరుమిట్లు గొలిపే కాంతితో వుండే ఆ సమాధులు మామూలు సమయాల్లో చిమ్మ చీకటిలో వుండేవి. 1962వ సంవత్సరంలో కోలార్ రాజం అనే దేవదాసి, చనిపోయిన తన పళని సుబ్రహ్మణ్య పిళ్ళే అనే మృదంగ విద్వాంసుడి జ్ఞాపకార్థం విద్యుద్దీపాలు పెట్టించింది.

నాగరత్నమ్మ మరణించిన తరువాత ట్రస్ట్ సభ్యులు ఒకరొకరుగా రాలిపోయారు. ఆమె ఇచ్చిన స్థిర, చరాస్తులు ఏమీ ఈనాడు ట్రస్ట్ అధీనంలో లేవు. బంగారు రేకుతో ఉన్న దేవతా పటాలు ఇప్పుడు కనిపించవు. త్యాగరాజు తన జీవిత కాలంలో దేవదాసీలను నిరసించినాడు. అతని ప్రత్యక్ష శిష్యులలో స్త్రీలు లేరు. ఆయన వ్రాసిన కీర్తనలలో కూడా ఆ ధోరణి ఉంది. అయితేనేం ఒక దేవదాసి మాత్రమే ఆయనకు నిజమైన నివాళి ఇవ్వగలిగింది.

*రాజులు ఆరాధించిరి,*
*సంగీత కళా విదులు అతని కీర్తనలు అమ్ముకొనిరి,*
*ఒక దేవదాసి కదా*
*ఆయనకు దేవాలయం నిర్మించినది!* మి

# తెలివి కొనడమా - తెలిసి కొనడమా

- సముద్రాల వెంకటకృష్ణ

ఆంగ్లములో education కు సరిపోయే పదము తెలుగు (ఇతర భారతీయ భాషలలో)లో కుదరదు. ప్రాచీన భారతములో నేర్చుకోవడము, తెలిసికోవడమే గాని పదిమందిని కూచోబెట్టి బలవంతంగా చదివించడము లేదు. 'చదువుకో, బాగా చదువుకో' అని తల్లి తండ్రులు, పెద్దలు చెప్పే రోజులు కావివి. చదివితే వచ్చేది 'తెలివి' అని భారతీయుల మూఢ నమ్మకమొకటుంది. కాబట్టి చదువు కొనడమంటే తెలివి కొనడమే. చదువుకోటమంటే తెలివి సంపాదించటం. ఈ రోజుల్లో చదువు అంగడి (లో కొనే) వస్తువు కదా అందుకని తెలివి కొనడమే సరి.

చదువుకొనడాని (education) కి తెలిసికొనటానికి తేడా చాలా ఉంది. చిన్న ఉదాహరణ. నాగు పాము కాటుకు విషమెక్కి చస్తారన్నది education చదువు. విషమెక్కితే ఎందుకు చావాలి. విషమేమి చేసి చంపుతుంది అని ప్రశ్నించి, ఆ విషయాన్ని కూలంకషంగా అవగాహన చేసికొనటం తెలిసికొనడం. అక్బర్, యోధ అనే హిందూ పిల్లని పెళ్ళి చేసుకొన్న విశాల మత హృదయుడన్నది చరిత్ర చెప్పే చదువు. ముస్లిం అయితే షరియత్ ప్రకారము హిందువును చేసికోకూడదు కదా, అంటే అక్బర్ ఇస్లాం వదిలి యోధను చేసికొన్నాడా లేక యోధను ముస్లిం చేసుకొన్నాడా? ఈ రెండిట్లో ఏదైనా చరిత్ర బాకా ఊదే విశాల హృద్యము అసంబద్ధాల చెత్తలో కలసి పోతుందని గ్రహించటమే తెలిసికొనడం. నమ్మడం లేక నమ్మింప చేయటం చదువు. తెలివి కొనటం ప్రశ్నించి, విశ్లేషించి నిర్ధారించడం తెలిసికొనటం. పదహారు ఐదులు ఎనభై అని తెలుసుకొన్న వాడు, పదిహేడు ఐదులు ఎనభై ఐదు అని గ్రహిస్తాడు. పదహారు ఐదులు ఎనభై అని తెలివి (చదువు) కొన్నవాడు, పదిహేడు ఐదులు మళ్ళీ కొనాల్సిందే. బుద్ధ భగవానునిది ఒక సిద్ధాంతముంది. దానిని determinism అని వ్యవహరిస్తారు. సిద్ధాంతాన్ని విశదీకరించడానికాయన ఒక దృష్టాంతమిస్తాడు.

ఒక పెద్ద ఉపన్యాస మందిరమును ఊహించుకోండి. చాలా ఎత్తయినది. దాని కప్పునుంచి బోలెడు చక్కగా, పూర్తిగా ప్రతిబింబింప చేసే అద్దాలు వేలాడదీసారు. ఇప్పుడు ఆ హాలులో ఎక్కడైనా ఒక్క చోట నిమిషం మాత్రం ప్రకాశం కలిగిందనుకోండి. ఆ వెలుగు అనేకమైన అద్దాల ద్వారా ప్రతిబింబింపబడి సభా మందిరమంతటినీ, ఎల్లప్పుడూనూ ప్రకాశింపచేస్తుంది. దీనిని ఆయన ఇంద్రజాలమన్నారు. భగవానుడు దీనిని సృష్టిలోని ప్రతి అంశం, ప్రతి ఇతర అంశం పైన ప్రభావము చూపిస్తుంది. సృష్టిలో ఏదీ తనకై తాను ఉండదని చెప్పటానికి చెప్పారు. మనము చదువు కొనటానికి తెలిసికొనటానికి అంతరము చెప్పటానికుపయోగిస్తాము.

హాలు ఒకడి మనసనుకోండి. అందులో తెలిసికొన డానికి ప్రయత్నము జరుగుతుంటే, అంటే మనసులో ఒక్కసారి ఒక్క చోట ప్రకాశం కలిగిందనుకోండి. అంటే ఆ మనసులో ఒక్క క్షణము సత్య దర్శనమైనదనుకోండి. ఇక అది ఆరని తరగని నిరంతర జ్వాలగా నిలచిపోతుంది మనసంతా వెలుగుతో నిండుతుంది. దీనిని నిర్వాణమనండి, మోక్షమనండి, నిత్యమైన ఆనందమనండి. పేరేదైనా, స్థితి ఒక్కటే. పండు వెన్నెల వంటి నిండు వెలుగే. ఆ ప్రకాశం కలగటం కలిగించటమే తెలిసికొనడమంటే. అట్లా కాకుండా ప్రతి మూడడుగులకు ఒక దీపం పెట్టి, వాటన్నిటికీ నూనెలూ వత్తులూ, స్విచ్చులూ ఇవన్నీ కల్పించడము తెలివి కొనడమే.

చదువు లేక తెలివి కొనడం అనే ప్రక్రియకు రెండు వస్తువులు కావాలి. ఒకడు కొనేవాడు, రెండు అమ్మే వాడు. అమ్మే వాడిని టీచర్, కొనేవాడిని స్టూడెంట్ (తెలిసికొనడంలో

డా॥ సముద్రాల వెంకటకృష్ణ, ఫోన్ : 9490743829

వీరిద్దరినీ గురు శిష్యులనాలి). అంటే తెలివి కొనడమే ఒక బైనరీ ప్రాసెస్. ఇందులో తెలివి, చదువు బయటనుంచి టీచర్ స్టూడెంట్ లోపలికి తోయటమే సాఫల్యము. ఎంత లోపలికి వెళ్ళిందో కొలవటమే అసెస్‌మెంట్. సామాన్యంగా ఈ కొలత అతి అశాస్త్రీయంగా జరుగుతుంది. ఎంత అధ్వాన్నమంటే లోపలికి తోస్తున్నపుడు శరీరమున్నదంటే అందుకు కూడ కొంత విలువిస్తారు. లోపలికి ప్రవేశింపచేసిన దానిలో ఎంత స్టూడెంట్ బయటకు కక్కగలడో అదీ కొలతే. ఈ కక్కు (ఇందాకటి శారీరక) ఉర్తి (ఉండటము) కలసి కక్కుర్తియే మానము. లోపలికి తోసిన దానితో స్టూడెంట్ ఏమి చేస్తాడు అన్నది అసెస్‌మెంట్ పరిధిలోకి రాదు. ఈ అస్తవ్యస్థ వ్యవస్థను 'ఎడ్యుకేషన్ సిస్టమ్' అంటారు. మనదేశంలో దీనిని ప్రవేశపెట్టిన ఘనత మెకాలే అనే ఆంగ్లేయునిది, దాదాపు 200 సంవత్సరాల క్రిందట.

దీనిలోని ముఖ్యలోపము 200 ఏళ్ళనుంచీ ఇందులో ఏ మాత్రము క్రియాశీలక మార్పు లేకపోవటమే. మెకాలే బ్రిటిషు (పాలక వర్గము) వాడు. ఆయన విద్యా విధానపు ఉద్దేశము ఒకటే. వీలైనంత మటుకు స్వంతంగా ఆలోచించి తెలుసుకొనే నేర్పు ప్రజలలో (భావితరాలలో) నశింపచేసి బానిస ప్రవృత్తి ప్రబలిన బిచ్చగాళ్ళ దేశంగా భరతాన్ని తయారు చేయడమే. ఆయన సఫలీకృతుడవటానికి ఈ రంగంలో మన అధోగతికి కారణం అప్పటికీ, ఇప్పటికీ మారని మనస్తత్వమే. మెకాలే కాదు. పది బిజినెస్ స్కూళ్ళు, ఐఐటీలు కాదు లెక్క తాలూకాకు, మండలికి ఒకటి చొప్పున వెలసిన యూనివర్సిటీల గతి ఏమిటి? వాటిని లెక్కలోకి తీసుకో కూడదంటే మరి ఎందుకు దండగ ఖర్చు పెడుతున్నారు ప్రజల సొమ్ము? ఏ వ్యవస్థ అయినా దానిలో పనిచేసే వారెంతో అదీ అంతే. మన దేశంలో గురువు అంటే ఎప్పుడూ భక్తి గౌరవాలెక్కువే. ఇట్లాంటి చోట 'బతకలేక బడి పంతులు' అన్న వెక్కిరింపు పుట్టిందంటే తెలివి కొనే వ్యవస్థ ప్రజలలో ఎంత చులకనయ్యిందో తెలుస్తుంది. కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, స్కూటర్ మెకానిక్కులు కూడా గౌరవింపబడుతారు. వారి దగ్గర పని నేర్చుకొనే వారిచేత కాని ఒక గణిత శాస్త్రీయుడు, ఒక తెలుగు భాషా పండితుడు మాత్రం బతకలేని బడిపంతులే. నాకు 5 ఏళ్ళ వయసప్పుడనుకొంటా మా నాల్గవ తరగతి టీచరు కాండూరి అప్పలాచార్యులు, కందుకూరులో ఇట్లా అంటుంటే విన్నాను. “ఆ పెద్ద చదువులెందుకండీ, పెద్ద చదువులతో పెద్ద ఉద్యోగాలు చేయాలి. అంటే పెద్ద పెద్ద బాధ్యతలు వాటితో పాటు పెద్ద కష్టాలు. ఇదైతే ఇంటిపక్కన బడి, ఇంట్లో పెళ్ళాం సరిపోయింది.” ఆ వయసులో కూడా నాకు ఆ మాటలు వికారం కలిగించాయి. మన దేశములో చాలా మందిది ఇదే ధోరణి. అందుకనే ఉన్న ఊళ్లో బడి పంతులైతే ఊరి బయట పొలానికి ఊళ్ళో ఇల్లాలికి కావలా ఉండవచ్చని మాష్టారుద్యోగము చేసేవారు. ఎక్కువ కావలసినది వాపోవటము కాదు. పరిస్థితిని విశ్లేషించి మనవంతు దోషము లేకుండా చేసికొనడము.

“ఆ పెద్ద చదువులెందుకండీ, పెద్ద చదువులతో పెద్ద ఉద్యోగాలు చేయాలి. అంటే పెద్ద పెద్ద బాధ్యతలు వాటితో పాటు పెద్ద కష్టాలు. ఇదైతే ఇంటిపక్కన బడి, ఇంట్లో పెళ్ళాం సరిపోయింది.” ఆ వయసులో కూడా నాకు ఆ మాటలు వికారం కలిగించాయి. మన దేశములో చాలా మందిది ఇదే ధోరణి.

Education కు వయసు నియమాలు, పరిమితులు ఉన్నాయి. ఇప్పుడే చదివా పేపర్లో. ఒకబ్బాయికి ఎంసెట్‌లో మంచి రాంకు వచ్చినా, తక్కువ వయసని కౌన్సలింగ్‌కు రానివ్వలేదట. ఎవరినైనా బలవంతముగా తీసుకువచ్చి, కూచోబెట్టి పది పదిహేనేళ్ళ తర్వాత ఒక కాగితము ముక్క అదే డిగ్రీ ఇచ్చి వాడి మీద ఎడ్యుకేటెడ్ ముద్ర వేయొచ్చు. వాడికి చెప్పిందాంట్లో 35% గుర్తుంటే చాలు. అది కూడా జీవితాంతమక్కర్లేదు. ఆ గుర్తున్నది జీవితములో ఎక్కడా ఉపయోగించక పోయినా నో ప్రాబ్లమ్. అసలు చదువు కొనే వ్యవస్థలో కొన్న చదువుకి జీవితానికి సంబంధముంటే కదా. బోధన విషయము స్టూడెంట్ సక్తాసక్తముల టీచర్ ప్రతిభా పాటవాలపై కాకుండా వేరే ఏదో సంస్థ నిర్దేశితమయి ఇటు టీచరుకు, అటు స్టూడెంట్‌కు కూడా నిరాసక్తికరముగా ఉంటాయి. మారుతున్న సమాజపు అవసరాలనేవి పట్టించుకోవు. తద్వారా స్టూడెంట్‌ను భావి తరానికి ఉపయుక్తంగా చేయటంలో ఘోరంగా విఫలమవుతున్నాయి. సామాన్యంగా చేరే స్టూడెంట్స్ వారు కొనే చదువుమీద ఆసక్తి ఉత్సుకతో కాక కొన్ని ఇతరమైన అవసరాలకోసం చేర్తారు. వారిని గేటు వద్ద నిలిపి వడపోయటానికి చట్టంతో సహా కోటి అవరోధాలు. విద్యాలయాలు కూడా తరగతి గదులు

నింపి ఆర్థిక లాభాలపైన దృష్టి ఉంచి వ్యవస్థను అధ్వాన్నము చేస్తున్నాయి. విద్యార్థి సక్తత, ఉత్సుకత పరిగణలోనికి రాదు. ఏవో కంటి తుడుపు పరీక్షలు పెట్టినా, వాటిలో నెగ్గకు రావడానికి కోటి సులువులున్నాయి. అసలీ పరీక్షలు కూడా ఛాన్స్ మీదే ఆధారపడతాయి. తెలివి మీద కాదు 2 గంటలలో 150 గణిత శాస్త్రపు సమస్యలకు సమాధానాలివ్వమనటము ఎంత సమంజసము? వీటి ఉద్దేశము ఎంపిక కాదు తిరస్కరణమే.

కొన్ని వృత్తిపర విద్యాసంస్థలు తప్ప మిగతావన్నీ పాఠ్యాంశాల మీద శీతకన్నే. దశాబ్దాల తరబడి మెరుగు బడని పాఠ్యాంశాల (సిలబస్) కు కారణం టీచర్లు విషయపరంగా మెరుగు పడక పోవటమే. కొత్త విషయాలు చేర్చి దానికోసమై శ్రమించడమెందుకు మన జీవితం మనది. మనల్ని ఎవరూ ఏమీ చేయలేరన్న ధీమా. అసలు విశ్వవిద్యాలయాలలో టీచర్లుగా చేరటానికి కారణాలు శిక్షక వృత్తిలో ఆసక్తి తప్ప ఇతరమేదైనా అవ్వవచ్చు. ప్రొఫెసర్ మన వూరివాడనో, వీసీ మన కులము వాడనో, ఇందులో ఉంటే వేరే వ్యాపారాలేవైనా చేసికొనవచ్చు ననో, రాజకీయాలలో రాణించ వచ్చునో, ఇలా వీటికి తోడు కులాల మతాల పేరిట అరక్షణలు. ఇవన్నీ పోను ఉపాధ్యాయ వృత్తిపై అంకిత భావమున్న వారు వందకు ఒకరు కూడా ఉండరు. ఆ ఉన్న ఒక్కడూ సింహాల మధ్య చిక్కుకున్న జింక పిల్ల వలె బిక్కు బిక్కు మనాల్సిందే.

విద్యార్థిని అంచనా వేసే విధానము గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత పరువు. సమవర్తిత అంచనా ఉత్తమము. కొన్న చదువును ఎంత చక్కగా వినియోగిస్తాడన్న దానిని బట్టి చదువు కొన్న వాడిని అంచనా వేయటము సరియైన విధానము. కానీ మన దేశములో ఇది అసాధ్యము. తక్కువ వచ్చిన వాడు కులాలను మతాలను తెచ్చి ఆ టీచర్ దుంప తెంపుతాడు. అందుకే కోడింగు, డీకోడింగు, ఎక్స్టర్నల్ పేపర్ సెట్టింగు, డబుల్ వాల్యూషన్, చెత్త చెదార మన్నీను. అక్కడ వాడేమి చెప్పాడో మనకెందుకని ఆ బయట వాడు మూసలోని ప్రశ్న పత్రమిస్తాడు. దానికి అతి మోసమైన జవాబులు వ్రాస్తారు. నేను స్వయంగా అనుభవించిన సత్యము. గణిత శాస్త్రంలో ఒక విద్యార్థి షిరిడీ సాయి బాబా చరిత్ర మాత్రమే వ్రాస్తే ఒక ఆయన 0 ఇస్తే, రెండో ఆయన 45 ఇచ్చారు. పునః పరిశీలనకు నా దగ్గరకు వచ్చింది. వీసీకి చూపించాను. ఏమీ జరగలేదు. 45 ఇచ్చినాయన ఇప్పుడు ప్రొఫెసరూ, ఎల్లుండి వీసీ కూడా అవుతాడు. ఒకబ్బాయి మా అమ్మాయి క్లాస్‌మేటటా. నా దగ్గరకు వచ్చి మా తమ్ముడు బీహార్‌లోని ఒక యూనివర్సిటీలో ఇరవై వేలిచ్చి బీకామ్ డిగ్రీ తెచ్చుకున్నాడు. అది సరయినదా కాదా అని ఎట్లా తెలుస్తుంది అని అడిగాడు. ఆ యూనివర్సిటీ వీసీ నాకు చాలా బాగా తెలిసిన వాడే, నేనేమి చెప్పాలి. ఇదీ తెలివి కొనడము.

ఇక తెలిసికొనడము ఐచ్ఛికము. ఇష్టము ఉత్సుకతలేని వానిని బలవంతంగా ఏ విషయమూ తెలిసికొనేట్లు చేయలేము. తెలిసికొనటము, నేర్చుకొనటము ఒకటి అదే ఙాత్వము. తెలిసికొన్నదానిని జ్ఞానమంటారు. ఇది జీవి పుట్టినప్పటినుండి మొదలవుతుంది, చచ్చే దాకా జరుగుతూనే ఉంటుంది. దీనికి టీచర్, స్టూడెంట్ అనే రెండు వస్తువులక్కర లేదు. తెలుసుకొనే వాడొక్కడే చాలు. ఆ విధంగా ఇది యూనరీ ప్రొసెస్. జ్ఞానార్జనకు మొదటి మెట్టు జిజ్ఞాస. అది కలిగించి జ్ఞానార్జనలోకి ప్రవేశపెట్టేందుకు ఒక వ్యక్తి లేక సంస్థ కారణ భూతుడవవచ్చు. ఆ సంస్థ గురువౌతుంది. గురువు దగ్గరకు చేరి జ్ఞానార్జన చేసే వారిని శిష్యులంటారు. శిష్యుని అర్హతలు ఉత్సుకత, శ్రద్ధయే కాక, తెలిసికొన్నదానిని సంఘమునకు మంచి చేయటానికుపయోగించవలెనన్న గాఢమైన కోరిక మాత్రమే. గురువైన వారు వీటిని మాత్రమే పరిగణనలోకి తీసుకొంటారు. వయసు ఇతర భౌతిక విషయాలు తెలుసుకొనడములో అనవసరము. అడ్డు గోడలు కావు. ఈ సూత్రము పాటించని వాడు గురువు కాదు. తెలిసికొనుటను క్లుప్తంగానూ కూలంకషంగానూ కూడా చెప్పేది.

**తద్విద్ధి, ప్రణిపాత్ ఏన, పరిప్రశ్నే స, సేవయా**
**ఉపదేక్ష్యంతి తే జ్ఞానమ్ జ్ఞానినః తత్వదర్శినః** *(భగవద్గీత 4.34)*

తెలిసికొనడము (విద్ధి) ఒక త్రయము. అందులో మొదటిది *ప్రణిపాతేన.* అంటే తెలిసికొనదలచిన విషయానికి ఏ విధమైన సంకోచము లేకుండా దాసుడవటము. రెండవది పరిప్రశ్నేన. ఇది చాలా ముఖ్యం. గురువు దైవమని భావించి ఆయన ఏమిచెప్తే అది విని తల ఊపటంవల్ల తెలిసికొన లేరు. అట్లా గురువుని ప్రశ్నించక పోవడము విధేయత కాదు. సందేహములు వచ్చేట్టు చేయడము గురువు బాధ్యత. అవి అడిగి తెలుసుకోవడము శిష్యుని విధి. ప్రశ్నల ద్వారానే శిష్యుడెంత మాత్రము ఆకళింపు చేసుకొన్నాడో గురువుకు తెలుస్తుంది. కొత్త కొత్త విషయాలు బోధించటానికి అవసరము,

అవకాశము కలుగుతాయి. ఇది తెలుసుకొనడానికి అడ్డదారి కాని దగ్గర దారి. ఇక మూడవది సేవయా. ఇక్కడ సేవ అంటే గురువుగారికి కాళ్ళు పిసకడము, ఆయన భార్యకు వంట పనిలో ఇంటి పనిలో సహాయము చేయటము కాదు. తను గ్రహించిన దానితోటి తనను గురువునూ, తద్వారా తెలిసికొనే వ్యవస్థనూ పోషించే ఈ పర్యావరణ సంఘానికి, తనవంతుగా మంచి చేయటమే సేవ. ఇదే గురుదక్షిణ. మధ్యతరములో ఇది విపరీతార్థాలకు లోనై బొటన వేళ్ళడగటము వంటి వికృత రూపాలు దాల్చింది. చేసిన సేవ, వేసిన ప్రశ్నలే గురువు శిష్యుడిని అంచనా వేయటానికి ఆధారాలు. ఈ పద్ధతిలో సిలబస్ శిష్యుడి ఉత్సుకతను బట్టి అంటే వేసే ప్రశ్నలను బట్టి, పెరుగుతుంది. ఎవ్వరికి దేనిపై నేర్పు ఓర్పు ఉందో దాన్నిబట్టి పాఠ్యాంశాలు మారుతాయి. మూసలకు మోసాలకు తావులేదు. అర్హతలేని గురువులుండరు. ఆసక్తిలేని శిష్యులు చెల్లరు. ఒకసారి తెలిసికొని గురువుచేత అహో అనిపించుకున్న శిష్యుడు, తనంతట తానే నేర్చుకొనే శక్తి కలిగి ఉంటాడు. ఇంకొకరికి నేర్పేందుకు మళ్ళీ టీచర్స్ ట్రైనింగ్ కోర్స్ వంటిదేమీ చేయక్కరలేదు.

> జీవితాన్ని అంకితము చేయటమంటే తిండి తిప్పలు మానేసి, పెళ్ళాం పిల్లల్ని వదిలేసి అని కాదు. అనుభవించాల్సినవి అనుభవిస్తూ, వాటి తాలూకు అనుభూతులు మరల మరల స్మరించుకోకుండా తన అన్వేషణలో తను సాగటమే అంకితమంటే.

తెలివి (చదువు) కొనడము వల్ల, కొన్న దాని విలువ రూపాయలలోనే ఉంటుంది గానీ, దాని మంచి చెడులు పట్టించుకొనే మనో సిద్ధి రాదు. వ్యాపార ధోరణి పెరుగుతుంది. జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని వ్యాపార పరముగా చేయటం చేటు మార్గం. అణుశక్తి గురించి పూర్తిగా తెలిసికొని ఉంటే దాని వలన కలిగే హాని గురించి కూలంకషంగా ప్రశ్నించి అవగాహన చేసికొని ఉంటే, నాగసాకీలు, హిరోషిమాలు, చెర్నొబిల్లులు ఉండేవి కావు. మనకు, ఇప్పుడో, ఇంకాసేపట్లనో పేలే అణు బాంబుల బుట్టపై కూర్చుని ఉండే స్థితి వచ్చేది కాదు. మైక్రో బయాలజీ, బయోటెక్నోలజీలు ఏ ప్రళయము సృష్టిస్తాయో ఎవరికెరుక. ఇది వరకు ఫ్రాంకెన్ స్టీన్ సినిమాలు వచ్చేవి. వాటిల్లో మాదిరి దూర నియంత్రిత జీవులను, క్లోనులను తెలివి కొని పుట్టించవచ్చు. వాటివల్ల అనర్ధ మాపడమెట్లాగో, తెలిసికొంటే గాని తెలియదు. ఎయిడ్స్, చికెన్ గునియా, హిని ఇత్యాదులు చదువుకొన్న మైక్రోబయాలజీ పుణ్యాలే. పీటర్ అసిమోవ్ కథ ఒకటున్నది. అందులో కొన్ని తరాల తర్వాత మానవుడు రెండు సంఖ్యలను గుణించడము కంప్యూటర్ లేకుంటే అసాధ్యమన్న స్థితికి చేరుకొని, అట్లా చేయగల ఒక మనిషిని అతి జీనియస్‌గా గౌరవిస్తారు. నరులు తెలివి కొంటూ పోతుంటే అది నిజమౌతుందనిపిస్తుంది. ఏదో ఒక స్టేజిలో చదువుకొనడము తెలిసికొనడముగా మారాలి. అట్లా కానప్పుడు, కాలేకపోయినపుడు, ఆ కొన్న చదువు దండగే. సమయమే కాదు, డబ్బులు కూడా వృథా. నిజమే టన్ను మట్టిలోంచి ఒక ఔన్స్ బంగార మొస్తుందంటారు. కానీ గమనించాల్సిన విషయము ఎక్కడంటే అక్కడ టన్ను కాదు పది టన్నుల మట్టి తీసినా వీస మెత్తు బంగారం రాకపోవచ్చు. బంగారం దొరికే మట్టి ఏదో తెలిసికొని అక్కడ తవ్వాలి. కానీ ప్రతి వాడికీ డిగ్రీ రావాలి అనే అత్యుత్సాహము హానికరము. ఈ రోజుల్లో ఎమ్.బి.బి.ఎస్., ఐ.ఐ.టి. వంటి వాటిల్లో సీట్లు దొరకడమెంత కష్టమో అందరికీ తెలుసు. చేరిన ఒక్కొక్క విద్యార్థి పైన ప్రభుత్వ మెంత ఖర్చు పెడుతుందో చాలా మందికి అంచనా ఉండక పోవచ్చు. ఒక విద్యార్థి, చదువయ్యాక వైద్యుడై సేవ చేస్తాడని అనుకుంటే, ఆ విద్యార్థి బల్లపై ఆపరేషన్ చేస్తే వచ్చే దానికంటే బల్ల కింద చేయి పెడితే వచ్చేది సులభం, సుఖదం అని ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్. లాంటి వాటికి చేరే వారు కొన్న చదువును దండగ చేస్తున్న వారిలో ప్రథములు. దీని గురించి శ్రీకృష్ణుడు **"స్వధర్మే నిధనమ్ శ్రేయః, పరధర్మో భయాపః"** అన్నాడు.

కొన్న తెలివి నుంచి అంటే తెలివికొనడము నుంచి తెలిసికొనడము సాధ్యమా? సాధ్యమే అని ఐరోపా, అమెరికా దేశాలు ఋజువు చేసాయి. కాకపోతే కోటి మంది చదువుకొన్న వాళ్లనుంచి ఒకరిద్దరు తెలిసికొన్న వారు మాత్రమే ఉద్భవిస్తారన్నది మరువరాని సత్యము. దీనినే శ్రీకృష్ణుడు –

**మనుష్యాణామ్ సహస్రేషు కశ్చిత్ యతతి సిద్ధయే**
**యతతామపి సిద్ధానామ్ కశ్చిన్మాం వేత్తి తత్త్వతః** (భగవద్గీత, 7.3)

అన్నాడు. ఈషో (యెషువా లేక జీసస్) కూడా ఇదే మాట 'గాస్పెల్ ఆఫ్ థామస్'లో అన్నాడు. ఇది ఎందుకంటే తెలిసికొనడానికి అంతరంగములోనే వాతావరణం అనుకూలించాలి. అనువైన వాతావరణం తనే సృష్టించు

కోవాలి. తెలిసికొనడము లోపలినుంచి బయటకు వచ్చే ప్రక్రియ, చదువు మాదిరి బయటనుంచి లోపలికి తోసేది కాదు. అందుకోసము వ్యవసాయాత్మక బుద్ధి కుదుర్చుకోవాలి. ఇదే సాధన. ఇక్కడే చిక్కు చదువు కొనడములో లాగా ఒకటో, రెండో డిగ్రీలు సంపాదించి ఇహ అయిపోయింది అనటానికి తెలిసికొనడములో వీలుకాదు. ఎంత తెలిసికొంటే అంత మిగిలి ఉందనిపిస్తుంది. అంటే తెలిసికొనడములో జీవితాన్ని అంకితము చేయాల్సి వస్తుంది. అది ఎంతమంది చేయగలరు. చేయగలవారు వేటూరు కవి చెప్పినట్లు 'ఋషులవుతారు, మహాపురుషులవుతారు." జీవితాన్ని అంకితము చేయటమంటే తిండి తిప్పలు మానేసి, పెళ్ళాం పిల్లల్ని వదిలేసి అని కాదు. అనుభవించాల్సినవి అనుభవిస్తూ, వాటి తాలూకు అనుభూతులు మరల మరల స్మరించుకోకుండా తన అన్వేషణలో తను సాగటమే అంకితమంటే. సహజమైనవాటిని బలవంతంగా అణచి వేస్తే మనసు వాటి వెనకాలే తిరుగుతుంది. కాని అంకితమవదు. అటువంటి వారిని మిథ్యాచారులంటారు. వారు దేనినీ తెలిసికోలేరు. ఏ గమ్యమూ చేరకుండా "వాయుర్నావమ్ ఇవ అంభసి" అవుతారు. కనుగొన్న విషయాన్ని నిజ జీవితంలో అమలు జరపడం లేక ఉపయోగించడం వల్లనే తెలివి తెలుసుకొనటానికి అనువునైన పరిస్థితి కలిగిస్తుంది. అట్లా కాకుండా కొన్న చదువొక దారి, జీవితమింకొక దారి అయితే, అటువంటి వాడెప్పటికీ తెలిసుకోలేడు. అజ్ఞానం, తెలిసికొనకపోవటం ఒక వరమనుకొనే వారు లేకపోలేదు. బహుశా వారిదే మెజారిటీ ఏమో. తెలిసికొనే వాడికి బాధ్యత పెరుగుతుంది. దానితోపాటు సమస్యలు, కష్టాలు హెచ్చవుతాయి. వెరసి తెలుసుకొనడమనేది రాజీలేని, రాజీపడని జీవన విధానము. కాబట్టి జీవితాంతము అంతరాత్మ తోటి, బాహ్య ప్రపంచము తోటి జరిగే నిత్య సమరముల కలయిక. ఒక్కొక్క సమరము గెల్చిన కొద్దీ అంతిమ విజయానికి చేరువౌతాము. అప్పుడు గానీ తుది మజిలీలో జెండా పాతలేము. తెలుసుకొనడములో చేరువవటమే కృతకృత్యత్వము.

---





మిసిమి
మాసపత్రిక

చందాదారులుగా చేర్పించండి

# బహుమతి

పొందండి!

**మీ** ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవే కదా. మీకు ప్రియమైన వారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యం కదా. వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెల నెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. మీరు కోరిన గ్రంథాలయానికి, లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం **మిసిమి**కి చందా **₹200** పంపండి (వారి పూర్తి చిరునామాతో). ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపికచేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీరు ఇచ్చిన చిరునామాకు నెల నెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే – మంచి సారస్వతంతో...

**ఈ క్రింది పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి**

| | | ₹ |
|---|---|---|
| 1. | వేమన - *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 2. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 3. | VEMANA - Through Western Eyes - *V.R. Narla* | 50.00 |
| 4. | THE FIRST POETICAL READER (Walter Joyes and N.C. Sashacharloo) | 50.00 |
| 5. | వేమన ఉపదేశామృతం – *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |
| 6. | జాతక కథలు – *శివశంకర స్వామి* | 60.00 |
| 7. | తెలుగా, ఆంధ్రమా? – వాగరి | 40.00 |
| 8. | అమాహ (కథలు) వి. అశ్వినీకుమార్ | 60.00 |
| 9. | అంతర్వీక్షణం (వ్యాసాలు) " " | 60.00 |
| 10. | నాలో నేను (కవితలు) " " | 60.00 |

**మీ చందా మిసిమి పేర ఈ క్రింది చిరునామాకు పంపండి**

మిసిమి
మాసపత్రిక


**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
Visit us at : www.misimi-monthly.com

# రుద్రగణిక

- నటరాజ రామకృష్ణ

ఇదొక నూతన సమాసంగా మనకు కనిపించవచ్చును. తెలుగు కళాభాషలో ఇంతకు పూర్వం ఎవ్వరూ చేయని ప్రయోగంగా కనిపించవచ్చును.

కళా ప్రపంచంలో రుద్రరూపం అతి ప్రాచీనమైంది. ప్రణవ, ప్రణయ, ప్రళయ స్వరూపుడు రుద్రుడు. ఈ మూడింటి మూల స్వరూపంగా ఈ రుద్ర రూపాన్ని మన పూర్వులు భావించేవారు. సృష్టికి ఏ రూపం మూలకారణమో, సృష్టి వికాసానికి ఏ రూపం కారణభూతమో, సృష్టిలయలకు ఏ రూపం ప్రధానమో ఈ మూడింటికి కర్త అయినటువంటి వాని సమన్వయ రూపమే రుద్ర రూపం.



నాదరూపంలోను, శబ్దరూపంలోను, అక్షర రూపంలోను ఈ రుద్ర రూపాన్ని ఆరాధించిన స్త్రీ కళాకారులే రుద్ర గణికలు. సకల విద్యాపారంగతులు ఈ రుద్రగణికలు. తమ కళలతో సర్వేశుని ఆరాధించిన వారు వీరు. నృత్త, గీత, వాయిద్యాల సంపూర్ణ సమన్వయ స్వరూపం సంగీతం. ఆ సంగీత కళను ఆరాధించి, అనుభవించి, ఆనందించి, ఆ యానందాన్ని, ఆ రసానుభూతిని లోకానికి పంచిపెట్టినవారు రుద్ర గణికలు. వీరు దేవుని సేవకు, కొలువుకు అంకితమైనట్టివారు, వీరినే దేవ నర్తకులంటారు.

“దేవదాసి” అన్న పదం అర్వాచీనమైనది. ఇది మన భాషలోకి వచ్చి కొద్దికాలమే అయింది. అంతకుముందు గణికలు, సానులు అన్న పదాలే మన భాషలో ఉండేవి. ‘స’ నుండి ‘ని’ వరకు గల సంగీత విద్యలో నిష్ణాతులైన వారినే ‘సానులు’ అనేవారు. సాని అన్నది ఒక బిరుదు వంటిది. మన తెలుగు దేశ కళాకారులకే కాక కర్నాటక, మహారాష్ట్ర కళాకారులకు గూడ ఈ బిరుదు ఉండేది. రానురాను ఈ బిరుదు ఒక కులాన్ని తెలిపే పదంగా రూపొందింది. ఆ తర్వాత ఒక న్యూన పద అర్థాన్ని వ్యవహారంలో సంతరించుకొంది.

పూర్వం ఆలయ దైవారాధనలో వీరు పాల్గొనేవారు. బసవులు, పార్వతులు, ఎల్లమ్మలు, జోగులాంబలు వేరు, గణికలు వేరు. వీరిలో హరిజన తెగకు చెందిన జోగువారిలో కొందరు నృత్యం చేసేవారు. మిగిలిన వారు గణాచారులుగా జీవించేవారు. హరిజన తెగలవారికి వీరి ఆటపాటల ద్వారా వినోదాన్ని చేకూరుస్తూ డబ్బు సంపాదించుకొనేవారు. మిగిలిన వారికి ఈ కళలతో ఎటువంటి సంబంధం ఉండేది కాదు.

సుమారు 16 నుండి 20 రకాల నాట్యాలను ఈ జోగువారు ప్రదర్శించే వారు. వీరి నాట్యాలకు డప్పులు ప్రధాన వాయిద్యాలు. వీరివన్నీ లయ విన్యాస నాట్యాలే. వీరి నాట్యాలకు పాటలుండేవి కావు. ముఖ్యంగా 3, 4 అక్షరాల తిశ్ర, చతురశ్ర, మిశ్రగతుల్లో వీరు నృత్త మాడేవారు. అందువల్ల లయ ప్రాధాన్యంగల అంగ విన్యాసాలు మాత్రం వీరి నాట్యాలలో ఉండేవి. వీరికి తాళాల పేర్లు తెలిసేవికావు. ఆయా మాటలపేర్లు చెప్పి, ఆ డప్పులవారు వాయించే లయకట్టు స్వరాలకు తగ్గట్టుగా నాట్యం చేసేవారు. ఒక ఆటకి, వేరొక ఆటకి మధ్య పల్లవి, జతుల్లో తేడాలుంటాయి. ధ్వనిలో తేడాలుంటాయి. ఈ తేడాలను మనం గుర్తించకపోతే అన్నీ ఒక్కలాగ కనబడతాయి. కానీ అన్నీ ఒక్కటి కావు. ఇవి వేర్వేరయినవి.

అమ్మవారిని ఆదిశక్తి అంటారు. ఆమె త్రినేత్రాలుగల పరాశక్తి. తన యోగశక్తివల్ల త్రిమూర్తులను సృష్టించ గలిగింది. వీరిలో ఇద్దరు పెండ్లి చేసుకొనడానికి ఇష్టపడలేదు. అందువల్ల ఆమె తన మూడవ నేత్రాన్ని తెరచి వీరిని భస్మం చేసింది. మూడవ వాడు తెలివైనవాడు. ఆమె మూడవ నేత్రాన్ని తన కిస్తే పెండ్లి చేసుకొంటానన్నాడు. అందుకు ఆమె సంతోషంగా అంగీకరించి తన మూడవ నేత్రాన్ని అతనికిచ్చింది. వెంటనే అతడు రుద్రుడై తన మూడవ కంటిని తెరిచాడు. ఆ దేవి వెంటనే భస్మమైపోయింది. ఆమె శక్తిని గూడ ఇతడు సంక్రమింపజేసుకొన్నాడు. ఆమె భస్మాన్ని మూడు భాగాలు చేసి ముగ్గురు అమ్మలను సృష్టించాడు. ముగ్గురు అన్నలను గూడ సృష్టించాడు. అందువల్ల వీరందరిలో తాను శక్తివంతుడైనాడు. అతని ఆ రూపమే రుద్ర రూపం. ఆ భావనతో ఏర్పడిన రూపాన్నే కళాకారులు ఆరాధించేవారు. అందుకే వారు రుద్రగణికలయ్యారు.

ఆది దేవునిగా రుద్రుడు పూజింప బడుతున్నాడు. రుద్ర, కాలరుద్ర, మహా కాలరుద్ర అని అతడు కీర్తింపబడుతున్నాడు. ఈ రుద్రుని భార్య కాళీ, మహాకాళిగా కీర్తింపబడుతున్నది. ఇతడే శివుడు. అందరికన్నా అధికుడు. త్రిమూర్తులలో ఆది దేవుడు. ఇతడు ఈ రుద్రమూర్తిని నాదోపాసనతో ఆరాధించిన గణికలే రుద్రగణికలు.

దేవదాసి అన్నపదం ప్రాచీనమైనది కాదని మీకు తెలుసు. ముప్పై అయిదు సంవత్సరాల క్రిందట నేను నృత్యకళా పరిశోధనను ప్రారంభించిన తొలిరోజుల్లో నేను ఈ పదాన్ని ఉపయోగిస్తే కొందరు వృద్ధ గణికలు వారి అసమ్మతిని తెలియజేశారు. మేము దాసీలం కాము, ఆరాధకులం. తెలిసో, తెలియకో మా వారు ఈ 'దాసి' అన్న పద సంబోధనాన్ని ఏనాడు సమ్మతించారో ఆనాటి నుండి సంఘంలో మా పరపతి తగ్గిపోతూ వచ్చింది, అని వారన్నారు.

ఊడిగంచేసే వృత్తి దాసీ వృత్తి. దేవాలయాలలో ఊడిగం చేయడానికి వీరు నియమింపబడేవారు కారు. దేవాలయంలోని దేవుణ్ణి తమ నృత్య విద్యలతో ఆరాధించడానికి నియమింపబడినవారు వీరు.



ఈ పదప్రయోగ విలువలను ఏనాడు మన పెద్దలు విస్మరించారో ఆనాడే ఈ గణికల పరపతి సంఘంలో క్షీణించింది. ఇది ఆనాటి వృద్ధ నాట్య కళాకారుల అభిప్రాయం. అయితే ఈ యభిప్రాయాలు గూడా రాను రాను మారుతూ వచ్చాయి. వారు కూడా ఈ దేవదాసి అన్న పద ప్రయోగానికి అలవాటు పడుతూ వచ్చారు. ఆలవాటు పడక తప్పలేదు. చివరికి వారు ఎదురు తిరిగేవరకు ఈ యలవాటు అలాగే సాగింది. అయితే ఇలాగ ఏ గ్రంథంలోనైనా వివరించబడిందా అంటే లేదనే చెప్పవలసి వస్తుంది.

మూగవోయిన ఆ దేవ నర్తకుల హృదయాంత రాళాలలో మరుగునపడి ఉండి పోయింది. వారి హృదయవీణాతంత్రులను మీటగా వచ్చిన వారి ఆలాపనలలోని అర్థం ఆ సుఖదుఃఖాలను అనుభవించిన వారికే, బాగా హృదయమున్నవారు సానుభూతితో ఆ సుఖదుఃఖాలలోని లోతుపాతులను కొలిచేవారికే వారి హృదయ వేదన అర్థమవుతుంది. బుద్ధివేరు, మనసు వేరు, బుద్ధితో ఆలోచించే వారికి మానసికానుభూతులు అర్థమౌతాయా?

నర్తన విద్యవల్ల కలిగే ఆనందాన్ని అనుభవించడం మనందరకూ తెలుసు. కాని ఆ యానందాన్ని మనకందించే ఆ నర్తకుల మనోభావాలను మనం నిశితంగా తరచి చూడం. వివిధ కళలవల్ల మనకు ఆనందం కలుగుతూ ఉంటుంది. ఆ కళాకారుల సాంగత్యాన్ని మనం అభిలషిస్తాం. అంతేకాని వారి హృదయాంతరాళాల్లో దాగియున్న వారి హృదయవేదనలను అర్థం చేసికోడానికి మనం ప్రయత్నించం. ఎందుకంటే ఆ యవసరం మన ఆనందానుభూతికి లేదు.

అటువంటి మూగ హృదయాల ప్రతిధ్వనులసారం రుద్రగణికల ప్రణవనాదం ప్రారంభమై, ప్రణయాన్ని అందించి, ప్రళయంతో అంతమౌతుంది.

ఇదొక కొత్త అనుభూతి. ఇది ఒక కొత్త చూపు, ఇదొక కొత్త ఆలోచన, ఇదొక కొత్త వ్యక్తీకరణం.

## పింగళి లక్ష్మీకాంతం

# కవనలక్ష్మీ కాంతులు

- బేతవోలు రామబ్రహ్మం, అద్దంకి శ్రీనివాస్

*గతసంచిక తరువాయి*

జీవితం...సుఖాలూ, రుచులూ, కష్టాలు... ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నింటికో వేలు కూడలి. వ్యామోహాలలోకి జారి, పొరబాట్లలో పడి, అహంతో ఎగిరి, దుఃఖంతో కృంగి, తెలిసో తెలీకో చేయకూడనివి చేస్తూ, చేయవలసినవి చేయకా, అజ్ఞానాన్ని నిత్యం తలపై మోస్తూ ఉండే అస్తిమితానికి పరాకాష్ఠ. విధీ విపరీతమైనది. 'విధిరహో బలవాన్ ఇతి మే మతిః' అన్నాడు భర్తృహరి. సాక్షాత్తూ లక్ష్మీనారాయణుల పుత్రుడైనా బూడిదకాక తప్పలేదు మన్మథుడికి. మనిషన్నాక కొన్ని ఆటుపోట్లను భరించాలి తప్పదు. ఇది పద్మాపదేశం అయ్యింది.

**సరసిజాసను జననంబు, సరసిజాక్షు**
**నాదరంబును, సరసీరుహాప్తు చెలిమి**
**కలిమి చేడియ యునికియుం గలిగి యేమి?**
**తొలగదయ్యెను తమ్మికి దుహినపీడ.**

తప్తమానవ హృదయాలకు ఇటువంటి దివ్యౌషధుల్లాంటి ఊరటలెన్నో ఈ ఖండికల్లో ఉన్నాయి. నల్లనివన్నీ నీళ్ళు తెల్లనివన్నీ పాలేననుకొనే అమాయకుడికి కవి లోకం చూపిస్తున్నాడు.

**తేనెపై నాస నీ చుట్టు తిరిగి యిచ్చకాల**
**పాటలు పాడు భృంగములు పెక్కు**
**జలజమా! సర్వ నిరపేక్ష సౌరభమును**
**గడల బచరించు సఖుడొక్క గంధవహుడె!**

ఎవరేమిటో తెలుసుకోవాలి. ముఖస్తుతులు, హంగూ ఆర్భాటాలూ చూసి మోసపోకూడదు. ఏమీ ఆశించనిదే నిజమైన స్నేహం. ఈ సందేశానికి పద్మం. తుమ్మెదలు, గంధవహుడు నిమిత్త వస్తువులు.

జలధరార్భటి ఖండికలో మేఘాన్ని, చాతకపక్షిని తీసుకొని, అపాత్ర దానం, తృప్తిలేని చోట చేసే అనర్థక దానాలను కవిత్వీకరించారు.

**'రెండు మూడు కణమ్ముల దృష్టి జెందు**
**చాతకము వంక జూడవు, సకల జలము**
**వ్యర్థముగ గ్రుమ్మరించెద వబ్ధిలోన**
**జలదమా! నీ వివేకమ్ము సంస్తుతింతు.'**

ఇది అందమైన దెప్పిపొడుపు. 'అమ్మ పెట్టా పెట్టదు, అడుక్కు తినా నివ్వదు'అన్నట్లుంటే ఎవరికి కడుపుమండదు? రూపుచెడిన నామమాత్ర సరోవరాలకు నీటినిచ్చి "జీవన ప్రదుడు" అన్నమాటను సార్థకం చేసుకోవాలట! లేకపోతే –

**వారిధారాభిషేకోత్సవం బొనర్చి**
**జగతి సలితాప మార్పుము జలదరంబ**
**కాదయేనియు దూరంబుగా దొలంగు**
**మమృతకిరణుని దర్శనంబైన గలుగు.**

ఇది మరొక చురక. దానకర్ణులందరూ ఒకసారి ఆగి ఆకర్షించాల్సిన మాటలివి. ఒక్కొక్కసారి ఎవరో కర్మకు ఎవరో బాధ్యులవుతారు. దుర్జనుల వల్ల సజ్జనులకు బాధలు తప్పవు. అందుకే దుర్జనః పరిహర్తవ్యః అన్నారు. సీతనెత్తుకెళ్ళింది రావణుడైతే సముద్రానికి పడ్డాయి సంకెళ్ళు. అడవులలో తిరిగే మృగానికేమో కస్తూరి నిచ్చిన విధి, జనారణ్యంలో సంచరించే

డా. బేతవోలు రామబ్రహ్మం, ఫోన్ : 9848169769, డా. అద్దంకి శ్రీనివాస్, ఫోన్ : 9346665196

దుర్జనుల నాలుకలకు ఇవ్వడేమిటి? ఇవన్నీ పూర్వ కవిభావనలే. చక్కని వీరి తెలుగు సేతలో పలుకుతల్లి పరవశించింది. శ్రీనాథుని అల పూతన చన్ను ద్రావి. అనే చాటువును పోలిన ఈ అనుకృతి చూడండి.

**ప్రాణహరణ ప్రగల్భతా పరిణతమ్ము**
**లైన దారుణ వస్తుచయమ్ములోన**
**నగ్రణి నటన్న యహమేల హాలాహలమ!**
**ఖలుని నాల్కకు సాటిరాగలవె నీవు**

ఇవన్నీ దుర్జన తాడనం అనే ఖండికలోని భావాలు. దుష్టులకు దూరంగా ఉండాలంటే ఈ ఖండిక తప్పనిసరిగా చదవ వలసిందే.

మోసగించడానికి స్వార్థం కుటిలత్వం రెండు ముఖాలైతే, మోసపోవడానికి అజ్ఞానం, అమాయకత్వం రెండు ముఖాలు. తన శక్తికి మించిన కాంక్షో, తెలియని తనంతోనో సింహం ఉండే తావులకు వెళ్ళ వద్దని గజబృంహితం ఖండిక పెద్ద పెద్ద ఏనుగులకు ధైర్యంచేసి గోరుముద్దల్లాంటి సుద్దులు చెప్తోంది. కొరివితో తలగోక్కోవద్దన్నదే దీనిలో నీతి. 'కోరదేనియు శుభము నీకుంభమునకు రాకు మీ దెసకున్' అనడంలో కవిత్వం పలికింది. భాస్కరశతక రచనాశైలికి ప్రతిబింబం లాంటి ఈ పద్యం చూడండి.

**ముదమున దానధారలకు మూగి కటమ్ము లలంకరించు తు**
**మ్మెదలను గర్ణచాలన సమీర హతిన్ భయపెట్టి చోపుచో**
**మదకరికిన్ స్వకీయ కటమండన హానియెగాని గండుతు**
**మ్మెదలకు నేమిచింత? యనిమీలిత పద్మ వనమ్ములుండగన్**

ఇక్కడ ధ్వని-అనవగాహనవల్ల తెగిపోతున్న మానవ సంబంధాలు. అలాగే సింహోపదేశంగానూ మానవ ప్రవృత్తుల్ని చక్కగా ఆవిష్కరించారు. *నీచాశ్రయో న కర్తవ్యః కర్తవ్యో మహదాశ్రయః*

**మృగపతి వసించు గిరిదరీగృహమునందు**
**గరటి కుంభస్థలీ మౌక్తికములు దొరకు**
**వఱడు తలదాచుకొను నేలబొరియ యందు**
**దొరకునొక దూడతోకయొ నరమొ? ఖురమొ?**

అంతటి సింహమూ జరాగ్రస్తమయ్యింది. చివరికి ఆడలేళ్ళకు కూడా చులకనై పోయింది.

**కరికి గరిణికి నెవ్వాని గర్జితములు**
**దాన పోషణగర్భపాతము లొనర్చె**
**నా మృగేంద్రుడు ముదిసి తారాడ లేక**
**యాడు లేళుల హాస్యాల కగ్గమయ్యె**

ఐశ్వర్యం, పదవి పోయిన వారిపట్ల సమాజంచూపే నిర్లక్ష్య వైఖరి కిది ప్రతీక. నిజానికి ఈ అన్యాపదేశలహరికి ఆత్మ ప్రతీకలే. ఇందులోని ఏనుగు, సింహం, కురంగి, చిలుక, కోకిలలు నిఖార్సయిన నీతుల్ని అందించే వాహికలు. ఇదో శిల్ప వైవిధ్యం.

కోకిల గానసుధను వెలారుస్తోందట. అందుకని కాకి సమూహాన్నిలా హెచ్చరిస్తున్నాడు కవి.

**'కీరచకోర పారవత కేకి సమూహములార! చాలు మీ**
**మీ రవముల్ వృథార్భటులు మెల్ల దొలంగుడు చాటుచోటికిన్**
**నోరు మొదల్ప బోకుడు వినూత్న వసంత రసాల పల్లవాం**
**కూర కషాయ కంఠమున గోకిల గానసుధన్ వెలార్చెడిన్'**

ఈ పద్యంలో – గుణీభూతవ్యంగ్యానికి పండితరాయ లిచ్చిన శ్లోకచ్ఛాయలున్నాయి.

**బ్రహ్మన్! అధ్యయనస్య నైషసమయః తూష్ణీం బహిస్థీయతాం**
**స్వల్పం జల్ప బృహస్పతే జడమతే నైషాసభా వజ్రిణః**
**వీణాం సంహార నారద శ్రుతికథాలాపైః అలం తుంబుర**
**సీతారల్లక భల్ల భగ్న హృదయో స్వస్థో న లంకేశ్వరః**

*'వసంతకాలే సంప్రాప్తే కాకః కాకః పికః పికః'* అన్నారు. దీని ఛాయ ఉన్న పింగళివారి పద్యమిది.


**తాలుచును కాక నల్లని తనువు, ఫలర**
**సమ్ములను గ్రోలుగాక, రసాల శాఖ**
**నధివసించును గాక, యుద్యాన వీథి**
**సంచరించును గాక, సుస్వర కళాప్ర**
**గల్భతన్ గాకి కాకె, పికమ్ము పికమె.**

ఎప్పటికైనా మేకవన్నె పులుల కపటం బయటపడి తీరుతుందని సందేశం. ఇలా మంచి చెడులను తెలుసుకొని ఊరుకుంటే చాలదు.

**ప్రాంగణము చేరి కావు కా వనుచు గర**
**పరుషముగ గూయు కాకిని బాఱద్రోలి**
**యెచటనో కొమ్మలందు గుహూరవమ్ము**
**సలుపు కోకిల దెస జూపు నిలుపుదు బుధుడు.**

ఇక్కడ బుద్ధుడు యోగసాధకుడు. కుహూరవం ఓంకారం. కోకిల పరబ్రహ్మ. చూపు నిలపడమే సాధన. ఇదో ఆధ్యాత్మిక సందేశం. కురంగివిలాపం కరుణరసప్లావితం. అభం, శుభం తెలీని కురంగి ఎరుకు గూడెంలో చిక్కింది. దిక్కుతోచని స్థితి. బోయవాణ్ణి దీనంగా ఇలా వేడుకొంది.

**పలల మంతయు గొనుము, జీవమ్ము తోడ**
**బొదుగు మాత్రము మిగిలిచి వదలుమన్న!**
**గడ్డి పట్టని నిసువులు గలవు రెండు స్రుక్కి**
**నాకోస మెదురులు సూచుచుండు**



పింగళి లక్ష్మీకాంతం

గుండెల్ని పిండివేస్తుందీ భావన. 'గడ్డిపట్టని నిసువులు, జీవమ్ముతోడ బొదుగు' అన్న పదాలలో ఉంది అసలు ప్రాణం. ఇక్కడ మనిషే లేడి, పొదుగే జీవితం. ఎన్నటికీ గడ్డిపట్టని (ఎంగిలి పడని) నిసువులు 1. ధైర్యం 2. వ్యక్తిత్వం, దేనికోసమూ ఈ రెంటినీ చంపుకోకూడదు. ఈ రెండూ లేని జీవి ఉన్నా లేనట్లే.

మనిషికి ఎన్నో ఆశలుంటాయి. అవన్నీ తీరవు. తృప్తి ఆవిరైతే జీవితం ఖాళీ అవుతుంది. 'తృప్తి జెందని మనుజుడు సప్తద్వీపములనైన చక్కంబడునే' అంటోంది భాగవతం. చిలుకకు పంజరం శిక్షే. అలా అనీ ఏడుస్తూ కూర్చోదు. మధురంగా పలుకుతూనే ఉంటుంది. అలా కాకపోతే బతుకు నరకమవుతుంది. ఆకొన్నకూడె యమృతము. ఇవీ కవి చిలుక పలుకులో పలికిన జీవనసత్యాలు.

**ఆవాసం బపరంజి పంజరము, నిత్యాహార పానీయ సం**
**సేవల్ రాజసుతోచితమ్ములు, సభాసీనుండవై చేయు ప్ర**
**స్తావంబుల్ రఘురామ నామ పదముల్ ధన్యుండ వన్నింట, నీ**
**భావం బా వన వృక్షకోటరదిశన్ బర్వెత్తె నేలా శుకా!**

ఆనందం వెతుక్కొనే మార్గం ఇది. 'నీకేంటి?' 'ముందుకు దూసుకుపో' అంటూ ఆనుకూల్య భావనలల్ని ప్రోత్సహిస్తూ చరిచే వెన్ను చరుపులూ విన్పిస్తున్నా యిందులో.

ఈ సంపుటిలో మరొక విభాగం ఆత్మలహరి. పనిగట్టుకొని కాకపోయినా అప్పుడప్పుడు రాసిన పద్యఖండికల స్వగతం. అనుభూతులకు ఇచ్చిన అక్షరాకృతి. పింగళి వారి ఇష్టదైవం – వారి మాటల్లోనే చెప్పాలంటే తిరుపతి వేంకటేశుడు పర్వతారోహణమనే ఖండికలో తిరుమలాయాత్రలో ఉన్న మధురానుభూతుల్ని ఏరుకొన్నారు. తనను తాను భగవంతుని ముందు తక్కువ చేసుకొని వేడుకోవడమనే 'నైచ్యానుసంధానం' వీరిలో ఎక్కువగా కనిపిస్తుంది.

గంగను స్తుతిస్తూ మాదృశ విమూఢులకెట్లు నుతింపనయ్యెడిన్ అంటారు. అలాగే సారమేమిలేని సంసారజలధిని దాటించమని ఇష్టదైవాన్ని పోతనగారి 'లావొక్కింతయు లేదు' ఫక్కీలో వేడుకున్నారు–

**గాటంబైన భుజాబల మ్ముడిగె జంఘాశక్తి క్షీణించె ము**
**న్నీటన్ మున్గుచు దేలుచున్ సొలసి శ్రాంతిం జెందితిన్ నీ తులా**
**కోటి ద్వంద్వ విభూషితమ్ములగు నంఘ్రుల్ తెప్పగా నిచ్చినన్**
**దాటింపం గదవయ్య సంసృతి సముద్రంబున్ మహానావికా**

వీరిది గడుసు భక్తి. 'ఇహంలోనే కాదు పరలోకంలోను నీదే భారం దేవా' అంటున్నారు.

**నరకము నందు త్రోసెదవో నాక నివాససుఖ మ్మొసంగెదో**
**అరమర లేక నీ సముఖమందున సేవకె నిల్పుకొందొ నీ**
**వెరుగని పాపపుణ్యముల నే నొనరింప నిహమ్మునం బలెన్**
**పరమున నన్నరయు భారము నీదె సుమీ మహేశ్వరా**

శ్రీ వైష్ణవ సంప్రదాయంలో ఇది భరన్యాసం. శరణాగతిలోని ఆత్మనిక్షేపం లాంటిది. **'నేను నీ వాడననీ సర్వమూ నీ అధీనమనీ చెప్పడం.'** దీన్ని కొద్ది భేదాలతో ప్రపత్తిగానూ చెప్పుకోవచ్చు.

ప్రణయానికి హృదయనాళాలు పెనవేసుకోవాలన్న ప్రణయరేఖలు ఖండికలో భావం, భాష, మార్దవంలో నువ్వా, నేనా అని పోటీపడుతున్నాయి. ప్రియుడు – 'తల్లీ నెడబాసి అడవి బయళ్ళయందు గ్రేళ్ళురుకు లేడిపిల్ల లాలించి తరుణకిసలయమ్ములు దినిపించు రసికశేఖరుడు. ప్రియురాలు 'కాంచన సాలభంజికకు గాదిలిచుట్టం' మరింక ప్రణయం ఎంత తీవ్రంగా ఉంటుందో వేరే చెప్పనక్కర్లేదు. అందులోనూ విప్రలంభశృంగారం. అనుభావాలు, వ్యభిచారీ భావాలు ఒకటేమిటి? అన్ని అవస్థలూ ఇందులో ఉన్నాయి. అన్నీ వాటికి లక్ష్యాల వంటి పద్యాలే.

**(శ్రుతులు సరిచేసి యుష్మ దంకితములైన**
**కృతులు పాడగ వీణ పట్టితిని గాని**
**కటకటా ఏమి చెప్పుదు కంఠమునకె**
**కాక హస్తమ్మునకు గాద్గద్య మొదవె**

ఈ ప్రియురాలి విరహవర్ణనలో *'కుచప్రత్యాసత్త్యా హృదయమపి తే చండి! కఠినమ్'* అన్న మయూరుని పూరణ గుర్తుకు వస్తుంది. తిక్కనను శౌరిగా ఆవిష్కరించిన ఖండికలో కొత్తదనం ఉంది.

**కత్తియు కత్తలంబు గొని కన్నుల నెఱ్ఱని నవ్వు నవ్వుచున్**
**మత్త విరోధి సైన్యముల మార్కొన నీ వరుదేర వాణికిన్**
**పొత్తగు నీ ముఖాబ్జమును పోలగ జూచి రసార్ద్రచిత్తులై**
**ఎత్తిన కత్తు లాడక మహిన్ బడి యెందరు నీకు మ్రొక్కిరో**

ఆత్మలహరిలో కొన్ని స్మృతి కవిత్వాలున్నాయి. బాలగంగాధర తిలక్, కాశీనాథుని బ్రహ్మయ్య లింగంగారు, చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు (గురువు), అడవి బాపిరాజు, పింగళి లక్ష్మీకాంతమ్మ (భార్య)లు పరమపదించినప్పుడు కలిగిన ఆత్మదుఃఖం కవిత్వంగా ప్రవహించింది.

**ఓ తత్త్వజ్ఞ! భువిన్ ఫలింపని మహోద్యోగమ్ము నాకమ్ము నం**
**దే తీర్పం గలనంచు నీకునయి నీవే రాయబారమ్ము పో**
**నీ తృష్ణాతురు లెల్ల నొర్దెరచి నిన్నీక్షింపుచున్నారికన్**
**స్వాతంత్ర్యామృత శీకరప్రకరముల్ వర్షింపు గంగాధరా!**

దుఃఖం పూసిన తియ్యటి ఊహ ఇది. 'గంగాధరా' సాభిప్రాయ విశేషణం. *'నిశ్చితార్థా న్న విరమంతి ధీరా'* అన్న భర్తృహరి వాక్యానికి తిలక్ మహాశయుని లక్ష్యంగా చూపారు. *'సహజగీర్వాణ వాణీ ప్రశక్తులైన దేవతలు చెప్పగల రింక తెలుగు కవిత. సాగగలదింక దిక్పాలసభలయందు అద్భుతావహ శతావధానాంధ్ర కవిత'* అన్న వీరి కవిత్వం చెళ్ళపిళ్ళ వారి కీర్తిని, దిగంతాల్ని దాటించి స్వర్గం బాట పట్టింది.

చిక్కని కవిత్వానికి, చక్కని ధారాశుద్ధి తోడైతే వస్తువు ఎంత స్ఫుటమౌతుందో వీరికి బాగా తెలుసు.

**శీతార్తి బాపు సంజీవిగా దొలిగట్టు**
**చరియందు మొలచు నోషధి యనంగ**
**నుభయ సంధ్యోపాస నోర్జస్వులకు బ్రాహ్మి**
**చాచిన యభయ హస్తం బనంగ**
**వన్నె మాసిన పద్మవనికి నూతన వర్ణ**
**లేపం బొనర్చు తూలిక యనంగ**
**గార్కొన్న నిబిడాంధకార పాటనము సే**
**యగ నైనవజ్రశూలాగ్ర మనగ**

**దినమహాలక్ష్మి కుంకుమ తిలకరచన**
**చేసికొన విశ్వకర్మ సృష్టించినట్టి**
**కాంచనశలాక యనగ దోతెంచె నదిగొ**
**తరణి తొలికిరణమ్ము వేదధ్వజమ్ము**

పింగళివారు అలంకారగ్రంథం రాయని లోటును ఈ రచనతో తీర్చుకొన్నారు. గణపవరపు వేంకటకవి తన 'ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసమనే ప్రబంధంలో ఒకవైపు కథను నడుపుతూనే పద్యాలన్నింటినీ చిత్రకవిత్వానికీ, ఛందోగుణరసాలంకారాది లక్షణాలకు లక్ష్యాలు చేశాడు.

ఈ లక్షణం కొంత పింగళికీ ఉంది. కావ్యసందేశం జగద్ధితం. దానికి ప్రతీకలుగా కొన్ని వస్తువులు తీసుకొన్నారు. మనిషికి కొంచెం ఆలంకారికత ఎక్కువేమో ఏ అవకాశాన్నీ విడిచిపెట్టలేదు. ఓపిగ్గా వెదకాలే గానీ కావ్యగుణాలు, అలంకారాలు, వివిధ అవస్థలు పుంఖానుపుంఖాలుగా కన్పిస్తాయి. ఇక ఆ ఓపిక చేసుకోవడం ఔత్సాహికులైన పరిశోధక విద్యార్థుల వంతు. (దీనిపై ఎంచక్కా ఎం.ఫిల్ చేయవచ్చు.) ఇప్పటికే ప్రణాళిక ప్రవచించిందనిపిస్తోంది. ఋణశేషం, శత్రుశేషం ఉండకూడదన్నారు గాని, గుణశేషం ఉంచుకోకూడదని మనవాళ్ళు చెప్పలేదు. కాబట్టి అన్నీ కాక కొన్నింటితో ఇక్కడికి ఇలా సరిపెట్టుకొని ముందుకు పోదాం!

*'సరసములగు వాక్యంబులు వరుసను వేరేరు మించు వగ మాధుర్యంబు.'* ఈ గుణానికి లక్ష్యం–

**హరుశిరమందు నిన్ను గని యంబిక పట్టగ రాని యీసునన్**
**జురచుర లాడుచున్ గరకు చూపులు నీ దెస బర్వ జేయగా**
**నురిమియు బొంగియున్ బొరలియున్ నురుగుల్ వెలి గ్రక్కియున్ భయం**
**కరముగ దాండవించు తరగల్ భవతాప మడంచు జాహ్నవీ**

అలాగే సమతాగుణం ఉన్న ఈ పద్యం చూడండి–

**జననమా! విశ్వవిశ్వంభరాభరణుడౌ**
**నారాయణుని పాదసలినమందు**
**ఆవాసమా! భూధరాత్మ జాక్రాంతవా**
**మాంగు డౌభవు నుత్తమాంగమందు**

**వర్తనంబా! మాదృశార్త మానవ సము**
**ద్ధరణదీక్షా పుణ్యతంత్రమందు**
**మహిమమా! సంస్పర్శమాత్ర సర్వప్రాణి**
**జాడ్యాపనోద కౌశలమునందు**

**శాపపరిదగ్ధ సగరరాజర్షి సుతుల**
**బుణ్యభువనమ్ము సేర్చుట ముఖ్యలీల**
**గంగ యను నక్షరములె యుత్కర్షనిధులు**
**అన్యవర్ణన లెల్ల నిరర్థకములు**

ఉల్లేఖాలంకారానికి ఉదాహరణ –

**స్థానము మోక్షలక్ష్మికి నిధానము ధర్మ మహత్తకున్ దిరో**
**ధానము మందబుద్ధికి విధానము మానస తుష్టికిన్ సమా**
**ధానము మేధకున్ సుపరి ధానము ధాత్రివధూటికి న్మహా**
**ధానము శ్రీకి నీతనువు తాపహరమ్మగు నాకు జాహ్నవీ**

ఇంత చక్కని కవిత్వం రాసి కూడా కవిగా పేరు రావడం గురించి – *యోగ్యతలేని యశమ్ము మోసితి* ననటంలో వినమ్రత ఉంది. ఈ ఆత్మలహరి ఖండిక అసంపూర్ణం. అయినా సాహిత్య రంగంలో ఉన్నవారు తెలుసుకోవలసినవెన్నో ఉన్నాయి. పసలేని వ్యాసాలు రాయటం, రాసినదల్లా అచ్చుల్లో చూసుకోవాలన్న మోజు ఆయనకు లేదు. ఇది రచనారంగంలో ఉన్న వారికి ఎంతో అవసరం. కృతజ్ఞత, సత్యవర్తనం, దాతృత్వం, జగద్ధితకాంక్ష వీరికి బలం. మేలు మరచినవారిని క్షమించలేని గుణం బలహీనత. సూర్యుణ్ణి స్తుతించినా, వెంకన్నను స్తుతించినా అది అందరి మేలుకోసమే. మేము, మాకు, మా అన్న మాటలే కాని నేను, నాకు, నా అన్న మాటలు కన్పించవు.


వర్ణనలలో సంస్కృతాంధ్ర కవులు తీర్చిన మార్గాలున్నాయి. ఆటవెలదులపై వీరికి ఆసక్తి లేదు. సీసపద్యాలలో కూడా అన్నీ తేటగీతులే రాశారు. ఆలోచనలలో అభ్యుదయం, సమకాలీన సమాజంపై స్పందనా ఉన్నాయి. పలుకు వెంటే పడిపడి పరుగులెత్తే నుడికారం, మూలభావాలకు నగిషీలు దిద్దే నైపుణ్యం, తేట తెలుగునూ, గీర్వాణభాషనూ ఒకేలా నడపగల నేర్పు, అన్నింటికీ మించి, ధారాశుద్ధీ, భావనా శక్తీ ప్రతి ఖండికకూ సమత్వాన్నిచ్చాయి. ఈ సంపుటిని కావ్యమాలను చేశాయి.


ఒక్కమాటలో చెప్పాలంటే – భంగ్యంతరంగా మానవ జీవిత చిత్రణ ఈ కావ్యంలో వస్వైక్యత, హితోక్తులు, మానవ ప్రవృత్తులు, జీవితంలోని భిన్న పార్శ్వాలు, దృష్టికోణాలు, తరుణోపాయాలు, వ్యక్తిత్వ వికాసాలు కలిగిన అన్ని ఖండికలూ జీవితం చుట్టూ తిరగడం విశేషం. హృదయచేతన వ్యష్టి మూలాలనుండి మొదలై సమష్టిశిఖరాలపై ఫలిస్తుంది. ఇదే వీరు ఆశించిన, సాధించిన కావ్యప్రయోజనం. మి

## అక్షరాల కౌగిలి


అతి ప్రాచీన సంస్కారాలు
ప్రకృతి శక్తులను ప్రస్తుతించిన మంత్రాలు
నీ రూపంలో మమేకం అయినాయి
నీవొక అగ్నిపునీతవు
నీ హృదయంలో
ఒక మహత్తర ధర్మం జ్వలిస్తుంది.
నీ సౌందర్య దీప్తి
అజంతా ఎల్లోరా గుహల్లో ప్రక్షిప్తమై వుంది
నీ వొక ప్రాచీన చిత్ర శిల్పానివి
అయితే –
నీలాంటి మహిళ కన్పిస్తుందనుకోలేదు –
నా హృదయ కంపనలు నీకు తెలుస్తాయని భయపడ్డాను
నీ తొట్రు పాటులోని అర్థాన్ని గ్రహించాను
అయిదు నిమిషాల పరిచయానికి స్వస్తి చెప్పి
బాధగా వెనుదిరిగాను –
నా కన్నుల్లోంచి ఒక ఆరాధనాభావాన్ని ప్రసరింపజేశా!
మధురంగా నవ్వావు నీవు
మరలా కలుసుకోలేం
నీవు జ్ఞాపకం వచ్చినప్పుడు
చిందే కన్నీళ్ల బిందువులలో
ఈ అక్షరాల కౌగిలిలో బంధిస్తున్నా.


**– ముంగర జాషువ**




# చదవండి...




**1, మాటతీరు :** రచయిత యార్లగడ్డ బాలగంగాధరరావు. ఇంతకు పూర్వం రచయిత వ్రాసిన 'మాట– మర్మం' (2000) పుస్తకానికి పాఠకుల నుంచి విశేషాదరణ లభించటంతో, దానిలోని విషయాలకు మరికొన్ని విశేషణాలు చేర్చబడి 'మాటతీరు' పేరుతో పునర్ముద్రణ పొందిన రచనల సంకలనమిది. మన భాషా పలుకుబడితో అంతఃశ్చేతనగా ప్రయోగించే మాటల వెనుక నున్న అంతరార్ధాన్ని కాలగతిలో అవి చెందిన భావార్థ పరిణామాలను విపులంగా చర్చించి వాటి అసలు అర్థాన్ని మన ముందుంచే రచన యిది. లబ్ద ప్రతిష్టులైన యార్లగడ్డవారి ప్రతిభకు అద్దంపట్టే అర్థవంతమయిన రచనయిది.

**2, సాహిత్య మరమరాలు :** రచయిత మువ్వల సుబ్బరామయ్య. ఇది వందేళ్ళ సాహిత్యంలో జరిగిన అపూర్వ ఘటనల సంకలనం.

**3, ప్రాచీన కవులు :** రచయిత సాహిత్యాభిమాని మువ్వల సుబ్బరామయ్య. ఎందరో కవుల గురించి స్థూలంగా పాఠకునికి సమాచారం అందించే పుస్తకం. ఎందరో గొప్పరచయితల పేర్లు వినటమే తప్ప మరేమీ తెలియని వారికి, సంక్షిప్తంగా వారి గురించి తెలుసుకునే అవకాశం ఈ పుస్తకం కల్పిస్తుంది. సాహితీప్రియులందరివద్ద వుండదగిన పుస్తకమిది.

**4, ప్రేమించకుండాం రండి :** రచయిత సి. ధర్మారావు. ఈ పుస్తకం చదివిన తరువాత మనం రచయితను, ఆయన రచనను ప్రేమించకుండా ఉండలేము. 'Say it with flowers' అన్న భావం ఉట్టిపడేలా వున్న ముఖ చిత్రం. ఇందులో వున్న చిరువచన చమ్కీలు గురించి చెప్పకనే చెబుతుంది. నిబద్ధత, చిత్తశుద్ధితో ఎంతటి తీవ్రవిషయాన్నైనా మృదువుగా చెప్పాలనే 'ధర్మాగ్రహి' ధర్మారావు గారి రచనలు మనల్ని ఆలోచింపజేస్తూ గిలిగింతలు పెడతాయి.

**5, బీద బ్రతుకు :** యలమంచి వెంకటప్పయ్యగారి స్వీయ చరిత్ర ఈ పుస్తకం. బి(వి)భూతి భూషణ్ బెనర్జీ వ్రాసిన పథేర్ పాంచాలి చదివి, అబ్బురపడే మనకు, మన భాషలో కూడా అటువంటి రచనలు, రచయితలు ఉన్నారనే దానికి తార్కాణం ఈ రచన. ఇది కల్పితంకాదు. వాస్తవ జీవన చిత్రణ. వంద సంవత్సరాలకు పూర్వము మనదేశ పరిస్థితులు ఎంత అధ్వాన్న దశలో నున్నాయో అటువంటి కనిష్ఠ స్థాయినుంచి కష్టాలనోర్చి, స్వయం కృషితో పైకి వచ్చిన దీపరేఖ లాంటి వ్యక్తులెందరో? వారిలో ఋషిలాంటి వ్యక్తి వెంకటప్పయ్య. ఇందులో కష్టసుఖాలలో కష్టాలదే అగ్రభాగం. ఆనాటి సాంఘిక, సామాజిక జీవితం ఎలా ఉండేదో, అగ్రకుల ప్రభావం ఎంత తీవ్రంగా సంఘంలోని అసమానతలను పెంచి పోషించిందో తెలుసుకోవాలంటే ఈ రచన తప్పక చదవాలి.

**6, దీపలేఖ :** ఇదొక కథా గుచ్ఛం. రచయిత్రి సోమరాజు సుశీల. జీవితంలో అనుభవాలను, జరిగిన సంఘటనలను, కల్పనలను జోడించకుండా రాసి, గొప్పకథలుగా మలిచారు. ఆత్మస్థైర్యాన్ని నూరిపోసి ప్రభోదాత్మక సందేశమిచ్చే కథలివి. రచయిత్రిది ఆహ్లాదకరమైన రచనా శైలి.

**7, చేనేత – కవితా సంకలనం :** రచయిత పున్న అంజయ్య. చేనేత వృత్తిపై రాష్ట్రంలోని ఎందరో కవులు వ్రాసిన కవితలు, గేయాలు, పద్యాల మూడవ సంకలనమిది.

**8, మృత్యుంజయ :** రచయిత్రి అబ్బూరి ఛాయాదేవి. తన తండ్రి గారి జీవిత చరిత్రను, తండ్రీకూతుళ్ళ మధ్య నడచిన ఉత్తరాలు ఆధారంగా రచయిత్రి వ్రాసిన రచన ఇది.

**౯. ఆర్తారావం. జాతశ్రీ గారి కథాసంపుటి :** 'రచయిత ఒక చిన్న జీవితంలో అనేక జీవితాలు గడప గలుగుతాడు" అని ఎహ్రెన్‌బర్గ్ చెప్పిన మాటలు జాతశ్రీ కథలు నిజం చేస్తాయి.

"కథలే రచయితల్ని ఎంచుకుంటాయి. తమను వెల్లడి చేయమని వత్తిడి చేస్తాయి. రచయిత ప్రశాంత జీవితాన్ని వేదనకు గురిచేస్తాయి. అదిగో అందులో నుండి బయట పడేందుకే రచయిత ఇతివృత్తాలకు అక్షరరూపం ఇస్తుంటాడు." ఇదే ఒక రకమైన ఆర్తారావం! చేతి వృత్తులు, చిల్లర దుకాణాలు ప్రపంచీకరణ సుడిలో ఎలా కొట్టుకు పోతున్నాయి – ఆయావ్యక్తుల బ్రతుకు బళ్ళు ఎలా విరిగిపోతున్నాయో నిజాయితీగా కథలల్లి కళ్లముందుపెట్టారు జాతశ్రీ.

సంభాషణలు ఎంతో సహజంగా ఆయా వ్యక్తుల భాషలోనే చెప్పి, సన్నివేశాలకు ప్రాణం పోశారు.

ఇప్పుడు కథలెక్కువగా – దాదాపు 10 సంవత్సరాల నుంచీ – ఈ ఇతివృత్తాలతోనే వస్తుండటంతో – వస్తు వైవిధ్యం కొంత తగ్గిందని, అనిపించినా – కథలన్నీ చదివిస్తాయి, ఆలోచింపజేస్తాయి.

**10, 'దీగుడుకింద అద్దప్పెంకు'** : మానవతావాదం

**డా॥ విద్యాసాగర్** తన **"దీగుడు కింద అద్దప్పెంకు"** కవితా సంపుటిలో వైవిధ్యభరితమైన వస్తు స్వీకరణ చేయడం కనిపిస్తుంది. ఒక చోట 'నిశ్శబ్దలయలకు ప్రతిధ్వని కావడం', 'నీలగిరిపిట్ట'తో మాట్లాడటం, ఇంకొక చోట 'మతమా! పవిత్ర క్రౌర్యమా' అని అనడం ఇంకొకచోట 'వేర్లకే పనిమీద పాఠాలు చెబితే' ఎట్లా అని గుంటూరు ఏసుపాదం కవితకు జవాబివ్వడం, ఇంకొకచోట స్త్రీవాద సానుభూతి పరుడిగా "వీళ్లక్కొంచెం ధైర్య మిద్దాం, మీ నీడల్లోనే ధైర్యముంది' అనడంలోనూ, మిత్రుల మరణానికి తీవ్రంగా 'మంచి స్నేహితుని'గా ప్రతిస్పందించడమూ కనిపిస్తుంది.

ఏ కవితకు ఆ కవిత చదివితే బావుంటుంది గాని, మొత్తం కవితా సంపుటిని చదివిన తరువాత వస్త్వైక్యము వుంటే బాగుండేదని పించింది. డా॥ విద్యాసాగర్ గాఢంగా నమ్ముతున్న భౌతిక వాదం / మానవతా వాదం కొన్ని కవితల్లో ఛాయగా గోచరిస్తూ వుంటుంది. అదీ ఆయన నేపథ్యం.

ఎవరి కవితయినా ఒక్కటి చదివితే చాలు. ఆ కవి వస్తువుతో ఎంత వరకు తాదాత్మ్యం చెందగలడనే విషయం స్పష్టమవుతుంది. ఒక్కొక్కసారి కవి ద్రవీకరణస్థితి కవితలోని సాంద్రతను తగ్గిస్తుంది. "అమ్మా ఆకాశాలు కవలపిల్లలే" అనే కవితలో ఈ స్థితి కనిపిస్తుంది. అయితే రెండు బలమైన వాక్యాలు ఇందులో చోటుచేసుకున్నాయి. అవి.

**"అమ్మా ఆకాశాలు కవలపిల్లలే**
**విశ్వానికి వీళ్ళిద్దరూ రెండు గుండెలే"**

'అమ్మ' మనిషి 'ఉనికి'కి కారణమైతే, ఆకాశం అంటే (గగనం, ఆకాశం, శూన్యం – అమరం) శూన్యం 'విశ్వం యొక్క' ఉనికి కారణమౌతుంది. అమ్మ, ఆకాశాల అస్తిత్వాలను పోల్చడంలో డా॥ విద్యాసాగర్‌లోని తాత్విక ధోరణి వెల్లడవుతుంది.

'ధన్య వాదాలెవరికి? సమస్తం సదివిస్తిమి గద సామీ' అనే కవితల్లో 'వ్యంజన' వుంది. ఆవేదన దాగుంది.

**"సత్తివేడి కాణ్ణించీ కలికిరిదాకా**
**మాలా మాదిగ వాడల కదాగనే బెదుతుందాము**
**రెండు లోటాలుండనే వుండాయి**
**అడివిని నమ్ముకున్నోళ్ళను**
**మనుసుల్లెక్కన ఎవరు జూస్తుండారు?"**

ఈ ప్రశ్న డా. విద్యాసాగర్‌ను బాగా వేధించి వుంటుంది. దుఃఖాన్ని కలిగించి వుంటుంది. అందుకే ఆయన సాహితీ రంగంలో తన వాణిని వినిపించ పూనుకొన్నాడు.

*స్వాయుధం కవితలో* –

**"నువ్వున్నచోట నిలబడే**
**ఆచోటు విలువ తెలుసుకుంటే**
**నీ పరిసరాలు పూచిన పువ్వే అవుతావు"**

*అదే విధంగా*

**"వొక్క ముక్కరాయకనే**
**బుద్ధుడు, సోక్రటీస్‌ల సరసన నిలబడతావ్"**

అని కవి రాసిన వాక్యాలతో ఒక ఉన్నతోద్యోగి సాహితీ జగత్తుతో 'ఢీ' అంటున్నాడు. మి

# సభ్యులు కావలెను

"నీడను చూచి భయపడేవారు, దౌర్భాగ్యపు పనులు చేయుచూ డాబుగా తిరిగేవారు, తానే గొప్పవాడినని భావించుకొని గర్వముచే విఱ్ఱవీగుచు తలకు దగని వేషములు వేసి జనులను మోసము చేయుచు ధనమార్జించువారు, దొంగభక్తులు, మాయమాటలు చెప్పి నీతిమాలిన పనులు చేయుచు ఉదర పోషణ గావించుకొనువారు, ధర్మోపన్యాసములు జేయుచు న్యాయమార్గమున సంచరించువారు వలె కనబడుచు అవినీతి కార్యంబులు చేయ త్వరపడువారు, త్రాగుబోతులై, జూదరులై, ముండలనుంచుకొని రోగములచె తీసుకొనుచు పెద్ద వేషములు వేసి, ఉద్యోగస్తులమని, జమీందారులమనియు, షాహుకారుల మనియు, భాగ్యవంతులమనియు, గర్వపడు మహానుభావులు, ఇతరులపై లేనిపోని నేరములు కల్పించి కలహించువారు, ఒకరి కొకరికి తంత్రములు పన్ని కలహమును గల్పించువారు, ఏ యవినీతియైన జేసి కుటుంబమును బోషించుకొన్న చాలునని చెప్పి యితరులచే నట్టి యవినీతి పనులు జేయించుచు వారి వలన గౌరవము నొందుచుండువారు, ఎల్లప్పుడు తిట్లయందే కాలము గడుపువారు, పిత్రార్జితములైన భూములనమ్మి ముండలకు సొమ్ము కొల్లబెట్టి తిన తిండి లేక కడుపుచేత బట్టుకొని దేశాంతరములకేగినవారు, తుంటరులైన గొప్పవారితోను జమీందారులతోను గలసి తుంటరిపనులు చేయుటయే గొప్పయని నమ్మి వర్తించు పండితులు గావలెను! ధనము గలవారి పజ్జ చేరి వారి హృదయము నాకర్షించి తుదకు వారిని భిక్షుకులుగా చేయుచు పండితులమని చెప్పుకొను తుంటరులను కావలయును. ఎల్లప్పుడు వీధుల వెంబడి సంచరించుచు చూచిన స్త్రీని మోహించు గొప్పవారు, గొప్ప వారికి కోపము వచ్చునేమో యను భయము చేత వారు చెప్పిన దుష్కార్యముల నాచరించు కొద్దివారు కావలయును! అబద్ధములాడి, దొంగపత్రములు వ్రాసి, దొంగ సాక్ష్యము లిచ్చి సంసారము పోషించుకొనుచున్న వృద్ధులు, యువకులు గావలయును. తాగకూడదనియు, తుంటరి పనులు చేయుగూడదనియు, నీతిగా నుండవలెననియు జెప్పు దుర్మార్గులు, తుంటరులు, నీచులు, త్రాగుబోతులు, కన్నగాండ్రు, ముండల ముఠాకోరులునైన బియ్యేలు, ఎంయేలు, న్యాయవాదులు కావలయును! ఇట్టివారు దేశమును బాగుచేయువారు కావున వారిని మా సమాజంలో జేర్చుకొని వారికి తగిన బహుమానములనిచ్చి సత్కరించుచుందుము. త్రాగుబోతులైన కవులకు నుద్యోగస్తులకు వారి వారికి తగిన మరియాదలు చేయుచు ఆదరింతుము. ఇట్టివారిని పోషించుటకై పదికోట్ల రూపాయలు మూలధనముతో సమాజము బయలుదేర తీసినాము. ఈ సమాజము వారు లోకములోగల లోటుల సవరించి దేశమును క్షేమకరమైనదిగా జేయుదురు గావున నందరు తమ పిల్లలను బుద్ధి లేక పాడైపోయేవారిని ఈ సమాజములో జేర్చి బాగు చేయువలయుననని కోరబడుచున్నారు. వేము కేవలము లోకమునుద్ధరింపవలయుననియే ఈ సమాజము స్థాపించుచున్నాము గాని స్వలాభము కోరి కాదు. ఇందు చదువుకొన్న వారును, న్యాయవాదులను, ఉద్యోగస్తులు, జమీందార్లు, భాగ్యవంతులు వున్నారు. కావున చేరువారు సంశయింపబని లేదు. త్రాగుడు, జూదము, తుంటరితనము బాగుచేయుటకు ముఖ్యమైనవి గనుక గొప్పవారిలో ననేకులు ఇట్టి పనులు నాచరించుట వలనను, ఈ సమాజమునకు మంచినడుపు వచ్చుననే యాశతో దీనిని స్థాపించినాము గనుక తప్పక చేరవలయును. బాలురు చేరే యెడల ఈ సమాజములో చేసెడు తుంటరి పనులు చూచి యింటిలో నుండి కాటికి కాళ్ళు జాపుకున్న ముసలి తల్లిదండ్రులుగాని, పోషకులుగాని యేమైనా అంటారేమో అన్న భయమక్కరలేదు. వారికి యెంత మాత్రము తెలియదు సరిగదా ఇందులో నున్న పండితులు పాండిత్యము నేర్పి, కవులు కవిత్వము నేర్పి, మహారాజులు బిరుదులిచ్చి, ధనికులు శాలువలు పతకములు బహుమానము చేసి బంపుదురు గావున విభూతి పిండికట్టు ధరించి మునుపటికన్న డాబుగా తిరుగవచ్చును. కాన నందరును తప్పక చేరి ఈ సమాజము వారి యుద్యమమునకు బ్రోత్సాహము కలుగ చేయుదురు గాక! మీ సమాజమును చూచి యెవరేమనుకొన్నను లక్ష్య పెట్టక యెల్లప్పుడు సాగేటట్టు ఏర్పాటు చేసినాము. కనుక పోవునేమోయని భయపడనక్కరలేదు.

ఇందులో త్రాగుబోతులున్నారని గాని, తుంటరులున్నారని గాని ఎవరునూ చెప్పుకోగూడదని వేము అందరకు తెలియజేసినాము. కావున సమాజములో చేరేవారికి రహస్యము బయటపడునేమో యను భయమక్కరలేదు. దరఖాస్తులు పంపువారు మా క్రింది చిరునామాదారుని పేర పంపవలయును. ఇందు ముఖ్యముగా డాబుగా వేషములు వేసి లోపల లోపల త్రాగి, తుంటరి పనులు చేయుటయందు ఆసక్తి కలిగి చరించే మహానుభావులనే చేర్చుకొందుము. కాని అవకతవక ప్రసంగములు చేయుచు, ముక్కుకు సూటిగా నడచుచున్నామనే వెఱ్ఱిబాగుల వారిని జేర్చుకొనమని యిందుమూలముగా దెలియజేయుచున్నాము."

**అప్పులపాలెం,** *ఇట్లు*

**సంగ్రామపురం** **బడాయి భీమన్న**

*(చిలకమర్తి లక్ష్మీనరసింహం)*

ఈ క్రింది పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి.
వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.

**I. మిసిమి ప్రచురణలు**

| | | | ₹ |
|---|---|---|---|
| 1. | బాపు బొమ్మలు | (హార్డ్ బౌండ్) | 200.00 |
| 2. | మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు | *అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి* | 500.00 |
| 3. | బుద్ధుని దీర్ఘ సంభాషణలు | " " | 200.00 |
| 4. | బుద్ధుని మధ్యమ సంభాషణలు | " " | 200.00 |
| 5 | ఆచార్య నాగార్జునుడు | " " | 150.00 |
| 6. | దూర తీరాలలో... | *వల్లభనేని అశ్వినీకుమార్* | 99.00 |
| 7. | అమాహ | " " | 60.00 |
| 8. | అంతర్వీక్షణం | " " | 60.00 |
| 9. | సిద్ధార్థ | " " | 100.00 |
| 10 | నాలో నేను | " " | 60.00 |
| 11. | కథాంజలి–1 | *ఎస్సారె* | 80.00 |
| 12. | కథాంజలి–2 | " " | 110.00 |
| 13. | THE THUNDERCLOUD | S.R.A. | 120.00 |

**II. వేమన ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | లోకకవి వేమన – *మరుపూరు కోదండ రామిరెడ్డి* | 100.00 |
| 2. | మన వేమన – *ఆరుద్ర* | 80.00 |
| 3. | వేమన – *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 4. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 5. | VEMANA - Through Western Eyes. - *V.R. Narla* | 50.00 |
| 6. | విశ్వకవి వేమన – *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* | 100.00 |
| 7. | పురాణ ప్రలాపం *(ప్రొ. హరిమోహన్ ఝా, అనువాదం : జె. లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 8. | THE FIRST POETICAL READER *(Walter Joyes and N.C. Sashacharloo)* | 50.00 |
| 9. | వేమన – *రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ* | 100.00 |
| 10. | వేమన ఉపదేశామృతం – *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |

**III. ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | బౌద్ధ ధర్మ దర్శనమ్ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్)* | 70.00 |
| 2. | మహామానవ బుద్ధ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి)* | 75.00 |
| 3. | మిళింద పన్హ : ఉపమలు – *బోధ చైతన్య* | 75.00 |
| 4. | మహా పరిత్తం – *బోధ చైతన్య* | 100.00 |
| 5. | జాతక కథలు – *శివశంకర స్వామి* | 60.00 |

**IV. ఆర్ట్స్ & లెటర్స్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | తెలుగా, ఆంధ్రమా? | 40.00 |

❁ ***మిసిమి పూర్వ సంచికలు కావాలంటే సం॥, నెల తెలుపుతూ ఒక కార్డు రాయండి*** ❁


మిసిమి మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in ; Visit us at : www.misimi-monthly.com

**మిసిమి** *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹200/- తో పాటు పంపండి. బయటి చెక్కులకు అదనంగా ₹30/- కలపండి.

**1. పేరు :** ..............................................................

**2. చిరునామా :**

ఇం.నెం. ..............................................................

వీథి ..............................................................

పేట ..............................................................

ఊరు ..............................................................

పిన్ ..............................................................

**3. సంతకం :** ..............................................................

---

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |

---

చందాలు **మిసిమి** పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in
Visit us at : www.misimi-monthly.com




భోగిమంట (శీలా వీర్రాజు)

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2009-11



కనుమరుగవుతున్న దృశ్యం (శీలా వీర్రాజు)